సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00

సంపుటి: 12
సంచిక: 319

SUNDAY Special

ఆదివారం 9-2-2020

'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

వియ్ ఆర్ లక్కీ

హీరో శ్రీకాంత్ దంపతులతో 'సాక్షి' ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూ - ఫ్యామిలీలో

మ్యాచ్‌తో పాటు సిరీస్ కూడా...

న్యూజిలాండ్‌తో రెండో వన్డేలో 22 పరుగుల తేడాతో ఓడి సిరీస్ కోల్పోయిన భారత్ - స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

వనంలోకి సారలమ్మను తీసుకెళ్తున్న దృశ్యం

జన దేవతల వనప్రవేశం

సమ్మక్కను తీసుకెళ్తున్న దృశ్యం

ముగిసిన మేడారం మహా జాతర

- చివరిరోజు సుమారు 15 లక్షల మంది దర్శనం
- కేంద్ర మంత్రి అర్జున్ ముండా, రాష్ట్ర మంత్రుల పూజలు
- బుధవారం తిరుగువారం పండుగ

మేడారం నుంచి సాక్షి ప్రతినిధి: తెలంగాణ కుంభ మేళా మేడారం మహాజాతర అధికారికంగా ముగిసింది. నాలుగు రోజులపాటు భక్తుల పూజలు అందుకున్న వనదేవతలు సమ్మక్క-సారలమ్మ శనివారం సాయంత్రం తిరిగి అడవిలోకి ప్రవేశించారు. ఆదివాసీ సంప్రదాయాలతో పూజారులు, వడ్డెలు వనదేవతలను వనంలోకి తీసుకెళ్లారు. మేడారం గద్దెలపై కొలువుదీరిన నలుగురు దేవతల వనప్రవేశం ఉద్విఘ్నంగా సాగింది. ఆ దృశ్యం చూసేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చారు. జాతర చివరి రోజున సుమారు 15 లక్షల మంది భక్తులు వనదేవతలను దర్శించుకున్నారు. శనివారం మేడారంలో భారీ వర్షం కురవడం, ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించడంతో సొంతూళ్లకు తిరుగు పయనమైన భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ప్రత్యేక పూజలతో వనంలోకి...

దేవతల వనప్రవేశ ఘట్టం శనివారం సాయంత్రం ప్రత్యేక పూజలతో ప్రారంభమైంది. సాయంత్రం ఆరు గంటల సమయంలో దర్శనాలను పూర్తిగా నిలిపివేశారు. గోవిందరాజును దబ్బగట్ల గోవర్ధన్, పోదెం బాబు నేతృత్వంలోని పూజారుల బృందం గద్దెల నుంచి రాత్రి 7:08 గంటలకు కదిలించి ఏటూరునాగారం మండలం కొండాయికి తరలించింది. రాత్రి 7:04 గంటలకు సమ్మక్క పూజారులు కొక్కెర కృష్ణయ్య, సిద్దబోయిన మునీందర్‌లతో కూడిన మరో బృందం గద్దెల వద్ద పూజలు నిర్వహించాక సమ్మక్కను అక్కడి నుంచి

మిగతా 2వ పేజీలో ▶

అధికారులకు సీఎం ప్రశంసలు

మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరను విజయవంతంగా ముగించడంపై సీఎం కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. జాతరను విజయవంతం చేసేందుకు అహర్నిశలు పనిచేసిన అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. అన్ని శాఖలను సమన్వయపరిచి జాతరను అద్భుతంగా జరిగేందుకు కృషి చేసిన మంత్రులు, ములుగు జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు, జిల్లా ప్రజాప్రతినిధులకు సీఎం అభినందనలు తెలిపారు. రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకెళ్లేలా వన దేవతలు దీవిస్తారని సీఎం అన్నారు.

ఆప్ కీ సర్కార్!

ఢిల్లీ ముఖ్యమంత్రిగా మరోసారి కేజ్రీవాల్?

- ఆమ్ ఆద్మీ పార్టీకే మళ్లీ ప్రజల పట్టం!
- 2015 ఎన్నికలతో పోలిస్తే తగ్గనున్న మెజారిటీ
- బీజేపీ ప్రతిపక్షానికే పరిమితమయ్యే అవకాశం
- పోటీ ఇవ్వని కాంగ్రెస్
- ఎగ్జిట్ పోల్స్ అంచనాలు

ఢిల్లీలో పోలింగ్ 61%

- ప్రశాంతంగా ముగిసిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు
- కేజ్రీవాల్ నియోజకవర్గంలో స్వల్ప ఓటింగ్
- ఓటేసిన పలువురు ప్రముఖులు

5 లో

సంస్థ పేరు	ఆప్	బీజేపీ	కాంగ్రెస్
ఇండియా టుడే-యాక్సిస్ పోల్	59-68	2-11	0
టైమ్స్ నౌ-ఇప్సోస్	44	26	0
న్యూస్ ఎక్స్-పోల్‌స్ట్రాట్	50-56	10-14	0
ఏబీపీ-సీ ఓటర్	49-63	5-19	0-4
రిపబ్లిక్ టీవీ-జన్‌కీ బాత్	48-61	9-21	0-1
ఇండియా న్యూస్ నేషన్	55	14	1
నేత-న్యూస్ ఎక్స్	53-57	11-17	0

2015 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆప్ -67, బీజేపీ -3, కాంగ్రెస్ -0

థాయిలాండ్‌లో సైనికుడి కాల్పులు

దాదాపు 20 మంది దుర్మరణం

- థాయిలాండ్‌లో ఓ సైనికుడు విచక్షణారహితంగా కాల్పులు జరిపి దాదాపు 20 మందిని పొట్టనబెట్టుకున్నాడు. థాయిలాండ్‌లోని నఖోన్ రట్చసిమా నగరంలో శనివారం మధ్యాహ్నం ఈ దారుణ ఘటన జరిగింది.

-5లో

రక్షించండి..

- కరోనా భయంతో జపాన్ ప్రభుత్వం యెకోహోమా తీరంలో నిలిపివేసిన నౌకలోని భారతీయులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. 'డైమండ్ ప్రిన్సెస్' అనే ఆ నౌకలో నిర్బంధంలో ఉన్న బినయ్ కుమార్ సర్కార్ అనే భారతీయుడు తమను కాపాడాలంటూ సోషల్ మీడియా ద్వారా వేడుకున్నాడు.

-5లో

దిశ.. ఇక కొత్త దశ

- మహిళలు, చిన్నారుల రక్షణకు ప్రత్యేక చట్టం
- నేరస్తులకు వేగంగా శిక్షపడితేనే వ్యవస్థలో భయం
- దిశ యాప్ ఆవిష్కరణలో ఏపీ సీఎం వైఎస్ జగన్
- రాజమహేంద్రవరంలో దిశ పోలీసు స్టేషన్ ప్రారంభం

- వివరాలు 2లో

BUY ONLINE AT: malabargoldanddiamonds.com

మలబార్ వాగ్దానం

గత ఇరవై ఏళ్ళుగా మలబార్ గోల్డ్ & డైమండ్స్ సంస్థ కేవలం జ.ఐ.ఎస్ హాల్‌మార్క్ చేయబడిన ఆభరణాలను మాత్రమే తమ ఖాతాదారులకు అందిస్తుంది. మా నాణ్యతకు మా లక్షలాది ఖాతాదారులు పట్టం కట్టడమే అందుకు సాక్ష్యం.

వెడ్డింగ్ అడ్వాన్స్ ప్లాన్ : మీరు కొనుగోలు చేయాలి అనుకున్న బంగారం విలువలో 10% నుండి ముందుగా చెల్లించి బుక్ చేసుకోండి, తద్వారా భవిష్యత్తులో పెరిగే బంగారం ధరల నుండి మిమ్మల్ని రక్షించుకోవచ్చు.

మలబార్ గోల్డ్ & డైమండ్స్

సంపూర్ణ పారదర్శకత : పూర్తి వివరాలతో కూడిన జల్లు మరియు ధరల పట్టిక మీకు పారదర్శకతతో కూడిన భరోసా అందిస్తుంది. ఆభరణం యొక్క మొత్తం బరువు, రాళ్ల బరువు మరియు ఖరీదు, మజూరీ మొదలగు వివరాలతో కూడిన పారదర్శక ధరల పట్టిక ప్రతి ఆభరణానికి జతచేయబడి ఉంటుంది.

హామీతో కూడిన జీవితకాల నిర్వహణ : 10 దేశాల్లో ఉన్న మా 260 షోరూముల్లో మీరు కొనే ప్రతీ నగకు జీవితకాలం హామీతో కూడిన నిర్వహణ సౌకర్యం.

బంగారం మార్పిడిపై శూన్య తగ్గింపు : 22 క్యారెట్ల బంగారాన్ని మా వద్ద మార్పిడి చేసుకున్నప్పుడు ఎటువంటి తగ్గింపు లేకుండా 100 శాతం విలువ లెక్కించబడుతుంది.

జ.ఐ.ఎస్ 916 హాల్‌మార్క్ బంగారం : 2001వ సంవత్సరం నుండి మా వద్ద ఆభరణాలు స్వచ్ఛతతో, సంపూర్ణ హామీతో జ.ఐ.ఎస్ 916 హాల్‌మార్క్ ధృవీకరణతో లభిస్తున్నాయి.

పరిశీలించబడిన & ధృవీకరించబడిన వజ్రాలు : మా వద్ద ప్రతి వజ్రం 28 రకాల అంతర్గత తనిఖీల్లో నెగ్గటమే కాకుండా ఐ.జి.ఐ, జి.ఐ.ఎ ధృవీకరణతో లభిస్తాయి.

తిరిగికొనుగోలు హామీ : అన్ని రకాల బంగారు మరియు వజ్రాభరణాలకు తిరిగి కొనుగోలు హామీ లభిస్తుంది.

ఆభరణాలకు బీమా సదుపాయం : మా వద్ద కొనుగోలు చేసిన ప్రతి నగకు దొంగతనం, దోపిడి, అగ్ని ప్రమాదం వంటి చర్యల వల్ల ఎలాంటి నష్టం జరగకుండా ఏడాది పాటు బీమా.

క్యారెట్ విశ్లేషణ సదుపాయం : మావద్ద కొనుగోలు చేసిన లేదా అమ్మిన, బంగారం యొక్క స్వచ్ఛతను నిర్ణయించడానికి క్యారెట్ విశ్లేషణ సదుపాయం కలదు. మీ కళ్ళ ముందే బంగారం యొక్క ఖచ్చితమైన క్యారెట్ విలువ నిర్ణయించబడుతుంది.

— మా వాగ్దానం అంటే —
వాగ్దానమే

హైదరాబాద్ [సోమాజిగూడ. | కె.పి.హెచ్.బి కాలనీ | బిల్‌సుఖ్‌నగర్ | ఎ.ఎస్.రావు నగర్ | మెహిదిపట్నం | చందానగర్ హిమాయత్ నగర్ | కొండాపూర్ | హబ్సిగూడ] వరంగల్ | కరీంనగర్ | విశాఖపట్నం | తిరుపతి | కర్నూలు | విజయవాడ కాకినాడ | రాజమండ్రి | గుంటూరు | భీమవరం | కడప | నెల్లూరు | అనంతపురం

Call: 040 68138916 | ఇండియా | యు.ఎస్.ఎ | సింగపూర్ | మలేషియా | యు.ఎ.ఇ | కతార్ | కె.ఎస్.ఎ | ఒమన్ | కువైట్ | బెహ్రాన్ 260కి పైగా షోరూమ్‌లు 10 దేశాలలో

TATA STEEL
#WeAlsoMakeTomorrow

TATA PRAVESH

రాజీ పడనక్కర్లేదు

టాటా ప్రవేశ్ తలుపులు మరియు కిటికీలు
స్టీల్ యొక్క శక్తి ఉడ్ యొక్క చక్కదనం.
అత్యున్నతమైనది ఎంచుకోండి. టాటా ప్రవేశ్‌ని ఎంచుకోండి.

స్టీల్‌తో తయారీ | ప్రీమియం ఉడ్ ఫినిష్ | వెదర్ ప్రూఫ్
సమస్య లేని ఇన్‌స్టలేషన్ | పర్యావరణ అనుకూలత మరియు 100% రీసైకిల్ చేయబడగలిగినది | నిప్పు మరియు చెదపురుగుల నుండి రక్షణ ఇవ్వగలిగినది

FIRST STEEL DOOR WITH GREEN PRO CERTIFICATION
పతి 2 టాటా ప్రవేశ్ తలుపులు ఒక చెట్టును కాపాడుతాయి

మకర సంక్రాంతి ఆఫర్

క్యాష్‌బ్యాక్ 10% టాటా ప్రవేశ్ ఓయస్టర్ మరియు కోరల్ కిటికీలపై

షరతులు మరియు నిబంధనలు
ఫ్లాట్ 10% క్యాష్ బ్యాక్ అన్ని ఓయస్టర్ మరియు కోరల్ కిటికీ రకాల ధరల పైన | ఈ ఆఫర్ ను పొందుటకు బుకింగ్ సమయంలో పూర్తి ధరలో 30% అడ్వాన్స్‌గా జమ చేయవలెను. 10% క్యాష్ బ్యాక్ అవకాశం బ్యాలెన్స్ చెల్లింపు సమయంలో పొందగలరు | ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలో నియుక్తమైన టాటా ప్రవేశ్ అథుల్ లెట్ నుండి చేయబడిన కొనుగోలుకు మాత్రమే ఈ ఆఫర్ వర్తిస్తుంది | ఈ ఆఫర్ 1 డిసెంబర్'19 నుండి 29 ఫిబ్రవరి' 20 వరకు చేయబడిన బుకింగులకు మాత్రమే వర్తిస్తుంది | తదుపరి మీరు రద్దు చేసిన ఎడల అడ్వాన్స్ సొమ్ము తిరిగి ఇవ్వబడదు | ఈ ఆఫర్ మరి ఏ ఇతర ఆఫర్ తో గాని డిస్కౌంట్ తో గాని జోడింపబడదు.

www.tatapravesh.com | Join us on tatapravesh
ఫ్రీ డెలివరీ* మరియు ఇన్‌స్టలేషన్ 1-800-4199-200

సాక్షి రౌండప్

2

వైరస్... వెన్నులో వణుకు

వైరస్.. ఈ పేరు వింటేనే ప్రపంచ దేశాలు ఈ మధ్య గడగడలాడిపోతున్నాయి. సార్స్ నుంచి కరోనా వరకు దశాబ్దకాలంగా కనీవినీ ఎరుగని కొత్త వైరస్‌లు, వాటి ద్వారా సంక్రమించే వ్యాధులు వివిధ దేశాలను కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ఈ వ్యాధులపై గట్టి పోరాటమే చేస్తోంది. ఈ వ్యాధులతో ప్రాణనష్టంతో పాటు, వైరస్ వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి ప్రయాణాలపై ఆంక్షలు, ఎగుమతి దిగుమతులపై నియంత్రణల కారణంగా చాలా దేశాలు ఆర్థికంగానూ నష్టపోతున్నాయి. ఇప్పుడు చైనాలో కరోనా వ్యాధి ప్రబలడంతో ప్రాణాంతక వైరస్‌లు మరోసారి చర్చనీయాంశమయ్యాయి. కొన్ని వైరస్‌లకు చికిత్సలు ఉండటం లేదు. నివారణ ఒక్కటే మార్గం. అసలు ఏమిటీ వైరస్‌లు? ఇటీవల కాలంలో వివిధ దేశాల్ని ఎలా వణికించాయి? కరోనా వైరస్‌పై పోరాటం చేయడానికి చైనా చేస్తున్నదేంటి? ఇదే ఇవాళ్టి సండే స్పెషల్...

3,20,000 రకాల వైరస్‌లు

వైరస్ అంటే లాటిన్ భాషలో విషం అని అర్థం. ఇవి సూక్ష్మాతి సూక్ష్మమైన జీవులే కానీ అత్యంత శక్తిమంతమైనవి. బ్యాక్టీరియా, ఫంగస్ కంటే ఇవి చాలా శక్తిమంతంగా దాడి చేస్తాయి. ఇవి కంటికి కనిపించవు. కొన్ని రకాల వాటిని మైక్రోస్కోప్‌ల ద్వారా చూడగలం. ఈ వైరస్‌లు సంతానాన్ని వాటంతట అవి సృష్టించలేవు. కణజాలం ఉంటేనే ఇవి అభివృద్ధి చెందుతాయి. అడవి జంతువులు, మొక్కల నుంచి ఈ వైరస్‌లు మానవ శరీరాలపై దాడి చేస్తాయి. దీంతో మానవాళిని వివిధ రకాల వ్యాధులు భయపెడుతున్నాయి. ఫ్లూ, ఎబోలా, జికా, డెంగీ, సార్స్, మెర్స్ ఇప్పుడు కరోనా వీటన్నింటికీ వైరస్‌లే కారణం. మన శరీరంలోకి ఒక్కసారి ఈ వైరస్ ప్రవేశించిందో ఇక అది ఉత్పత్తి ఫ్యాక్టరీగా మారిపోతుంది. ఒక్క వైరస్ మరో 10 వేల కొత్త వైరస్‌లను సృష్టించే సామర్థ్యం ఉంటుంది. అందుకే భూమ్మీద ఉండే మనుషుల కంటే 10 వేల రెట్లు ఎక్కువ వైరస్‌లు ఉన్నాయని శాస్త్రవేత్తల అంచనా. మన శరీరంలో కూడా ఎన్నో వైరస్‌లు ఉన్నప్పటికీ చాలా వైరస్‌లు నిద్రాణ స్థితిలో ఉంటాయి. అందుకే వాటి వల్ల హాని జరగదు. అయితే మనిషిలో రోగ నిరోధక వ్యవస్థ నిర్వీర్యం అయిపోతే మాత్రం

ఈ వైరస్‌లు విజృంభిస్తాయి. అంతుపట్టని వ్యాధులకు కారణమవుతాయి. ముఖ్యంగా దగ్గు, జలుబు, శ్వాసకోశ సమస్యలతో ఈ వైరస్‌ల దాడి మొదలవుతుంది. చివరికి జ్వరం, రక్తస్రావం వంటి వాటికి దారి తీసి ప్రాణాలే పోతాయి. వైరస్‌లన్నీ హానికరమైనవే. మనిషిలో రోగాలను ఎదుర్కొనే శక్తిని బట్టే వాటి విజృంభణ ఉంటుంది. అయితే కొన్ని మాత్రమే ప్రాణాంతక వైరస్‌లు ఉంటాయి. అమెరికన్ జర్నల్ సొసైటీ ఆఫ్ మైక్రో బయాలజీ అంచనాల ప్రకారం ఈ భూమి మీద 3 లక్షల 20 వేల రకాల వ్యాధికారక వైరస్‌లు ఉన్నాయి.

పోగబండి.. ఇక ఉండదండి!

వచ్చే రెండుమూడేళ్లలో రైల్వే మార్గాల విద్యుదీకరణ

'మిషన్ ఎలక్ట్రిఫికేషన్'తో యుద్ధప్రాతిపదికన పనులు

వచ్చే సంవత్సరం రూ.178 కోట్ల ఖర్చు అన్ని లైన్లలో కరెంటు ఇంజిన్లతో రైళ్ల పరుగులు

సాక్షి, హైదరాబాద్: 'పొగబండి'కి ఇక కాలం చెల్లే రోజు దగ్గరలోనే ఉంది. రైలు అనగానే గుప్పుగుప్పున పొగ వదులుతూ ఉండే ఇంజిన్ ఇక కనిపించదు. వాటి స్థానంలో అన్నీ కరెంటు ఇంజిన్లే కనిపించబోతున్నాయి. 'మిషన్ ఎలక్ట్రిఫికేషన్'ను లక్ష్యంగా పెట్టుకున్న రైల్వే.. అన్ని మార్గాలను విద్యుదీకరించనుంది. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో వచ్చే రెండుమూడేళ్లలో దీన్ని సాధించేదిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. గత నాలుగేళ్లుగా విద్యుదీకరించే పని జరుగుతుండగా, తాజాగా దీన్ని యుద్ధప్రాతిపదికన చేపట్టారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.178 కోట్లను జోన్ పరిధిలో దీని కోసం ఖర్చు చేయబోతున్నారు.

ఒకేసారి అన్ని సెక్షన్‌లలో పనులు...

గతంలో ఏదో ఒక సెక్షన్‌కు నిధులు కేటాయిస్తే దాని పరిధిలో విద్యుదీకరణ పనులు జరిగేవి. కానీ ఇప్పుడు ఒకేసారి అన్ని సెక్షన్‌లలో పనులు జరుపుతున్నారు. ఒక స్టేషన్‌లో రైలు వెళ్లిపోగానే, తదుపరి రైలు వచ్చేలోపు కొంత పని చేస్తున్నారు. ఆ తర్వాత తదుపరి రైలు దాటిపోగానే మళ్లీ కొనసాగిస్తున్నారు. ఇలా రైళ్ల ప్రయాణానికి ఆటంకం లేకుండా పనులు జరుపుతున్నారు. ఒకేసారి అన్ని సెక్షన్‌లలో ఈ తరహాలో ప్రణాళికాబద్ధంగా పనులు జరుగుతుండటంతో వేగంగా లక్ష్యం చేరుకునేందుకు అవకాశం కలిగింది.

ఇటీవల నడికుడి-మాచర్ల, పగిడిపల్లి-గుంటూరు, పెద్దపల్లి-లింగంపేట జగిత్యాల మధ్య విద్యుదీకరణ పూర్తి చేశారు. సికింద్రాబాద్-డోన్, మన్నాడ్-బొల్లారం మధ్య ఇప్పటి వరకు ఎక్కడా విద్యుదీకరణ జరగలేదు. ఇప్పుడు ఇవన్నీ మారిపోనున్నాయి. మొత్తం లైన్లు విద్యుదీకరణ పూర్తయ్యాక ప్రస్తుతం ఉన్న డీజిల్ ఇంజిన్లను కూడా కరెంటుతో నడిచేలా మార్పు చేయనున్నారు. ఆ పరిజ్ఞానం కోసం రైల్వే ప్రయత్నిస్తోంది. జోన్ పరిధిలో ప్రస్తుతం కరెంటు లోకోమోటివ్స్ 700 ఉంటే, డీజిల్ ఇంజిన్లు 600 ఉన్నాయి. ఇక కాజీపేట, మౌలాలి, విజయవాడ, గుత్తి, గుంతకల్‌లో ఉన్న డీజిల్ వర్క్‌షాపులను విద్యుత్ లోకోమోటివ్ వర్క్‌షాపులుగా మార్చే పని మొదలైంది.

దక్షిణ మధ్య రైల్వే జోన్ స్వరూపం ఇదీ..

మొత్తం నిడివి:	6,415 కి.మీ.
విద్యుదీకరించింది	3,614 కి.మీ.
విద్యుదీకరించాల్సింది:	2,801 కి.మీ.
తెలంగాణ పరిధిలో మొత్తం నిడివి:	1,823 కి.మీ.
ఇందులో విద్యుదీకరించింది:	997 కి.మీ.
ఏపీ పరిధిలో మొత్తం నిడివి:	3,026 కి.మీ.
విద్యుదీకరించింది:	2,344 కి.మీ.

ఇక మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్, తమిళనాడు పరిధిలోని మిగతా భాగంలో 1,293 కి.మీ. నిడివి విద్యుదీకరించాల్సి ఉంది.

ఇవీ ఉపయోగాలు...

భారీ ఆదా...

వంద కిలోమీటర్ల ప్రయాణానికి డీజిల్ ఇంజిన్ రూ.65 వేల ఇంధనాన్ని ఖర్చు చేస్తోంది (వేగాన్ని బట్టి ఈ మొత్తం మారుతుంది). అదే కరెంటు లోకోమోటివ్ రూపంలో ఈ ఖర్చు 45 వేలే అవుతుంది. ఈ రూపంలో రైల్వే భారీగా ప్రజాధనాన్ని పొదుపు చేసే అవకాశం ఉంటుంది.

తగ్గనున్న కాలుష్యం...

డీజిల్ లోకోమోటివ్స్ నుంచి పొగ విపరీతంగా వస్తుంది. ఇది వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్‌ను భారీగా విడుదల చేస్తుంది. దీంతోపాటు డీజిల్ ఇంజిన్ చేసే శబ్దం కూడా ఎక్కువ. కరెంటు ఇంజిన్లతో వాతావరణ కాలుష్యం నామమాత్రం కానుండగా, శబ్ద కాలుష్యం కూడా తగ్గుతుంది.

ఇంజిన్ మార్చే సమస్యకు చెల్లు..

కొన్ని మార్గాల్లో కొంతమేర విద్యుదీకరించినందున చాలా రైళ్లకు ఆ మేర విద్యుత్ లోకోమోటివ్, మిగతా ప్రయాణానికి డీజిల్ ఇంజిన్ వాడుతున్నారు. ఏదో ఒకచోట ఇంజిన్లను మార్చాల్సి రావటం ఇబ్బందిగా మారింది. ఇది ప్రయాణికులకు కూడా అసౌకర్యాన్ని కలిగిస్తోంది. దీనికి ఫుల్‌స్టాప్ పడుతుంది.

పవర్‌లూమ్‌పై మంత్రి కేటీఆర్ చిత్రం

ఎలక్ట్రానిక్ జకార్డుతో ఆవిష్కరణ

సిరిసిల్ల: సిరిసిల్ల నెహ్రూనగర్‌కు చెందిన వెల్ది హరిప్రసాద్ అనే నేత కార్మికుడు ఎలక్ట్రానిక్ జకార్డు సహాయంతో పవర్‌లూమ్‌పై రాష్ట్ర మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారకరామారావు చిత్రాన్ని శనివారం నేశాడు. బతుకమ్మ చీరలకు వాడే నూలుతో మరమగ్గంపై ఎలక్ట్రానిక్ జకార్డుతో డిజైన్ రూపొందించుకుని హరిప్రసాద్, కేటీఆర్ చిత్రాన్ని ఆవిష్కరించాడు. ఇప్పటికే హరిప్రసాద్ బుల్లి మగ్గం, బుల్లిరాట్నం, అగ్గిపెట్టెలో ఇమిడే చీర, ఉంగరంలో, సూదిలో దూరే చీరలను మగ్గంపై తయారు చేశాడు. తాజాగా పవర్‌లూమ్స్‌పై మంత్రి కేటీఆర్ చిత్రాన్ని తన కార్ఖానాలో ఆవిష్కరించడం విశేషం.

దిశ.. కొత్త దశ

- మహిళలు, చిన్నారుల రక్షణకు ప్రత్యేక చట్టం
- నేరస్తులకు వేగంగా శిక్ష పడితేనే వ్యవస్థలో భయం
- దిశ యాప్ ఆవిష్కరణలో ఏపీ సీఎం వైఎస్ జగన్
- దిశ పోలీసుస్టేషన్ ప్రారంభం

నేరాలు ప్రతి సంవత్సరం జరుగుతాయి.. ఇవి కొత్తేం కాదు.. మన ప్రభుత్వం ఇప్పుడు వచ్చింది.. ఇప్పుడు కూడా ఇలాంటివి జరుగుతుంటాయి.. అని చెప్పి వదిలేద్దాం అనుకోలేదు. ఎక్కడో ఒక చోట దీనికి ఫుల్ స్టాప్ పడాలి. ఈ వ్యవస్థలో మార్పు తీసుకురావాలనే ఆలోచన నుంచి వచ్చిందే ఈ 'దిశ' చట్టం అని ఈ వేదిక మీద నుంచి గర్వంగా చెబుతున్నాను.

దిశ యాప్ ప్లే స్టోర్‌లో అందరికీ అందుబాటులో ఉంది. ఎవరైనా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దీనిని దాదాపు 5,048 మొబైల్ టీమ్స్‌కు లింక్ చేశాం. ఈ యాప్ ఓపెన్ చేసి ఎస్‌ఓఎస్ అనే బటన్ నొక్కితే కేవలం 10 సెకన్లలో ఆడియో, వీడియో ట్రాన్స్‌మిట్ అవుతుందని ఇంతకు ముందే మనం చూశాం. (సీఎం దిశ యాప్‌లో ఎస్‌వోఎస్ బటన్ నొక్కగానే దిశ కాల్ సెంటర్‌కు ఫోన్ కనెక్ట్ అవ్వడం.. ఆ ఫోన్ నంబర్ ఆధారంగా లొకేషన్ గుర్తించిన కంట్రోల్ రూమ్ సిబ్బంది సమీపంలోని రాజానగరం పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వడం.. 10 నిమిషాల్లో ఒక ఎస్ఐ, ఒక మహిళా కానిస్టేబుల్ కాల్ చేసిన సీఎం వద్దకు చేరుకోవడం ప్రత్యక్షంగా చూపించారు)

నేరం చేస్తే ప్రతి అడుగులోనూ శిక్ష తప్పదని గట్టిగా సందేశాన్ని పంపించడం కోసం దిశ చట్టాన్ని తీసుకొచ్చాం. మూడు నాలుగు నెలల్లో అన్నీ పూర్తిగా అమల్లోకి వచ్చేస్తాయి. నేరాన్ని ఆపడం, నేరం జరిగితే వెంటనే శిక్షించడం.. తద్వారా నేరగాళ్లు, నేర మనస్తత్వం ఉన్న వారికి గట్టిగా సంకేతం పంపాలనేదే నా ఉద్దేశం. – వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, రాజమహేంద్రవరం

మహిళలు, చిన్నారుల రక్షణే ధ్యేయంగా తీసుకువచ్చిన 'దిశ' చట్టం చరిత్రలో నిలిచి పోతుందని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడిన వారు ఎవరైనా సరే శిక్షించడం కోసమే ఈ చట్టం తీసుకువచ్చామని చెప్పారు. శాంతి భద్రతలే తమ మొదటి ప్రాధాన్యం అని పునరుద్ఘాటించారు. దిశ చట్టం దేశంలోనే ప్రత్యేకమైనదని తెలిపారు. నెలాఖరులోగా రాష్ట్రంలో 18 దిశ పోలీసుస్టేషన్లు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ప్రతి జిల్లాలో ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేస్తున్నామని, ఆ మేరకు 13 మంది పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమిస్తున్నామన్నారు. తిరుపతి, విశాఖలో కొత్తగా రెండు ఫోరెన్సిక్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శనివారం ఆయన రాష్ట్రంలోనే తొలి 'దిశ' మహిళా పోలీసుస్టేషన్‌ను ప్రారంభించారు. అనంతరం నన్నయ వర్సిటీలో 'దిశ' చట్టంపై పోలీసు అధికారులు, మహిళా శిశు సంక్షేమ శాఖాధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌లో పాల్గొని, దిశ యాప్‌ను ఆవిష్కరించారు.

జన దేవతల వనప్రవేశం

▶ మొదటి పేజీ తరువాయి

కదిలించి చిలుకలగుట్టకు చేర్చింది. ఇక సమ్మక్క భర్త పగిడిద్దరాజును రాత్రి 7:09 గంటలకు పెనక మురళీధర్, పూజారుల బృందం తరలించి కొత్తగూడ మండలం పూనుగొండ్ల వైపు తీసుకెళ్లింది. ఆదివారం సాయంత్రంలోగా వారు గమ్యాన్ని చేరుకుంటారు. ఇక సారలమ్మను కాక సారయ్య, కాక కిరణ్, సోలం వెంకటేశ్వర్లుతో కూడిన పూజారుల బృందం గద్దెపై ప్రతిష్ఠించిన ముట్టె (వెదురుబుట్ట)ను రాత్రి 7:14 గంటలకు తీసుకొని జంపన్నవాగు మీదుగా కన్నెపల్లికి చేర్చింది. భక్తులు ఈ సమయంలో పూజారులను తాకి, మొక్కుకోవడానికి ప్రయత్నించారు. దేవతల వనప్రవేశంతో మేడారం మహాజాతర అధికారికంగా ముగిసింది. బుధవారం నిర్వహించే తిరుగువారం పండుగతో మహాజాతర పరిసమాప్తమవుతుంది. అప్పటిదాకా భక్తులు గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకుంటూనే ఉంటారు.

నాలుగోరోజు వీఐపీల తాకిడి

మేడారం జాతర చివరి రోజూ వీఐపీల తాకిడి కొనసాగింది. కేంద్ర గిరిజ నశాఖ మంత్రి అర్జున్ ముండా సమ్మక్క-సారలమ్మను దర్శించుకున్నారు. తులాభారంతో నిలువెత్తు (75 కిలోలు) బంగారాన్ని తల్లులకు సమర్పించారు. శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అమ్మవార్లకు మొక్కులు చెల్లించారు. మంత్రులు పువ్వాడ అజయ్ కుమార్, ఇంద్రకరణ్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్ తల్లులను దర్శించుకున్నారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానందగౌడ్, ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, షేరి సుభాష్ రెడ్డి, నవీన్‌రావు అమ్మలను దర్శించుకున్న వారిలో ఉన్నారు. వారితోపాటు తెలంగాణ సీఎస్ సోమేశ్ కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు అనురాగ్‌శర్మ, ఛత్తీస్‌గఢ్ డీజీపీ డీఎం అవస్థి, ఆ రాష్ట్ర సీఎస్ ఆర్.పి. మండల్, పలువురు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు అమ్మవార్లను దర్శించుకున్నారు.

మేడారం జాతర విజయవంతం

మేడారం జాతరను అందరి సహాయ సహకారాలతో విజయవంతంగా నిర్వహించగలిగాం. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకున్నాం. మేడారం జాతరకు జాతీయ హోదా కల్పించాలని పలుమార్లు కేంద్రాన్ని కోరినా ఫలితం కనిపించలేదు. శనివారం మేడారాన్ని సందర్శించిన కేంద్ర మంత్రి అర్జున్ ముండాను కూడా ఈ విషయమై కోరాం.

– అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి

'సీతారామ'పై కిరికిరి!

- మళ్లీ ప్రాజెక్టు తుట్టెను కదుపుతున్న సీడబ్ల్యూసీ, గోదావరి బోర్డు
- ప్రాజెక్టు డీపీఆర్, డిజైన్ సర్టిఫికెట్ ఇవ్వాలని తెలంగాణకు లేఖలు
- ఇప్పటికే పాత ప్రాజెక్టుగా సీతారామ ఎత్తిపోతలను గుర్తించాలని రాష్ట్రం వినతి

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీతారామ ఎత్తిపోతల పథకంపై మళ్లీ కిరికిరి మొదలైంది. దాన్ని పాత ప్రాజెక్టుగానే గుర్తించే అంశంలో అటు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), ఇటు గోదావరి యాజమాన్య బోర్డు (జీఆర్‌ఎంబీ)లు కొత్త ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. సీతారామ ఎత్తిపోతల ముమ్మాటికీ పాత ప్రాజెక్టేనని తెలంగాణ పదేపదే చెబుతున్నప్పటికీ దీని సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) ఇవ్వాలని, సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీఓ) సర్టిఫికెట్ సమర్పించాలని కోరుతున్నాయి. ఇటీవలే ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌తో పాటు సమగ్ర వివరాలు తమకివ్వాలని సీడబ్ల్యూసీ కోరగా, బోర్డు ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ రాష్ట్రాన్ని నివేదికలు కోరింది. సమైక్య రాష్ట్రంలోనే 2005లో రాజీవ్ దుమ్ముగూడెం, ఇందిరాసాగర్ రుద్రమకోట ఎత్తిపోతల పేర్లతో గోదావరి నదిపై ప్రాజెక్టులు చేపట్టిన విషయం తెలిసిందే. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడే నాటికే ఈ రెండు ప్రాజెక్టులకు కలిపి రూ.1,771 కోట్లు ఖర్చు చేశారు.ప్రాజెక్టుల పరిధిలోని ఏడు మండలాలు ఏపీలో కలపడంతో ఇందిరాసాగర్ హెడ్ వర్క్స్ ఉన్న ప్రాంతం ఏపీలోకి వెళ్లింది. దీనికి తోడు ప్రాజెక్టులతో వన్యప్రాణుల సంరక్షణకు ఆటంకం కలుగుతుండటంతో ఈ ప్రాజెక్టుకు తెలంగాణ ప్రభుత్వం రీడిజైన్ చేసింది. ఈ రెండు ప్రాజెక్టులను కలిపి సీతారామ ఎత్తిపోతలను 70 టీఎంసీలతో చేపట్టింది.ఈ ప్రాజెక్టు నిర్మాణంపై 2017లో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం కేంద్రానికి, సీడబ్ల్యూసీకి, గోదావరి బోర్డుకు ఫిర్యాదు చేసింది. పూర్వపు నీటిని తీసుకునే సామర్థ్యానికి, ప్రస్తుతం నీటిని తీసుకుంటున్న సామర్థ్యానికి పొంతన లేదని, రీడిజైన్‌లో ఆయకట్టు సైతం పెరిగిందని, స్వరూపం పూర్తిగా మారినందున దీన్ని పూర్తిగా కొత్త ప్రాజెక్టుగా పరిగణించాలని కోరింది. దీనికి 2018 మేలో గోదావరి బోర్డు సైతం వంత పాడింది. దీనిపై అప్పట్లోనే స్పందించిన తెలంగాణ ప్రభుత్వం, సీతారామ ఎత్తిపోతల ముమ్మాటికీ పాత ప్రాజెక్టేనని లేఖల ద్వారా తెలిపింది. 2018లో అప్పటి కేంద్ర జల వనరుల మంత్రి నితిన్ గడ్కరీకి సైతం సీఎం కేసీఆర్ ఈ విషయాన్ని స్పష్టం చేశారు. అయితే ఈ వివాదం ముగిసిపోలేదు. తాజాగా సీడబ్ల్యూసీ గోదావరి బోర్డుకు లేఖ రాసింది. 'గతంలో కేంద్రం ముందు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన సందర్భంగా దీన్ని కొత్త ప్రాజెక్టుగానే గుర్తిస్తామని బోర్డు చెప్పింది. ఇక సీతారామ కింద ఆయకట్టు కొంత భాగం కృష్ణాబేసిన్‌లో ఉందని ఈ సందర్భంగా అంతరాష్ట్ర జల విభాగ డైరెక్టరేట్ ప్రస్తావించింది. ఈ దృష్ట్యా ప్రాజెక్టు డీపీఆర్‌ను కృష్ణాబోర్డు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, ఏపీ ప్రభుత్వానికి ఇవ్వాలని సూచించింది. అయినప్పటికీ ఇంత వరకు తెలంగాణ డీపీఆర్ ఇవ్వలేదు. దీంతో డిజైన్ సర్టిఫికెట్ ఇమ్మన్నా ఇవ్వలేదు'అని లేఖలో పేర్కొంది. ఈ దృష్ట్యా ఇప్పటికైనా డీపీఆర్ తెప్పించుకోవాలని బోర్డుకు సూచించింది. ఈ నేపథ్యంలో కదలిన బోర్డు ప్రాజెక్టు డీపీఆర్, సీడీఓ సర్టిఫికెట్ తమకు త్వరగా సమర్పించాలని బోర్డు రాష్ట్రానికి లేఖలు రాసింది.

బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా లింగంగౌడ్

సాక్షి, హైదరాబాద్: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నల్లగొండ జిల్లా దామరచర్లకు చెందిన జాజుల లింగంగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ శనివారం లింగంగౌడ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. 17 సంవత్సరాలుగా విద్యార్థి ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్న లింగంగౌడ్ వివిధ సమస్యల పరిష్కారం కోసం జరిగిన ఆందోళనల్లో పాలుపంచుకున్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి హోదాలో బీసీల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పని చేస్తానని లింగంగౌడ్ చెప్పారు.

ధ్యానం చేస్తున్న మంత్రి హరీశ్‌రావు

ధ్యానంతోనే మానసిక ప్రశాంతత

- కాన్హా శాంతి వనం గురూజీ కమ్లేష్ డీ పటేల్

నందిగామ: హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యానంతో ప్రతిఒక్కరికీ మానసిక ప్రశాంతత లభిస్తుందని కాన్హా శాంతివనం, రామచంద్ర మిషన్ గురూజీ కమ్లేష్ డీ పటేల్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కాన్హా శాంతి వనంలో రామచంద్ర మిషన్ 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న మూడో విడత ధ్యాన శిబిరంలో భాగంగా పలువురు అభ్యాసీలతో కలిసి శనివారం గురూజీ ధ్యానం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. అలాంటి వారు ఒత్తిడిని తట్టుకునేందుకు, మానసిక ప్రశాంతత కోసం ధ్యానం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

శాంతి వనాన్ని సందర్శించిన మంత్రి హరీశ్..

కాన్హా శాంతి వనాన్ని మంత్రి హరీశ్‌రావు శనివారం సందర్శించారు. శాంతి వనంలోని పలు ప్రదేశాలతో పాటు క్యాంటీన్, లాలాజీ విగ్రహాన్ని సందర్శించారు. అనంతరం గురూజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధ్యాన శిబిరంలో పాల్గొని ధ్యానం చేశారు. ఈ సందర్భంగా శాంతి వనంలో మొక్కను నాటారు. ప్రముఖ బ్యాడ్మింటన్ స్టార్ సింధు కూడా శనివారం కాన్హా శాంతి వనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సింధు మాట్లాడుతూ.. ధ్యానంతో ఏకాగ్రత పెరుగుతుందని, తాను కొంతకాలంగా ధ్యానం చేస్తున్నట్లు తెలిపారు.

నేడు, రేపు మోస్తరు వర్షాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఆది, సోమవారాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మరాఠ్వాడ, దాని పరిసర ప్రాంతాలలో 0.9 కి.మీ ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని, దక్షిణ తమిళనాడు నుంచి ఛత్తీస్‌గఢ్ వరకు ఇంటీరియర్ కర్ణాటక, మరాఠ్వాడ, విదర్భ మీదుగా 0.9 కి.మీ ఎత్తువరకు ఉపరితల ద్రోణి ఏర్పడిందని పేర్కొంది. గడిచిన 24 గంటల్లో కరీంనగర్ జిల్లా మానకొండూర్‌లో 6 సెం.మీ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెలలో 4 సెం.మీ, రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌లో 3 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

మీరు పెళ్లి చేసుకోవాల్సిన అమ్మాయి అక్కడున్నది! ఈమెను పెళ్లి చేసుకోవాల్సింది నేను!

కమాండ్ కంట్రోల్ రూంలో ఏర్పాటు చేసిన స్క్రీన్ల ద్వారా జాతరకు వచ్చిన భక్తుల సంఖ్యను అంచనా వేస్తున్న పోలీసులు

ప్రతీ తలకూ లెక్కుంది!

- ఆరిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో క్రౌడ్ మేనేజ్‌మెంట్
- దేశంలోనే తొలిసారిగా మేడారం జాతరలో ఏఐ సాంకేతికత
- తొక్కిసలాట జరగకుండా పకడ్బందీ ఏర్పాట్లు
- జాతర నిర్వహణలో పోలీసులు విజయవంతం

సాక్షి, హైదరాబాద్: ఈసారి మేడారం జాతరకు కోటిన్నర దాకా భక్తులు హాజరైనా ఎలాంటి తొక్కిసలాటలు, అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు తొలిసారిగా పోలీస్ శాఖ ఉపయోగించిన కృత్రిమ మేథో సాంకేతిక పరిజ్ఞానం పూర్తి స్థాయిలో విజయవంతమైంది. దేశంలో అతిపెద్ద జాతర కావడం.. కోటి మందికిపైగా భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకూడదని సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో డీజీపీ మహేందర్‌రెడ్డి సూచనలతో ఐటీ విభాగం చాలా నెలల ముందు నుంచే కసరత్తు ప్రారంభించింది. జాతరలో భక్తులను గమనించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను వినియోగించింది. ఎల్ అండ్ టీ సంస్థతోపాటు మరో రెండు స్టార్టప్‌లు కూడా క్రౌడ్ మేనేజ్‌మెంట్‌లో పోలీసులకు సాయం అందించాయి. ఆడ, మగ, పిల్లలు ఇలా ప్రతి ఒక్కరినీ గుర్తిస్తూ.. జాతరకు ఎంతమంది వచ్చారనే విషయాన్ని 99 శాతం కచ్చితత్వంతో లెక్కగట్టే ఏఐతో కూడిన ప్రత్యేక అల్గారిథమ్‌ను రూపొందించాయి. దీనికోసం అమ్మవారి గద్దెలు ఉన్న ప్రాంతాలతో పాటు భక్తులు ప్రవేశించే మార్గాల్లో ఏఐ సాంకేతికతతో పనిచేసే 15 కెమెరాలను బిగించారు. ఇవి నిత్యం పనిచేస్తూ జాతరకు ఎంతమంది వచ్చారనే సంఖ్యను తెరపై చూపిస్తుంటాయి. తలపై బంగారం (బెల్లం బుట్టలు), ఇరుముడి, ఒడి బియ్యం వంటివి ఉన్నా కూడా తలలను గుర్తించేలా అల్గారిథమ్‌ను అభివృద్ధి చేశారు.

తొక్కిసలాట జరగకుండా..

కృత్రిమ మేథో సాంకేతిక పరిజ్ఞానంతో జాతరకు వచ్చే భక్తుల సంఖ్యను ఎప్పటికప్పుడు అంచనా వేసి వారిని అదుపుచేసే విధంగా కంట్రోల్ రూమ్ నుంచి సూచనలను అందించారు. దీంతో ఎలాంటి తొక్కిసలాటలు జరగలేదు. సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవడం ద్వారా మేడారం జాతరను ప్రశాంతంగా నిర్వహించడంలో పోలీస్ శాఖ విజయవంతమైంది.

ఆరు నెలలపాటు అధ్యయనం..

ప్రయాగ కుంభమేళా స్ఫూర్తితోనే ఈ సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసినా ఇది దాని కంటే భిన్నమైనది కావడం విశేషం. దీంతో దేశంలోనే ఇలాంటి సాఫ్ట్‌వేర్ వాడిన తొలి రాష్ట్రంగా తెలంగాణ రికార్డు సృష్టించింది. దీనికోసం ప్రయాగలో జన నియంత్రణకు ఉపయోగించిన ఏఐ పరిజ్ఞానాన్ని ఐటీ అధికారులు దాదాపు ఆరు నెలలు అధ్యయనం చేశారు. కుంభమేళాలో ఉపయోగించిన మౌలిక సాంకేతిక విధానాన్నే మేడారంలో ఉపయోగించారు. కుంభమేళాకు వచ్చే భక్తులలో ప్రధానంగా పట్టణ ప్రాంత వాసులు, ఎగువ మధ్యతరగతి వారు హాజరవుతారు. మేడారంలో మాత్రం గిరిజనులు, గ్రామీణ ప్రాంతాల వారు ఎక్కువగా హాజరవుతారు. ఈ నేపథ్యంలో మేడారంలో అక్కడ ఉపయోగించిన సాంకేతికతకు స్థానిక అనుభవాలను అనుసంధానించారు. జంపన్న వాగు నుంచి వచ్చే దారి, ఆర్టీసీ బస్టాండ్, ఊరట్టం మార్గాల నుంచి వచ్చే భక్తుల సంఖ్యను ఎప్పటికప్పుడు అంచనా వేయడానికి 15 ఆర్టిఫిషియల్ హైడెఫినేషన్ కెమెరాలను అమర్చారు. ఈ కెమెరాలను మేడారం పోలీస్ క్యాంప్‌లో ఉన్న కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించారు.

పింఛన్లలో 'వంచన'!

ఆసరా వృద్ధాప్య పింఛన్ల పంపిణీలో భారీగా అవకతవకలు

- అక్రమంగా తీసుకుంటున్న దాదాపు 15 వేల మంది గుర్తింపు
- ఒకే కుటుంబంలోని దంపతులిద్దరూ పొందుతున్నట్లు నిర్ధారణ
- సెర్ప్ విచారణలో బహిర్గతం.. పింఛన్ సొమ్ము రికవరీకి ఆదేశాలు
- ఇటు మృతిచెందిన వారి పేరిట పింఛన్లు డ్రా చేసినట్లు గుర్తింపు
- బాధ్యులైన కార్యదర్శుల నుంచి సొమ్ము రాబట్టేందుకు యత్నాలు

సాక్షి, హైదరాబాద్

'ఆసరా' పింఛన్ల పంపిణీలో భారీగా అవకతవకలు జరిగినట్లు ప్రభుత్వం గుర్తించింది. నిబంధనలకు విరుద్ధంగా పింఛన్లను కొల్లగొట్టినట్లు తేల్చింది. పండుటాకులకు ఆపన్న హస్తం అందించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఈ పథకంలో 14,975 మంది అక్రమంగా పింఛన్లను పొందుతున్నట్టు పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) విచారణలో వెల్లడైంది. సామాజిక భద్రత పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు బీడీ, చేనేత, గీత కార్మికులు, ఫైలేరియా, ఎయిడ్స్ బాధితులకు రూ.2,016, వికలాంగులకు రూ.3,016 చొప్పున నెలవారీగా పింఛన్‌ను పంపిణీ చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ కేటగిరీల్లో 39,29,753 మంది లబ్ధిదారులకు పింఛన్లను ఇస్తుండగా, ఇందులో 60 ఏళ్లు పైబడిన 12,86,363 మంది వృద్ధులకు వృద్ధాప్య పింఛన్లను ప్రభుత్వం అందజేస్తోంది. వీటి మంజూరులో అక్రమాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో క్షేత్రస్థాయిలో విచారణ జరిపిన సర్కారు.. కొన్ని చోట్ల కుటుంబంలోని దంపతులిద్దరికీ వృద్ధాప్య పింఛన్లు అందుతున్నట్లు గుర్తించింది. నిబంధనల ప్రకారం ఇద్దరిలో ఒకరికి మాత్రమే పింఛన్ ఇవ్వాల్సి ఉంది. కానీ, ఇందుకు భిన్నంగా రాష్ట్రవ్యాప్తంగా 14,975 మంది గత కొన్నేళ్లుగా పింఛన్ సొమ్ము పొందుతున్నట్లు ప్రాథమిక విచారణలో తేల్చింది. దీంతో ఇలా అక్రమంగా పింఛన్ తీసుకున్న లబ్ధిదారుల నుంచి సొమ్ము రికవరీ చేయాలని ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీ చేసింది.

క్షేత్రస్థాయిలో విచారణ

ఆధార్, ఇతరత్రా డాక్యుమెంట్ల ఆధారంగా డబుల్ పింఛన్ పొందిన లబ్ధిదారుల జాబితాను సేకరించిన ప్రభుత్వం.. దీని ఆధారంగాక్షేత్రస్థాయిలో నిగ్గు తేల్చడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తోంది. ఈ నెల 10 వరకు గుర్తించిన లబ్ధిదారుల ఇంటికి వెళ్లి విచారణ జరపాలని ఆదేశించింది. విచారణ బాధ్యతలను గ్రామ పంచాయతీ కార్యదర్శి, బిల్ కలెక్టర్, గ్రామ రెవెన్యూ అధికారులకు అప్పగించింది. విచారణ అనంతరం అనర్హుల వివరాలను అందజేయాలని, వారి నుంచి సొమ్ము రికవరీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

'కాటి'కి వెళ్లిన వారివీ లూటి!

పోస్టాఫీసులు, బ్యాంకు ఖాతాల ద్వారా పంపిణీ చేస్తున్న పింఛన్లు కూడా పక్కదారి పడుతున్నట్లు ప్రభుత్వ అంతర్గత విచారణలో తేలింది. చాలాచోట్ల లబ్ధిదారుల జాబితాలో నుంచి మృతుల పేర్లు తొలగించకపోవడంతో.. వీరి పేరిట జమవుతున్న సొమ్ము నొక్కేస్తున్నట్లు గుర్తించింది. బయోమెట్రిక్ సంతకంతో గ్రామ పంచాయతీ కార్యదర్శులే ఈ డబ్బులు స్వాహా చేస్తున్నట్లు తేల్చింది. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా 91,442 మందికి సంబంధించిన పింఛన్లను పరిశీలించిన అధికారులు.. ఇందులో 1,792 మంది చనిపోయినట్లు నిర్ధారించారు. వీరిలో 522 మంది పేరిట పింఛన్ డబ్బులు డ్రా అయినట్లు గమనించారు. మరణించిన లబ్ధిదారుల పేరుతో గ్రామ పంచాయతీ కార్యదర్శులు మొత్తం రూ.94.96 లక్షలు విత్‌డ్రా చేసినట్లు గుర్తించారు. ఈ నిధులను కార్యదర్శుల నుంచి వసూలు చేయడమేగాకుండా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించిన సంగతి తెలిసిందే.

రిక'వర్రీ'

ప్రభుత్వ తాజా ఆదేశాలతో కుటుంబంలో ఇద్దరు పింఛన్లు తీసుకుంటున్న వృద్ధుల్లో కొత్త ఆందోళన ప్రారంభమైంది. ఇద్దరిలో ఒకరే తీసుకోవాలనే నిబంధనపై అవగాహన లేకపోవడంతో పాటు ప్రభుత్వం ఇస్తోంది కదా అని తీసుకున్న లబ్ధిదారులు.. ఇప్పుడు సొమ్ము వాపస్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుండటంతో కలవరానికి గురవుతున్నారు. ఈ అక్రమ బాగోతంలో అధికారుల పాత్ర కూడా ఉన్నప్పటికీ, వారిని పక్కనపెట్టి కేవలం లబ్ధిదారులనే బాధ్యులను చేయడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు కూడా ఉత్పన్నమవుతున్నాయి.

రాష్ట్రంలో వివిధ కేటగిరీల కింద అందజేస్తున్న ఆసరా పింఛన్ల వివరాలు..

వృద్ధులు	12,86,363
వికలాంగులు	4,98,565
వితంతువులు	14,52,545
చేనేత కార్మికులు	37,569
గీత కార్మికులు	63,162
హెచ్ఐవీ బాధితులు	33,229
బోదకాలు వ్యాధిగస్తులు	14,403
బీడీ కార్మికులు	4,08,755
ఒంటరి మహిళలు	1,35,162

నులి పురుగుల నివారణకు విస్తృత ఏర్పాట్లు

సాక్షి, హైదరాబాద్: జాతీయ నులిపురుగుల నివారణదినం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 1-19 సంవత్సరాల పిల్లలు, కౌమార బాలబాలికలలో నులి పురుగుల నివారణకు ఈ నెల 10న ఆల్బెండజోల్ మాత్రలు వేయడానికి విస్తృత ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు కోటి మూడు లక్షల మందికి ఈ మాత్రలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా 65 వేల మంది ఉపాధ్యాయులు, 35,700 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 27 వేల మంది ఆశా కార్యకర్తలకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కోసం విస్తృత ప్రచార కార్యక్రమాలతో పాటు టీవీ, ఆకాశవాణి ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్‌లో ప్రత్యేకంగా వంద శాతం సాధించేందుకు అన్ని ప్రభుత్వ శాఖల సహకారం తీసుకోనున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థలు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని కోరుతున్నట్లు తెలిపారు.

లోక్ అదాలత్‌లో 10,407 కేసుల పరిష్కారం

సాక్షి, హైదరాబాద్: జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు శనివారం రాష్ట్రవ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించినట్లు తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి జి.వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, రాష్ట్ర లీగల్ సెల్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ ఎం.ఎస్. రామచంద్రారావు, చైర్మన్ జస్టిస్ పి.నవీన్‌రావులు అన్ని జిల్లాల్లో జరిగిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారని వెల్లడించారు. జాతీయ లోక్‌అదాలత్‌లో రాష్ట్రవ్యాప్తంగా 10,407 కేసులు పరిష్కారం కాగా ఇందులో 3,984 ప్రీ లిటిగేషన్ కేసులతో పాటు, 6,423 పెండింగ్ కేసులున్నట్లు తెలిపారు. వివిధ కేసుల్లో రూ.36.35 కోట్లు నష్ట పరిహారంగా మంజూరు చేసినట్లు సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. హైకోర్టు పరిధిలో 202 కేసులు పరిష్కారం కాగా.. రూ.6.12 కోట్ల మేర సుమారు మూడు వందల మందికి లబ్ధి చేకూరిందని హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యదర్శి సీహెచ్ రమేశ్‌బాబు వేరొక ప్రకటనలో తెలిపారు.

స్వైన్‌ఫ్లూ (హెచ్1ఎన్1)

పుట్టిన ప్రాంతం: ఆఫ్రికా
ఎలా సంక్రమిస్తుంది: పందులు
మరణాల రేటు: 10%

స్వైన్‌ఫ్లూ వ్యాధి మొట్టమొదట పందుల్లో బయటపడింది. ఇది మనుషులకి సోకడం తక్కువే. 1918-19 సంవత్సరాల్లో తొలిసారిగా ఇది మనుషులకి సోకింది. అప్పట్లోనే ప్రపంచ వ్యాప్తంగా 50 కోట్ల మందికి ఈ వైరస్ సోకిందని అంచనాలున్నాయి. ఆ తర్వాత మళ్లీ 2009లో ఒక్కసారిగా ఈ వ్యాధి మనుషులకి సోకి తన విశ్వరూపం చూపించింది. మొత్తం 200 దేశాలకు విస్తరించింది. దాదాపుగా 3 లక్షల మంది ఈ వ్యాధితో మరణించారని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. జలుబు, దగ్గు, గొంతు నొప్పి, తలనొప్పితో ఈ వైరస్ లక్షణాలు బయటకొస్తాయి. జ్వరం, డయేరియా వస్తే మాత్రం ఇది ప్రాణాంతకంగా మారుతోంది.

సార్స్...

పుట్టిన ప్రాంతం: చైనా
ఎలా సంక్రమిస్తుంది: గబ్బిలాలు, పిల్లులు
మరణాల రేటు: 10%

చైనాలో గూంగ్‌డాంగ్ ప్రావిన్స్‌లో 2002లో తొలిసారిగా సివియర్ అక్యూట్ రెస్పరేటరీ డిసీజ్ (సార్స్) వైరస్ బయటపడింది. కొద్ది వారాల్లోనే ఆ వైరస్ 37 దేశాలకు పాకింది. జ్వరం, దగ్గు, తలనొప్పి, కండరాల నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఈ వ్యాధి లక్షణాలు. సార్స్ వ్యాధితో చైనా, హాంకాంగ్‌లోనే అత్యధిక మరణాలు సంభవించాయి. ఈ వైరస్ వచ్చిన తర్వాత ఒక దేశం నుంచి మరో దేశానికి ప్రయాణాలపై నిషేధాలు, ఆ దేశాల్లో ఉన్న తమ పౌరుల్ని వివిధ దేశాలు వెనక్కి తీసుకురావడం వంటి చర్యలు మొదలయ్యాయి. సార్స్ వ్యాధిని నియంత్రించడానికి చైనా, హాంకాంగ్, కెనడా, తైవాన్ వంటి దేశాలపై ఆంక్షలు విధించడంతో ఆర్థికపరమైన నష్టాలు కూడా మొదలయ్యాయి. డబ్ల్యూహెచ్‌ఓ ప్రకారం సార్స్ వ్యాధితో 2002-03లో 774 మంది మరణించారు. కొన్ని వేల మందిపై ఈ వైరస్ దాడి చేసింది. చాలా ఏళ్లుగా సార్స్‌ని నిరోధించే వ్యాక్సిన్ తయారు చేయడానికి వైద్య నిపుణులు ప్రయత్నం చేస్తున్నారు కానీ ఇంకా అవి సఫలం కాలేదు. ఇలాంటి ప్రాణాంతక వ్యాధికారక వైరస్‌లకు చికిత్సలు ఉండవు. నియంత్రణే మార్గం. ఈ వైరస్ మళ్లీ విజృంభించినప్పుడల్లా డబ్ల్యూహెచ్‌ఓ వైరస్ సోకకుండా ముందు జాగ్రత్త చర్యలపైనే విస్తృతంగా ప్రచారం చేస్తోంది.

రైతుల అభ్యున్నతికి శ్రమించాలి

వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రైతుల అభ్యున్నతి కోసం శ్రమించాలని, సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించాలని మార్కెటింగ్ శాఖ ఉద్యోగులకు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి సూచించారు. మార్కెట్‌కు వచ్చే రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించి మార్కెటింగ్ శాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. మార్కెటింగ్ శాఖలో పదోన్నతులు కల్పించినందుకు శనివారం మంత్రి అధికార నివాసంలో ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రైతులకు గిట్టుబాటు ధర కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని, రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. వ్యవసాయ రంగానికి చేయూతనిచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న, తీసుకుంటున్న చర్యలు దేశంలో మరే రాష్ట్ర ప్రభుత్వం తీసుకోలేదన్నారు. న్నారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖలో పదోన్నతులు పొందిన వారిని మంత్రి అభినందించారు. కార్యక్రమంలో టీఎస్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్, టీఎస్జీవో మార్కెట్ కమిటీ ఉద్యోగుల సంఘం సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు చిలక నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు రాజ్యాంగ హక్కు: ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్: రిజర్వేషన్లు బిక్ష కాదని రాజ్యాంగం కల్పించిన హక్కు అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య వెల్లడించారు. దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఓబీసీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'బీసీలకు చట్టసభల్లో 50 శాతం'అనే అంశంపై శనివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. బీసీలంటే ఓట్లు వేసే యంత్రాలుగా, జెండాలు మోసే కార్యకర్తలుగా చూస్తున్నారని విమర్శించారు. ఈ దేశంలో బీసీలను బిచ్చగాళ్లను చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు అల్లంపల్లి రామ్‌కోటి, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, నీల వెంకటేష్, ఎర్ర సత్యనారాయణ పాల్గొన్నారు.

కందుల కొనుగోళ్లలో నిబంధనలు మార్చాలి

సాక్షి, హైదరాబాద్: కందుల కొనుగోలు కేంద్రాల్లో ఎకరానికి 4-5 క్వింటాళ్ల వరకే కొనుగోలు చేయాలనే నిబంధనను ఎత్తివేయాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ డిమాండ్ చేసింది. రైతుకు ఎంత దిగుబడి వస్తే అంత పంటను కొనుగోలు చేయాలే తప్ప ఆంక్షలు పెట్టడమేంటని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర చైర్మన్ ఎస్. అన్వేశ్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు. ప్రభుత్వం నిబంధనలు పెట్టడంతో దళారులు రైతుల నుంచి తక్కువ ధరకు పంట కొనుగోలు చేసి లాభపడుతున్నారని విమర్శించారు. రైతులు తెచ్చిన కందులు కొనుగోలు చేయడంలో నిబంధనలు పెట్టడమే కాకుండా సహకార ఎన్నికల పేరుతో కొనుగోళ్లను నిలిపివేయడాన్ని కిసాన్ కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందన్నారు.

సింగరేణి సీఎండీ శ్రీధర్‌కు 'భారతీయ మహంతం పురస్కార్'

సాక్షి, హైదరాబాద్: సింగరేణి సంస్థ ఐదేళ్లుగా జాతీయ స్థాయిలో అమ్మకాలు, లాభాల్లో అత్యధిక వృద్ధిరేటు సాధించేలా కృషి చేసిన సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్‌కు 'భారతీయ మహంతం పురస్కార్ 2019-20 (ది లీడర్)'అవార్డు దక్కింది. థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్‌లో శుక్రవారం రాత్రి జరిగిన ఓ కార్యక్రమంలో మొరాకో రాయబారి అబ్దెలిల్లాహ్ అల్ హోస్ని, మాల్దీవ్స్ రాయబారి మహ్మద్ జిన్నా చేతుల మీదుగా శ్రీధర్ ఈ అవార్డు అందుకున్నారు. ఆసియా దేశాల్లో వ్యాపార, వాణిజ్య పరిశ్రమల విభాగంలో ప్రతిభ చూపే సీఈఓలకు థాయిలాండ్ కేంద్రంగా ప్రచురితమయ్యే 'ఏషియా వన్' పత్రిక ఏటా ఈ అవార్డులను అందజేస్తోంది. సిఎం కేసీఆర్ దిశా నిర్దేశం, సింగరేణి ఉద్యోగుల సమష్టి కృషితో తనకు అంతర్జాతీయ స్థాయిలో అవార్డు లభించిందని శ్రీధర్ పేర్కొన్నారు.

అనారోగ్యంతో సీఎం బావ మృతి

నివాళులర్పించిన సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు

రాజేశ్వరరావు పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కేసీఆర్

హైదరాబాద్: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు రెండవ సోదరి భర్త అనారోగ్యంతో శనివారం ఉదయం మృతి చెందారు. రాజన్న సిరిసిల్ల జిల్లా మర్రిమడ్లకి చెందిన పర్వతనేని రాజేశ్వరరావు (84) హైదరాబాద్‌లోని అల్వాల్ మంగాపురం కాలనీలో నివాసం ఉంటున్నారు. సీఎం సోదరి, రాజేశ్వరరావు సతీమణి విమలాదేవి గతేడాది చనిపోయారు. సీఎం కేసీఆర్ మధ్యాహ్నం 12 గంటలకు అల్వాల్ చేరుకుని రాజేశ్వరరావు పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. రాజేశ్వరరావు మరణవార్త తెలుసుకున్న మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ఉదయమే అక్కడికి చేరుకుని రాజేశ్వరరావు పార్థివదేహం వద్ద నివాళులర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు. మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్‌లు రాజేశ్వరరావు కుటుంబసభ్యులను పరామర్శించారు. మధ్యాహ్నం తిరుమలగిరి స్వర్గదామ శ్మశాన వాటికలో రాజేశ్వరరావు అంత్యక్రియలు జరిగాయి. అంత్యక్రియలు పూర్తయ్యే వరకు మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు అక్కడే ఉన్నారు

ఇది జాలి లేని ప్రభుత్వం

మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి చిదంబరం. చిత్రంలో ఉత్తమ్

- ఆహార సబ్సిడీలు, ఉపాధి పథకాలకు భారీగా నిధుల కోత
- వైఫల్యాలను కప్పిపుచ్చేందుకే ఆర్థిక స్థితిని ప్రస్తావించలేదు
- పెద్దనోట్ల రద్దు, అరకొరగా జీఎస్టీ అమలుతోనే సమస్యలు
- 'కేంద్ర బడ్జెట్.. ఆర్థిక పరిస్థితి'పై చర్చలో కేంద్ర మాజీ మంత్రి చిదంబరం

సాక్షి, హైదరాబాద్: నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అసమర్థమైందే గాక.. పేదల వ్యతిరేకమైందని, జాలిలేనిదని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పి.చిదంబరం ధ్వజమెత్తారు. వారం రోజుల క్రితం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేదలకు ఉపయోగపడే అన్ని కార్యక్రమాలకూ నిధులు తక్కువగా కేటాయించడం దీనికి నిదర్శనమని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని మఖ్దుమ్ భవన్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం 'కేంద్ర బడ్జెట్.. ఆర్థిక పరిస్థితి'అన్న అంశంపై చిదంబరం ప్రసంగించారు. దేశ ఆర్థిక వ్యవస్థ ఐసీయూ ముంగిట్లోకి చేరిందని, ఈ విషయాన్ని అంగీకరించేందుకు కేంద్రం సిద్ధంగా లేదని విమర్శించారు. గత ఏడాది ఏప్రిల్-నవంబర్ మధ్యకాలంలో వ్యవసాయం మొదలుకొని తయారీ రంగం, రుణాల వృద్ధి, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, బొగ్గు, విద్యుత్, సహజ వాయువుల వాడకం ఇలా అన్ని అంశాల్లోనూ తిరోగమనమే కనిపించిందని ఆయన తెలిపారు. బడ్జెట్‌లో దేశ ఆర్థిక స్థితి ఏమిటన్నది కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పలేకపోయారని ఆరోపించారు. 2016 నాటి పెద్ద నోట్ల రద్దు నిర్ణయం, ఆ తరువాతి ఏడాది హడావుడిగా జీఎస్టీని అమలు చేయడం మోదీ ప్రభుత్వం చేసిన రెండు ఘోరమైన తప్పిదాలని, వీటితో ఆర్థిక వ్యవస్థ పూర్తిగా వెనుకబడిపోయిందని ఆయన స్పష్టం చేశారు. ఒకప్పుడు 8.2 శాతంగా ఉన్న స్థూల జాతీయోత్పత్తి 5 శాతానికి పడిపోయిందన్నారు.

పేదలు మరింత పేదరికంలోకి...

గత ఏడాది బడ్జెట్‌లో అంచనాలు... పెట్టిన ఖర్చుల్లో భారీ అంతరం ఉందని, పన్ను వసూళ్లలో రూ.లక్ష కోట్ల వరకూ తగ్గుదల ఉంటే.. పెట్టిన ఖర్చు కూడా సుమారు రూ.లక్ష కోట్ల వరకూ తక్కువగా ఉండటాన్ని మాజీ ఆర్థిక మంత్రి విస్పష్టంగా వివరించారు. కార్పొరేట్ ట్యాక్స్, ఆదాయపు పన్ను, కస్టమ్స్, ఎక్సైజ్, జీఎస్టీ వసూళ్లు రూ.లక్షల కోట్లు తక్కువగా ఉండటం ఆర్థిక వ్యవస్థ పతనమవుతోందనేందుకు ప్రత్యక్ష సాక్ష్యాలని చిదంబరం తెలిపారు. దేశంలోని పేదల ఆహార సబ్సిడీ, కూలీలకు ఉపయోగపడే జాతీయ ఉపాధి హామీ పథకం, పోషకాహార లోపంతో ఉన్న పిల్లలకు ఇచ్చే సబ్సిడీలను తగ్గించడం ద్వారా బీజేపీ ప్రభుత్వం జాలిలేని, పేదల వ్యతిరేక ప్రభుత్వంగా ప్రవర్తించిందని విమర్శించారు. వ్యవసాయానికి, ఆహార సబ్సిడీ నిధుల్లో కోత గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై దుష్ప్రభావం చూపుతుందని పేదలు మరింత పేదరికంలోకి చేరే ప్రమాదముందని హెచ్చరించారు.

ఇదీ అసలు సమస్య..

దేశ ఆర్థిక వ్యవస్థ ఐసీయూలో చేరేందుకు డిమాండ్ లేమి ఒక కారణమైతే... పెట్టుబడిదారులకు ఈ ప్రభుత్వంపై నమ్మకం లేకపోవడం రెండో కారణమని చిదంబరం అన్నారు. గత కొన్నేళ్లలో ఒక్క ఆటోమొబైల్ రంగంలోనే 2 లక్షల మంది ఉపాధి కోల్పోయారని, 296 వర్క్‌షాపులు మూతపడ్డాయన్నారు. అంతేకాకుండా వారానికి ఏడు రోజులు పనిచేసిన ఫ్యాక్టరీలిప్పుడు నాలుగురోజులు మాత్రమే పని చేస్తున్నాయని అన్నారు. ఆదాయపు పన్ను, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, జీఎస్టీ, డీఆర్ఐ వంటి సంస్థల్లో అతితక్కువ స్థాయి అధికారులకూ విచక్షణాధికారాలు కట్టబెట్టడంతో కంపెనీలు విపరీతమైన వేధింపులు ఎదుర్కొంటున్నాయని ఆయన చెప్పారు. కంపెనీలు చేసే కొన్ని తప్పులను తమ హయాంలో జరిమానాలతో సరిదిద్దేవాళ్లమని, ప్రస్తుత ప్రభుత్వం అలాంటి చట్టాలను కూడా నేరపూరితమైనవిగా మార్చేయడంతో పరిస్థితి మరింత దిగజారిందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కేంద్ర మాజీ కార్యదర్శి పద్మనాభయ్య, సామాజిక కార్యకర్త డాక్టర్ సునీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'వీసీ'గి వేగాల్సిందేనా?

- రెగ్యులర్ వీసీల్లేక యూనివర్సిటీలు వెలవెల
- ఇన్‌చార్జుల పాలనలో మగ్గుతున్న వర్సిటీలు
- చాలామంది ఐఏఎస్‌లనే ఇన్‌చార్జులుగా నియామకం
- అన్ని విశ్వవిద్యాలయాల్లోనూ నెలల తరబడి ఇదే స్థితి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు నెలల తరబడి.. కొన్ని యూనివర్సిటీలు అయితే ఏళ్ల తరబడి ఇన్‌చార్జుల పాలనలో సాగిపోతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 10 విశ్వవిద్యాలయాలకు ఇన్‌చార్జులు.. అందులో ఐఏఎస్ అధికారులే వీసీలుగా వ్యవహరిస్తున్నారు. ప్రతిష్టాత్మక ఉస్మానియా వర్సిటీ సహా అన్నింటికీ ఇన్‌చార్జులే ఉండగా, శాతవాహన, ఆర్జీయూకేటీలకు దాదాపు ఐదేళ్లుగా రెగ్యులర్ వైస్ చాన్స్‌లర్ లేకపోవడం గమనార్హం. కాకతీయ, పాలమూరు, తెలంగాణ, జేఎన్టీయూ, మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలకు కూడా ఇన్‌చార్జులే వైస్‌చాన్స్‌లర్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో విశ్వవిద్యాలయాల్లో విద్యాప్రమాణాలు పడిపోతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది.

సెర్చ్ కమిటీలు ఏమయ్యాయో?

విశ్వవిద్యాలయాల వీసీల ఎంపిక కోసం ప్రభుత్వం దాదాపు రెండు నెలల కింద సెర్చ్ కమిటీలు ఏర్పాటు చేసింది. ప్రస్తుత సీఎస్ సోమేశ్‌కుమార్ నేతృత్వంలో ఈ సెర్చ్ కమిటీలు ఏర్పాటు చేశారు. కానీ, ఇప్పటివరకు ఏ యూనివర్సిటీకి సంబంధించిన సెర్చ్ కమిటీ సమావేశాలు జరగకపోవడం గమనార్హం. వీసీ పోస్టులో ఎవరిని నియమించాలన్న దానిపై కూడా ప్రభుత్వానికి కనీసం స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో సెర్చ్ కమిటీ సమావేశాలు జరిగి, అన్ని అర్హతలున్న ప్రొఫెసర్లను ఈ పోస్టులకు ఎంపిక చేయడానికి ఎంత కాలం పడుతుందో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఇన్‌చార్జులుగా చాలా మంది ఐఏఎస్ అధికారులే ఉండటంతో వారు యూనివర్సిటీ వ్యవహారాలపై దృష్టి సారించలేకపోతున్నారు. సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్‌ను ఉస్మానియా, మహాత్మాగాంధీ యూనివర్సిటీలకు ఇన్‌చార్జిగా నియమించారు. మిగిలిన వాటికి కూడా ఐఏఎస్‌లే ఇన్‌చార్జులుగా ఉన్నారు. ఇందులో కూడా సీనియర్లే ఎక్కువ మంది ఉండటంతో వారి శాఖలకు సంబంధించిన కార్యకలాపాల పర్యవేక్షణకే సమయం చాలట్లేదు. యూనివర్సిటీ స్నాతకోత్సవాలకు.. లేదంటే తీరిక దొరికినప్పుడు మాత్రమే చుట్టపుచూపుగా వర్సిటీలకు వెళ్తున్నారు. దీంతో యూనివర్సిటీల పరిపాలన అస్తవ్యస్తం అవుతోందని, రోజువారీ కార్యకలాపాల నిర్వహణ కూడా కష్టంగా మారుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొత్త కోర్సుల ప్రతిపాదనలు, వాటికి అనుమతి తెచ్చుకోవడం, సీట్ల సంఖ్య పెంపు, కోర్సుల డిజైన్‌లో మార్పులు, పరిశోధన లాంటి వ్యవహారాలు ఇన్‌చార్జులతో సాధ్యమయ్యేది కాదని, అత్యవసర విధుల నిర్వహణకు మాత్రమే వీరు ఉపయోగపడుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రెగ్యులర్ వీసీ లేకుండా పాలనా నిర్ణయాలు తీసుకోవడం సాధ్యం కాని పరిస్థితుల్లో ఇన్‌చార్జుల పాలన ఇంకెన్నాళ్లని విద్యార్థి సంఘాలు, విద్యారంగ నిపుణులు ప్రశ్నిస్తున్నారు. విద్యాసంవత్సరం పూర్తి కావస్తున్న పరిస్థితుల్లో వార్షిక పరీక్షల నిర్వహణ, తదుపరి సంవత్సరానికి ప్రవేశ

పరీక్షల నోటిఫికేషన్లు, వాటి నిర్వహణ, అడ్మిషన్లు లాంటి కీలక విధులు నిర్వహించాల్సిన సమయం ఆసన్నమైందని, ఇప్పుడైనా వర్సిటీలకు రెగ్యులర్ వీసీలను నియమించాలని కోరుతున్నారు.

ఏ వర్సిటీలో.. ఎప్పటి నుంచి

యూనివర్సిటీ	ఖాళీ అయిన తేదీ
ఉస్మానియా	23-07-2019
కాకతీయ	23-07-2019
పాలమూరు	23-07-2019
తెలంగాణ	23-07-2019
జేఎన్టీయూ	23-07-2019
మహాత్మాగాంధీ	29-06-2019
తెలుగు	23-07-2019
అంబేడ్కర్ ఓపెన్	23-07-2019
ఆర్జీయూకేటీ, బాసర	18-01-2015
శాతవాహన	18-04-2015

తుక్కుగూడలో కేకేకు ఓటు హక్కుపై రిట్

హైకోర్టులో బీజేపీ కౌన్సిలర్లు రిట్ దాఖలు

సాక్షి, హైదరాబాద్: తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల్లో ఎక్స్‌అఫీషియో మెంబర్‌గా రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావు (కేకే) వేసిన ఓటు చెల్లదని ప్రకటించాలని కోరుతూ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలైంది. రాజ్యసభ సభ్యుడిగా కేకేను.. ఏపీకి కేటాయించారని, ఆయన ఓటును రద్దు చేయాలని కోరుతూ బీజేపీకి చెందిన కౌన్సిలర్లు రిట్ దాఖలు చేశారు. ఇందులో ప్రతివాదులుగా రాష్ట్ర ఎన్నికల అధికారి, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి రాజేశ్వర్‌రెడ్డి, చైర్మన్ మధుమోహన్, వైస్ చైర్మన్ బి.వెంకట్‌రెడ్డిలను పేర్కొన్నారు. కేకే ఓటు వేయడానికి అనుమతించిన ఎన్నికల అధికారి ఎస్.రాజేశ్వర్‌రెడ్డి అనుమతి ఇవ్వడాన్ని మున్సిపల్ చట్టంలోని సెక్షన్ 5 (2), (3)కు వ్యతిరేకమని ప్రకటించాలని కోరతూ రాజుమోనిరాజు సహా 8 మంది కౌన్సిలర్లు హైకోర్టును ఆశ్రయించారు. మధుమోహన్, వెంకట్‌రెడ్డి.. చైర్మన్, వైస్ చైర్మన్లుగా ఎన్నిక అయ్యేందుకు ఎక్స్‌అఫీషియో మెంబర్‌గా కేకే ఓటు కీలకమైందని, ఏపీకి చెందిన ఎంపీగా కేకే ఉన్నందున ఆయన తెలంగాణ రాష్ట్రంలోని మున్సిపల్ ఎన్నికల్లో ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఎన్నికల అధికారి అనుమతించడం చెల్లదని ప్రకటించాలని కోరారు. 2014లో కేకే ఏపీ కోటా కింద రాజ్యసభకు ఎన్నికైనట్లుగా రాజ్యసభ సచివాలయ రికార్డుల్లో కూడా ఉందని తెలిపారు.

త్వరలో మహిళల భద్రతకు 'షీ సేఫ్' యాప్

రాష్ట్ర షీ టీమ్స్ ఇన్‌చార్జ్ స్వాతి లక్రా వెల్లడి

హైదరాబాద్: మహిళల భద్రత కోసం త్వరలో 'షీ సేఫ్'యాప్‌ను తీసుకురానున్నామని రాష్ట్ర షీ టీమ్స్ ఇన్‌చార్జ్ స్వాతి లక్రా పేర్కొన్నారు. గచ్చిబౌలి స్టేడియం వద్ద శనివారం రాత్రి సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సీఎస్‌సీ), సైబరాబాద్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన 'షీ సేఫ్ నైట్ వాక్'ను స్వాతి లక్రా, సైబరాబాద్ కమిషనర్ వీసీ సజ్జనార్, బ్యాడ్మింటన్ జాతీయ కోచ్ పుల్లెల గోపీచంద్, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, పద్మశ్రీ పీవీ సింధు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వాతి లక్రా మాట్లాడుతూ...రాష్ట్రంతో పాటు నగరంలో మహిళల భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఐటీ కారిడార్‌లో రాత్రి సమయంలో విధులు నిర్వహించే మహిళల సంఖ్య ఎక్కువగా ఉంటుందని, వారంతా పోలీసుల సహాయం లేకుండా సురక్షితంగా ఇంటికి చేరుకునేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. భద్రతపై మహిళలకు అవగాహన కల్పించేందుకే నైట్ వాక్ నిర్వహించామని పేర్కొన్నారు. సైబరాబాద్ కమిషనర్ వీసీ సజ్జనార్ మాట్లాడుతూ..ఐటీ కారిడార్‌లో మహిళల భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. భద్రతపై మహిళలకు భరోసా కల్పించేందుకే షీ సేఫ్ నైట్ వాక్‌ను నిర్వహించామని తెలిపారు. గచ్చిబౌలి స్టేడియం నుంచి ట్రిపుల్ ఐటీ జంక్షన్, పుల్లెల గోపీచంద్ అకాడమీ వరకు అక్కడి నుంచి తిరిగి గచ్చిబౌలి స్టేడియం వరకు షీ సేఫ్ నైట్ వాక్ కొనసాగింది. గైనకాలజిస్ట్, పద్మశ్రీ డాక్టర్ మంజుల అనగాని, నటి ఇషా రెబ్బా, ఎస్‌సీఎస్‌సీ వైస్ చైర్మన్ భరణి కుమార్, సైబరాబాద్ షీ టీమ్స్ ఇన్‌చార్జ్, డీసీపీ అనసూయ, ఎస్‌సీఎస్‌సీ ఉమెన్ ఫోరం లీడర్ ప్రత్యూష, బిత్తిరి సత్తి, ఐటీ ఉద్యోగులు, పోలీసులు పాల్గొన్నారు.

'సహకార' బరి.. డీసీసీబీ పీఠంపై గురి

- ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ఎన్నికల నేపథ్యంలో బరిలో ముఖ్య నేతలు
- కేటీఆర్‌ను కలిసిన ఔత్సాహికులు, ఏకగ్రీవంగా ఎన్నికయ్యే ప్రయత్నం

సాక్షి, హైదరాబాద్: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పాలక మండలి ఎన్నికలు పూర్వపు ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.దీంతో డీసీసీబీ చైర్మన్ పదవులపై కన్నేసిన టీఆర్ఎస్ నేతలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) ఎన్నికలపై దృష్టి సారించారు. పీఏసీఎస్ డైరెక్టర్లుగా, ఆ తర్వాత పీఏసీఎస్ చైర్మన్లుగా ఎన్నికైతేనే డీసీసీబీ అధ్యక్ష పీఠానికి పోటీ పడే అవకాశం ఉంటుంది. దీంతో డీసీసీబీ పీఠాన్ని ఆశిస్తున్న పలువురు నేతలు పీఏసీఎస్ స్థాయిలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యేందుకు తమ వంతు ప్రయత్నాలు సాగిస్తున్నారు. రాష్ట్రంలో 905 పీఏసీఎస్‌ల పరిధిలోని 12,100 డైరెక్టర్ స్థానాలకు శనివారంతో నామినేషన్ల స్వీకరణ ముగిసింది. సోమవారం ఉపసంహరణకు గడువు ఉండటంతో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్ష పదవిని ఆశిస్తున్న నేతలు డైరెక్టర్లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇదిలాఉంటే 2013లో ఉమ్మడి ఏపీలో జరిగిన సహకార ఎన్నికల్లో తెలంగాణలోని 9 పాత జిల్లాలకు చెందిన డీసీసీబీ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులే గెలుపొందారు. 2014లో రాష్ట్ర ఆవిర్భావం తర్వాత వరంగల్ మినహా మిగతా 8 జిల్లాల డీసీసీబీ అధ్యక్షుడు టీఆర్ఎస్ పార్టీలో చేరారు. గతంలో టీఆర్ఎస్‌లో చేరిన డీసీసీబీ అధ్యక్షుల్లో ఒకరిద్దరు మినహా మిగతా వారు మరోమారు అదే పదవిని ఆశిస్తూ సహకార ఎన్నికల్లో పీఏసీఎస్ డైరెక్టర్ స్థానాలకు నామినేషన్లు దాఖలు చేశారు. మరో వారం రోజుల్లో పీఏసీఎస్ స్థాయిలో ఎన్నిక పూర్తవ్వనుండటంతో, డీసీసీబీ అధ్యక్ష పదవిపై ఏకాభిప్రాయానికి వచ్చేందుకు పూర్వపు ఉమ్మడి జిల్లాల వారీగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్య నేతలతో సమావేశాలు జరపాల్సిందిగా సంబంధిత జిల్లాలకు చెందిన మంత్రులను టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశించారు. ఇప్పటికే మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అధ్యక్షతన -ఉమ్మడి వరంగల్ జిల్లా సమావేశం పూర్తికాగా, త్వరలో ఇతర జిల్లాల నేతలు కూడా భేటీ కానున్నారు.

ఇప్పటికే కేటీఆర్‌ను కలిసిన ఔత్సాహికులు

డీసీసీబీ అధ్యక్ష పీఠాన్ని ఆశిస్తున్న పలువురు టీఆర్ఎస్ నాయకులు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్

ఓటేసిన రాష్ట్రపతి కోవింద్ దంపతులు. పోలింగ్ కేంద్రం వద్ద సోనియా, ప్రియాంక. సిరా గుర్తుతో ఎంపీ గౌతం గంభీర్ దంపతులు. 9నెలల పాపతో క్లాసికల్ డ్యాన్సర్ అరణ్యని. ఓటేసిన 111ఏళ్ల కలితార మండల్

ఢిల్లీలో పోలింగ్ 61%

- ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు
- సీఎం కేజ్రీవాల్ నియోజకవర్గంలో స్వల్ప ఓటింగ్
- ఓటేసిన పలువురు ప్రముఖులు

న్యూఢిల్లీ: ఢిల్లీ శాసనసభ ఎన్నికలు భారీ బందోబస్తు మధ్య శనివారం ప్రశాంతంగా ముగిశాయి. సాయంత్రానికి 61.46% పోలింగ్ నమోదైంది. ఢిల్లీలోని 11 జిల్లాలకు గాను ఈశాన్య ఢిల్లీలో అత్యధికంగా 65.24% పోలింగ్ నమోదు కాగా, న్యూఢిల్లీలో 56.10%, ఆగ్నేయ ఢిల్లీలో అత్యల్పంగా 54.89% మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు అధికారులు ప్రకటించారు. సీఎం కేజ్రీవాల్ బరిలో ఉన్న న్యూఢిల్లీ నియోజకవర్గంలో 42% మంది ఓటేశారు. కొన్ని పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లు బారులు తీరి ఉన్నందున పోలింగ్ శాతం పెరిగే చాన్సుందని అధికారులు తెలిపారు. గత 2015 అసెంబ్లీ ఎన్నికల్లో 67.47% పోలింగ్ నమోదు కాగా, గత ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీలో 60.60% పోలింగ్ నమోదైంది. పెట్రోలింగ్, క్విక్ రెస్పాన్స్ టీములు కలిపి 60వేల మంది పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. ఢిల్లీ అసెంబ్లీలోని 70 స్థానాలకు ఈ నెల 11వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది.

పోలింగ్ సరళి ఇలా..

పోలింగ్ ఉదయం 8 గంటలకు ప్రారంభం కాగా మొదటి మూడు గంటల్లో కేవలం 14.5% మాత్రమే పోలింగ్ జరిగింది. ఆ తర్వాత కొద్దిగా పుంజుకుని, మధ్యాహ్నం 3 గంటలకు 41.5%కు చేరుకుంది. పోలింగ్ ముగిసే 6 గంటల సమయానికి ముస్లిం ఓటర్లు ఎక్కువగా ఉన్న ముస్తాఫాబాద్‌లో 66.29%, మతియామహల్ 65.62%, సీలాంపూర్‌లో 64.92% పోలింగ్ నమోదైంది. షహీన్‌బాగ్‌లాంటి కొన్ని చోట్ల ఓటర్ల క్యూలు కొనసాగుతున్నందున పోలింగ్ శాతం పెరిగే అవకాశాలున్నాయని ఢిల్లీ చీఫ్ ఎలక్టోరల్ అధికారి రణ్‌బీర్ సింగ్ తెలిపారు. వీవీప్యాట్ స్లిప్పులో తన ఫొటో, పేరు కనిపించలేదంటూ న్యూఢిల్లీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి రమేశ్ సభర్వాల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో కొద్దిసేపు పోలింగ్‌కు అంతరాయం కలిగింది. అధికారులు వెంటనే ఆ వీవీప్యాట్ మిషన్ స్థానంలో మరొకటి ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో వీవీప్యాట్ వైఫల్యం కేవలం ఒక్క శాతమేనని సీఈవో తెలిపారు. శతాధిక వృద్ధులు 60 మందికిపైగా ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు.

ఓటేసిన ప్రముఖులు

రాష్ట్రపతి కోవింద్, మాజీ ప్రధాని మన్మోహన్, కాంగ్రెస్ చీఫ్ సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంక, కేంద్ర మంత్రులు జైశంకర్, హర్దీప్ సింగ్ తదితరులు ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఆప్ కన్వీనర్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ రాజ్‌పూర్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ పోలింగ్ కేంద్రంలో తల్లిదండ్రులతోపాటు భార్య సునీత, కొడుకు పుల్కిత్‌తో కలిసి వచ్చి ఓటు వేశారు. ముందుగా ఆయన తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకున్నారు. ప్రియాంకా గాంధీ కొడుకు రెహాన్, కేజ్రీవాల్ కొడుకు పుల్కిత్ మొదటిసారిగా ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో ఉన్నారు. కేజ్రీవాల్ మళ్లీ సీఎం అవుతారని భావిస్తున్నారా అని మీడియా ప్రశ్నించగా ప్రజలు ఎవరికి ఓటేస్తే వారే ఢిల్లీ సీఎం అవుతారని పుల్కిత్ బదులిచ్చాడు.

కేజ్రీవాల్, స్మృతి ఇరానీ ట్విట్టర్ వార్

ఓటు ఎవరికి వేయాలనే విషయంలో మగవారిని సంప్రదించాలంటూ ఢిల్లీ మహిళలకు ఆప్ నేత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఇచ్చిన పిలుపుపై కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ ట్విట్టర్ వేదికగా విమర్శనాస్త్రాలు సంధించారు. 'మీరంతా తప్పకుండా ఓట్లేయండి. ముఖ్యంగా మహిళలకు ఓ విన్నపం. కుటుంబంతోపాటు దేశం, ఢిల్లీ గురించి ఆలోచించాల్సిన బాధ్యత మీపై ఉంది. ఎవరికి ఓటు వేయాలనే విషయంలో మీ ఇంట్లో మగవారితోనూ చర్చించండి' అంటూ పోలింగ్‌కు ముందు కేజ్రీవాల్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. దీనిపై కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ స్పందిస్తూ..ఎవరికి ఓట్లేయాలో తెలియని స్థితిలో మహిళలున్నట్లు కేజ్రీవాల్ భావిస్తున్నారని మండిపడ్డారు. ఇందుకు కేజ్రీవాల్ బదులిస్తూ..ఇంటి బాధ్యతలు మోసే ఢిల్లీ మహిళలు తమ కుటుంబం ఎవరికి ఓటేయాలో కూడా ఈసారి నిర్ణయించారని వ్యాఖ్యానించారు.

ఓటేశాక సిరా గుర్తు చూపిస్తున్న సీఎం కేజ్రీవాల్

షహీన్‌బాగ్‌లో ఆగని నిరసనలు

పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా దేశ రాజధాని షహీన్‌బాగ్‌లో పోలింగ్ రోజూ నిరసనలు ఆగలేదు. నిరసనలు కొనసాగేందుకు వీలుగా అందులోని మహిళలు కొందరు మధ్యాహ్నం, కొందరు సాయంత్రం పోలింగ్ బూత్‌లకు వెళ్లి ఓటేశారు. ప్రజాస్వామ్యానికి ఎంతో కీలకమైన పోలింగ్ ప్రక్రియలో తామూ భాగస్వాములయ్యామని నిరసనల్లో పాల్గొంటున్న జెహ్రా షేక్ తెలిపారు. బిర్యానీ కోసమే నిరసనల్లో పాల్గొంటున్నట్లు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ చేసిన వ్యాఖ్యలు తప్పని రుజువు చేసేందుకు ఓట్లు వేశామని మొహమ్మద్ అయూబ్ అన్నారు. ఏ పార్టీ వారు కూడా తమకు బిర్యానీ సరఫరా చేయడం లేదన్నారు. షహీన్‌బాగ్‌లో నిరసనకారులకు ఢిల్లీ సీఎం బిర్యానీ అందజేస్తున్నారంటూ చేసిన వ్యాఖ్యలకు యూపీ సీఎం యోగికి ఈసీ నోటీసులు పంపింది.

ఆప్ కీ సర్కార్!

- మళ్లీ సీఎం పీఠంపై కేజ్రీవాల్?
- గతంతో పోలిస్తే తగ్గనున్న మెజార్టీ
- కాంగ్రెస్ రేసులో లేదు
- ఎగ్జిట్ పోల్స్ అంచనాలు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో కూడా కమలం కలలు కల్లలేనా? దేశానికి మోదీ, రాష్ట్రానికి కేజ్రీవాల్ అని ఓటర్లు ఫిక్సయిపోయారా? జాతీయవాదాన్ని అభివృద్ధి, ఉచిత పథకాల ఎజెండా అధిగమించిందా? మరోసారి ఆప్ కీ సర్కార్ అనే రాజధాని ఓటర్లు నినదించారా? కాంగ్రెస్ పార్టీ నామ మాత్రపు పోటీ కూడా ఇవ్వలేక పోయిందా?.. ఈ ప్రశ్నలన్నింటికీ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఎగ్జిట్ పోల్స్ అవుననే సమాధానం చెబుతున్నాయి.

ఢిల్లీ ప్రజలు మరోసారి ఆప్‌కే పట్టం కడతారని ఎగ్జిట్ పోల్స్ తేల్చి చెప్పాయి. అయితే, 2015 ఎన్నికల మాదిరిగా భారీ స్థాయి మెజార్టీ రాకపోవచ్చునని అంచనా వేశాయి. వివిధ ఎగ్జిట్ పోల్స్ అంచనాలను సమీక్షించి చూస్తే అధికార ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) 40 నుంచి 50 స్థానాలను గెలుచుకోవచ్చునని, బీజేపీకి 10 నుంచి 20 సీట్లు వచ్చే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఈసారి ఒక్క స్థానం కూడా గెలుచుకోలేక చతికిలపడుతుందని అత్యధిక ఎగ్జిట్ పోల్స్ వెల్లడించాయి. ఢిల్లీ ఎన్నికల ప్రచారం ప్రారంభ సమయంలో ఈసారి త్రిముఖ పోటీ ఉంటుందని భావించారు. గత ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 7 స్థానాలను స్వీప్ చేయడం, కాంగ్రెస్ ఓట్ల శాతంలో రెండో స్థానంలో నిలవడంతో ఈసారి ఏం జరుగుతుందనే ఉత్కంఠ నెలకొంది. కమలదళం మహారాష్ట్ర, హరియాణా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే జాతీయ భద్రత, అయోధ్యలో రామాలయ నిర్మాణం, కశ్మీర్‌లో 370 ఆర్టికల్ వంటి అంశాలనే ప్రచారాస్త్రాలుగా మలచుకుంది. ప్రధానంగా పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)కి వ్యతిరేకంగా షహీన్‌బాగ్‌లో జరుగుతున్న నిరసనల్ని పదే పదే ప్రస్తావించి, వారికి మద్దతిచ్చిన వాళ్లని దేశద్రోహులుగా చిత్రీకరించే ప్రయత్నం చేసింది. సీఎం కేజ్రీవాల్ మాత్రం తన సొంత సంక్షేమ ఎజెండాతోనే ముందుకు వెళ్లారు. బీజేపీ నేతలు రెచ్చగొట్టే ప్రకటనలు చేసినా అయిదేళ్లలో తాను చేసిన సుపరిపాలననే నమ్ముకుని సంయమనంతో వ్యవహరించారు. షహీన్‌బాగ్ వైపు కన్నెత్తి కూడా చూడకుండా 'మీరు గెలిస్తే సీఎం ఎవరు'అంటూ సవాల్ విసిరారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు, నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, నెలకు 20 వేల లీటర్లు ఉచితంగా నీళ్లు వంటివి కేజ్రీవాల్‌పై క్రేజ్‌ను ఏ మాత్రం తగ్గించలేదని ఎన్నికల విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కాంగ్రెస్‌లో సీనియర్ నేతలు పోటీకి అంగీకరించకుండా, వారి బంధువులకే టిక్కెట్లు ఇప్పించుకోవడం, గాంధీ కుటుంబం ఆఖరి నిమిషంలో తూతూ మంత్రంగా ప్రచారం చేయడం వంటివి ఆప్‌కి కలిసి వస్తాయన్న అభిప్రాయం ఉంది. ఈసారి ఎగ్జిట్ పోల్స్ నిజం అవుతాయా? ఢిల్లీ ప్రజల అసలైన నాడిని పట్టుకోగలిగాయా? అన్నది 11న వచ్చే ఫలితాల్లో తేలిపోనుంది.

మెజారిటీ మాదే: ఆప్

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఎగ్జిట్ పోల్ సర్వేలన్నీ ఆప్ వైపే మొగ్గుచూపుతుండగా బీజేపీ ఢిల్లీ చీఫ్ మనోజ్ తివారీ మాత్రం.. తమ పార్టీ క్లీన్‌స్వీప్ సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఓటరు నాడిని అంచనా వేయడంలో ఎగ్జిట్ పోల్స్ విఫలమయ్యాయని పేర్కొన్నారు. 48 సీట్లు గెలుచుకుని ఢిల్లీలో అధికారం చేపడుతుందని స్పష్టం చేశారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో తమకు భారీ మెజారిటీ రానుందని ఆప్ నేత, ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా ధీమా వ్యక్తం చేశారు. పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన నాయకులను ఆయన ట్విట్టర్ ద్వారా అభినందించారు.

క్లుప్తంగా...

ఇరాన్ బలంగా తయారవ్వాలి: ఖమేనీ

టెహ్రాన్: యుద్ధాన్ని నిరోధించడానికి, శత్రువుల బెదిరింపులను ఎదుర్కోవడానికి ఇరాన్ ఇంకా బలంగా తయారు కావాలని ఆ దేశ సుప్రీం నాయకుడు అయతోల్లా అలీ ఖమేనీ అన్నారు. 1979 ఇస్లామిక్ విప్లవం తర్వాత దశాబ్దాలుగా అమెరికా ఒత్తిడి ఉన్నప్పటికీ ఇరాన్ బలమైన వైమానిక దళాన్ని తయారు చేసుకోగలిగిందన్నారు. శనివారం వైమానిక దళం కమాండర్స్, సిబ్బందితో ఆయన మాట్లాడుతూ.. యుద్ధ భయం, శత్రు భయం లేకుండా మనం పటిష్టంగా తయారు కావాలని పిలుపునిచ్చారు. తాము ఎవరినీ బెదిరించాల్సిన అవసరం లేదన్నారు.

అంబులెన్స్ ఆలస్యం.. మహిళ మృతి

రాంచీ: సమయానికి అంబులెన్స్ రాక మహిళ ప్రాణాలు కోల్పోయిన ఘటన జార్ఖండ్‌లో జరిగింది. గుమ్లా జిల్లాలోని సదర్ ఆస్పత్రిలో సదాన్ దేవి(48) గత నెల 29న చేరారు. అయితే ఆమె పరిస్థితి ఉన్నట్టుండి విషమంగా మారడంతో వైద్యులు రాంచీలోని రాజేంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (రిమ్స్)కు తీస్కెళ్లాల్సిందిగా శుక్రవారం మధ్యాహ్నం సూచించారు. బాధితురాలి బంధువులు అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. అయితే అంబులెన్స్ మూడు గంటలు ఆలస్యంగా వచ్చింది. ఆమెను రిమ్స్‌కు తరలించినా ఆలస్యం కావడంతో మరణించింది. అంబులెన్స్ డ్రైవర్ ఆలస్యం చేయడమే దీనికి కారణమని వైద్యులు తెలిపారు.

పాక్‌లో హిందూ వ్యతిరేక పోస్టు.. ఆపై వేటు

లాహోర్: హిందువులకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టినందుకు పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ నడుపుతున్న పార్టీ తెహ్రీక్ ఎ ఇన్సాఫ్ తమ ప్రధాన కార్యదర్శి మియాన్ అక్రమ్ ఉస్మాన్‌ను తొలగించినట్లు శనివారం ప్రకటించింది. 'హిందువుకు మాటలతో కాదు బలగాలతో సమాధానం చెప్పాలి' అంటూ అక్రమ్ ట్వీట్ చేశారు. దీన్ని పార్టీ సీరియస్‌గా తీసుకుంది. మైనారిటీలపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం పార్టీ సహించదని చెబుతూ ఆయన్ను తొలగించింది. ఇది తమ పార్టీ పాలసీకి వ్యతిరేకమని చెప్పింది.

సోషల్ మీడియాతో ఎక్కువ వ్యూస్

లండన్: సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, ట్విట్టర్, గూగుల్‌ల వాడకం వల్ల వార్తల వెబ్‌సైట్లకు ఎక్కువ వ్యూస్ వస్తాయని, ఎక్కువ వెబ్‌సైట్లను దర్శించే చాన్సుంటుందని పరిశోధకులు కనుగొన్నారు. సామాజిక మాధ్యమాల వాడకం ప్రజలు చూసే వార్తల వైవిధ్యంపై ప్రభావం చూపుతుందని ఇప్పటి వరకూ నమ్మిన మూల సిద్ధాంతానికి పరిశోధకుల తాజా ఫలితం.. వ్యతిరేకంగా ఉంది. ఫేస్‌బుక్, గూగుల్‌లను వీక్షించేవాళ్లు ఎక్కువగా వార్తలకు సంబంధించిన అంశాలను చూస్తుంటారని, ఇంటర్నెట్‌లో వార్తల వినియోగానికి సామాజిక మాధ్యమాల వాడకం ముఖ్యమైన విధానమని జర్మనీలోని హోహెన్‌హీమ్ విశ్వవిద్యాలయానికి చెందిన ఫ్రాంక్ మాన్‌గోల్డ్ తెలిపారు.

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో సామూహిక వివాహవేడుకలో నవదంపతులకు ఇచ్చేందుకు సిద్ధంచేసిన సామగ్రి. మంచం, బీరువా, ఫ్రిజ్, కుట్టుమిషన్ తదితరాలు ఇందులో ఉన్నాయి.

తమిళుల సమస్యలను పరిష్కరించండి

- మహిందా రాజపక్సను కోరిన ప్రధాని నరేంద్ర మోదీ
- ద్వైపాక్షిక అంశాలపైనా చర్చ

న్యూఢిల్లీ: శ్రీలంకలోని తమిళుల సమస్యలను పరిష్కరించాలని, వారి హక్కుల కోసం అక్కడి రాజ్యాంగంలో ఉద్దేశించిన నిబంధనలను అమలు చేయాలని శ్రీలంక ప్రధాని మహిందా రాజపక్సను ప్రధాని మోదీ కోరారు. చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని, తమిళుల సయోధ్య ప్రక్రియను అమలు చేయాలని కోరారు. ఇందుకోసం శ్రీలంక రాజ్యాంగంలోని 13వ సవరణను అమలు చేయాలని తెలిపారు. ఐదు రోజుల పర్యటనలో భాగంగా భారత్‌కు చేరుకున్న రాజపక్స శనివారం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. శ్రీలంకలో తమిళుల జీవన ప్రమాణాల పెంపు, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాటం, మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇరుదేశాల మధ్య వాణిజ్య సంబంధాలు మెరుగుపరచుకోవడం వంటి పలు అంశాలపై ఇరువురు నేతలు విస్తృత స్థాయి చర్చలు జరిపారు. శ్రీలంకలో తమిళుల సమస్యల పరిష్కారానికి కొలంబో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. మత్స్యకారుల సమస్యలపై మానవతా కోణంలో స్పందించాలని ఇరుదేశాలు నిర్ణయించాయని వెల్లడించారు. ఉగ్రవాదంపై ఉమ్మడిగా పోరాడాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడటంలో సహకారం అందించినందుకు భారత ప్రధాని నరేంద్ర మోదీకి రాజపక్స కృతజ్ఞతలు తెలిపారు.

ప్రధాని మోదీతో కరచాలనం చేస్తున్న శ్రీలంక ప్రధాన మంత్రి మహిందా రాజపక్స

థాయిలాండ్‌లో సైనికుడి కాల్పులు

20 మంది దుర్మరణం.. 14 మందికి గాయాలు

బ్యాంకాక్: థాయిలాండ్‌లో ఓ సైనికుడు విచక్షణారహితంగా కాల్పులు జరిపి 20 మందిని పొట్టనబెట్టుకున్నాడు. థాయిలాండ్‌లోని నఖోన్ రట్చసిమా నగరంలో శనివారం మధ్యాహ్నం ఈ దారుణ ఘటన జరిగింది. నగరంలోని సైనిక స్థావరం నుంచి ఒక సైనిక వాహనాన్ని దొంగిలించిన సైనికుడు సర్జంట్ మేజర్ జక్రపంత్ తొమ్మా నగరం నడిబొడ్డుకు దాన్ని నడుపుకుంటూ వెళ్లాడు. అక్కడి టెర్మినల్ 21మాల్‌లో ప్రవేశించి మెషీన్ గన్‌తో అక్కడ ఉన్నవారిపైకి విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. దీంతో 20 మంది ప్రాణాలు కోల్పోయారు. 14 మంది గాయాలపాలయ్యారు. ప్రాణాలు కోల్పోయిన వారిలో రెండేళ్ల బాలుడు కూడా ఉన్నాడు. కాల్పులకు సంబంధించిన ఫొటోలను స్వయంగా నిందితుడే తీసి ఫేస్‌బుక్‌లో షేర్ చేశాడు. 'నేను లొంగిపోవాలా? మరణాన్ని ఎవరూ తప్పించుకోలేరు' అంటూ ఒక పోస్ట్, 'నేను అలసిపోయాను.. ఇక గన్ ట్రిగ్గర్‌ను లాగలేను' అంటూ మరో పోస్ట్ పెట్టాడు. ప్రజలంతా భయపడుతూ పరిగెత్తడం మరో వ్యక్తి తీసిన వీడియోలో కనిపించింది. ఫేస్‌బుక్ దాన్ని తొలగించింది. నిందితుడు మాల్‌లో ఉన్నాడు. మాల్ చుట్టుపక్కల ప్రాంతాలను పోలీసులు అదుపులోకి తీసుకొని రాకపోకలను నిషేధించారు. అయితే 16 మందిని అతడు నిర్బంధించాడని స్థానిక మీడియా తెలిపింది.

ఘటనాస్థలిలో ఫేస్‌బుక్ లైవ్‌లో నిందితుడు

వ్యాజ్యాలకు ముందే మధ్యవర్తిత్వం

- పెండింగ్ కేసులు తగ్గుతాయి
- సీజేఐ జస్టిస్ బాబ్డే

న్యూఢిల్లీ: వ్యాజ్యం దాఖలు కంటే ముందే మధ్యవర్తిత్వం జరిగేలా 'తప్పనిసరి మధ్యవర్తిత్వ చట్టం' తీసుకురావాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఏ బాబ్డే చెప్పారు. 'ప్రపంచీకరణలో మధ్యవర్తిత్వ పాత్ర' అన్న అంశంపై శనివారం ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ సదస్సు మూడవ ఎడిషన్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు. వ్యాజ్యం దాఖలుకు ముందే మధ్యవర్తిత్వం జరిగితే కోర్టు తీర్పుల నాణ్యత పెరుగుతుందని, పెండింగ్ కేసుల సంఖ్య తగ్గుతుందని చెప్పారు. మధ్యవర్తిత్వానికి సంబంధించిన 'ఆర్బిట్రరీ బార్' భారత్‌లో తయారు చేయడం క్లిష్టమైన ప్రక్రియ అని, దీనికి అనుభవంతో పాటు విషయ పరిజ్ఞానం కలిగిన లాయర్లు అవసరమవుతారని చెప్పారు. అంతర్జాతీయ వాణిజ్యం, కామర్స్, ఇన్వెస్ట్‌మెంట్ వంటి వాటిలో మధ్యవర్తిత్వం మౌలిక అంశమని పేర్కొన్నారు. సరిహద్దులు దాటి వాణిజ్యం జరుగుతున్న ఈ రోజుల్లో మధ్యవర్తిత్వం అత్యవసరమని తెలిపారు. మధ్యవర్తిత్వం కంటే రాజీ కుదర్చడం ఇంకా ఉత్తమమైనదని చెప్పారు. వాణిజ్య న్యాయస్థాన కోర్టుల చట్టం కూడా మధ్యవర్తిత్వం గురించి, సెటిల్‌మెంట్ గురించి చెప్పిందన్నారు.

రక్షించండి..

'డైమండ్ ప్రిన్సెస్' నౌక

- జపాన్ నౌకలో కరోనా వ్యాధి వ్యాపించడంతో అందులో చిక్కుకున్న భారతీయుల అభ్యర్థన
- నౌకలో 200 మంది భారతీయులు
- ఈనెల 19 వరకు నిర్బంధం తప్పదంటున్న జపాన్ ప్రభుత్వం

టోక్యో/బీజింగ్/జెనీవా: కరోనా భయంతో జపాన్ ప్రభుత్వం యెకోహామా తీరంలో నిలిపివేసిన నౌకలోని భారతీయులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. 'డైమండ్ ప్రిన్సెస్' అనే ఆ నౌకలో నిర్బంధంలో ఉన్న బినయ్ కుమార్ సర్కార్ అనే భారతీయుడు తమను కాపాడాలంటూ సోషల్ మీడియా ద్వారా వేడుకున్నారు. 200 మంది భారతీయులతో పాటు నౌకలో అంతా కలిపి 3,700 మంది ఉన్నారనీ, వీరిలో 62 మందికి కరోనా సోకినట్టు పరీక్షల్లో నిర్ధారణ కాగా తమ నౌకను అధికారులు దిగ్బంధించినట్లు బినయ్ పేర్కొన్నాడు. మరింత మందికి వైరస్ సోకే ప్రమాదం ఉండడంతో తమను కాపాడాలంటూ బినయ్ ప్రభుత్వాన్ని వేడుకుంటూ ఓ వీడియోను ఫేస్‌బుక్‌లో పెట్టారు. 'మేం కోరుకుంటోంది ఒక్కటే, దయచేసి మమ్మల్ని ఈ నౌక నుంచీ, ఈ నిర్బంధం నుంచీ వేరు చేసి, ప్రత్యేకంగా ఉంచండి. మా కుటుంబ సభ్యులు ఇబ్బంది పడుతున్నారు. మాకు భయంగా ఉంది. దయచేసి సాయం చేయండి'అని అందులో ఉంది. వైరస్ ఇంకా మరింత మందికి వ్యాపించకుండా ఉంటే, ఫిబ్రవరి 19 వరకు వీరందరినీ వేరుగా ఉంచాల్సి ఉంటుందని నౌకలోని జపాన్ అధికారులు శుక్రవారం చెప్పారు. 'జపాన్ కాలమానం ప్రకారం ఫిబ్రవరి 6వ తేదీ రాత్రి 7 గంటల వరకు భారతీయులెవ్వరికీ కరోనా సోకలేదు. ప్రస్తుతం నౌకలోని చివరి బృందానికి పరీక్షలు నిర్వహిస్తున్నాం'అని జపాన్ ప్రభుత్వం వెల్లడించింది. ఈ విషయంలో జపాన్ ప్రభుత్వంతో మాట్లాడుతున్నట్టు విదేశాంగ మంత్రి జైశంకర్ తెలిపారు.

723కు చేరిన కరోనా మృతులు

చైనాలో కరోనా వైరస్ బారిన పడి మరణించిన వారి సంఖ్య 723కు చేరింది. వైరస్ సోకినట్లు నిర్ధారణ అయిన కేసులు 34,598కు చేరాయి. తాజాగా, 1,280 మంది వ్యాధిగ్రస్తుల పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నట్లు చైనా నేషనల్ హెల్త్‌క మిషన్ ప్రకటించింది. చైనాలో కరోనా వైరస్ బారిన పడి అమెరికాకు చెందిన ఓ మహిళ, జపనీయుడొకరు మృతి చెందారు. కరోనాతో చైనాలో విదేశీయులు మరణించిన తొలి ఘటన ఇదే.

కరోనాకు శాశ్వత పేరుపై తర్జనభర్జన

ప్రపంచాన్ని వణికిస్తున్న కొత్త రకం వైరస్ కరోనాకు శాశ్వతంగా ఏం పేరు పెట్టాలనే దానిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) తర్జనభర్జన పడుతోంది. కరోనా వైరస్ ప్రారంభమైన వుహాన్ నగరం పేరు గానీ, అటు చైనా ప్రజల మనోభావాలు గానీ దెబ్బతినకుండా ఉండేలా పేరు పెట్టాలని జాగ్రత్త వహిస్తోంది. ప్రపంచ ఆరోగ్య అత్యవసర పరిస్థితిగా పేర్కొన్న ఈ వ్యాధికి ఐక్యరాజ్యసమితి ఆరోగ్య సంస్థ అధికారికంగా తాత్కాలిక పేరు '2019-ఎన్‌కోవ్ అక్యూట్ రెస్పిరేటరీ డిసీజ్'అని పెట్టింది. ఈ వ్యాధిని మొదట గుర్తించిన డిసెంబర్ 31, 2019ను ఈ పేరు సూచిస్తుంది. అలాగే 'ఎన్‌కోవ్'అంటే 'నావల్ కరోనావైరస్'అని అర్థం అని తెలిపింది. 'పేరుతో ప్రదేశానికి ఎలాంటి సంబంధం లేకుండా ఉండేలా ఓ పేరును పెట్టడం చాలా ముఖ్యమని మేం భావించాం'అని డబ్ల్యూహెచ్‌వో అత్యవసర వ్యాధుల విభాగం అధిపతి మరియా తెలిపారు. ఈ వ్యాధికి ఒక శాశ్వత పేరు పెట్టడంపై నిర్ణయం కొద్దిరోజుల్లోనే తీసుకుంటామని, డబ్ల్యూహెచ్‌వోతో పాటు ఇంటర్నేషనల్ కమిటీ ఆన్ టాక్సానమీ ఆఫ్ వైరస్ (ఐసీటీవీ) కరోనా నిపుణుల నిర్ణయం మేరకు ఉంటుందని ఆమె వెల్లడించారు. వ్యాధులకు 'ఎబోలా', 'జికా'లాగా ప్రాంతాల పేర్లు పెట్టరాదనే నియమం ఉంది.

ఎయిర్ హగ్!

తల్లి

కూతురు

కరోనా బాధితులకు సేవలు అందించేందుకు ఆస్పత్రిలో చేరిన నర్స్ లియు హైయాన్ తన కూతురు చెంగ్‌ను 10 రోజుల నుంచి కలవలేదు. శనివారం చెంగ్ ఆస్పత్రి వద్దకు వచ్చింది. అయితే కరోనా కారణంగా ఇద్దరు కలవడం కుదరకపోవడంతో దూరం నుంచే కౌగిలింత ఇచ్చినట్లుగా ఏడుస్తూ చేతులు చాచి భావోద్వేగానికి గురయ్యారు. 'మమ్మీ వైరస్‌తో పోరాడుతోంది.. తగ్గగానే ఇంటికి వస్తుంది' అని చెబుతూ.. చక్కగా, మంచిగా ఉండాలని కుమార్తెకు సూచించారు. కరోనా కారణంగా తల్లీకూతుళ్లు కన్నీళ్ల నడుమ జరిగిన ఈ ఎయిర్ హగ్ చైనాలోని హెనాన్ ప్రావిన్స్‌లో చోటుచేసుకుంది. ఈ వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది.

గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, తిథి పౌర్ణమి ప.1.39 వరకు, తదుపరి బ.పాడ్యమి, నక్షత్రం ఆశ్లేష రా.8.55 వరకు, తదుపరి మఘ వర్జ్యం ఉ.10.13 నుంచి 11.44 వరకు దుర్ముహూర్తం సా.4.23 నుంచి 5.10 వరకు, అమృతఘడియలు... రా.7.23 నుంచి 9.02 వరకు.

సూర్యోదయం : 6.34
సూర్యాస్తమయం : 5.55
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

మేఘన్ మార్కెల్ (ప్రిన్స్ హ్యారీ భార్య)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

సంతోషంగా ఉంది. ఈ సమ్మర్‌కి లాస్ ఏంజెలిస్‌కి షిఫ్ట్ అయిపోతున్నాం నేనూ, ప్రిన్స్ హ్యారీ, ఆర్చీ. మే ఆరుకు ఏడాది నిండుతుంది ఆర్చికి. పెద్ద రెడ్ కార్పెట్ పరిచి లాస్ ఏంజెలిస్ లోనే ఆస్కార్ వేడుకలంత ఘనంగా చేయాలి ఆర్చి ఫస్ట్ బర్త్‌డేని.

"చేద్దామా అలా.. హ్యారీ" అని అడిగాను. నవ్వాడు. "వేడుక అంటే ముందొచ్చి కూర్చుంటాయి మీడియా దెయ్యాలు. ఆర్చి జడుసుకుంటాడు. ఏకాంతంగా ఏ దీవి లోనికైనా వెళ్లిపోదాం. నువ్వు, నేను, ఆర్చి.." అన్నాడు.

అతడి కళ్లలోకి చూశాను. మీడియా తన తల్లి ప్రిన్సెస్ డయానాను మింగేసిన కోపం, ఆ కళ్లలో నేటికీ కనిపిస్తూనే ఉంది. నిద్రలో కూడా ఉలిక్కిపడి లేచేవాడు. 'ఏమైంది హ్యారీ?' అని దగ్గరకు తీసుకునే దాన్ని. 'మా అమ్మ.. మా అమ్మ.. దెయ్యాలు తరుముకుంటుంటే వాటి నుంచి తప్పించుకోడానికి పరుగులు తీస్తోంది. హ్యారీ నువ్వు జాగ్రత్త.. హ్యారీ నువ్వు జాగ్రత్త అని అరుస్తూ నేనెక్కడున్నానా అని నన్ను వెతుక్కుంటోంది. దెయ్యాలు తరుముకుంటుంటే తను కదా జాగ్రత్తగా ఉండాల్సింది. నన్ను జాగ్రత్తగా ఉండమంటోంది..' అని చెప్పేవాడు.

ఆమే బతికి ఉంటే నా భర్త హ్యారీ కూడా ఆమె తర్వాతే నాకు బెస్ట్ ఫ్రెండ్ అయ్యేవాడు. ఒక ఆడపిల్ల ఆశలు ఎలా ఉంటాయో ఆమెకు తెలుసు. ఒక ఆడపిల్ల కోరుకునే స్వేచ్ఛకు ఎలాంటి పంజరాలు తయారవుతూ ఉంటాయో ఆమెకు తెలుసు.

ప్రిన్సెస్ డయానా చనిపోయారన్న వార్త విన్నప్పుడు.. నేను టీనేజ్‌లో ఉన్నాను. అయ్యో అనిపించింది. నా వ్యక్తిత్వానికి ఆమె ఒక

అభౌతిక స్వరూపం.

ప్రిన్సెస్ డయానా ఎంత అందంగా, ఎంత సహజంగా, ఎంత చలాకీగా ఉండేవారు! ఫొటోల్లో చూస్తుండేదాన్ని. లోపల ఉన్న ఏ బాధనో బయటికి రానివ్వని ఆమె హృదయపు లావణ్యాన్ని చాలాసార్లు పట్టుకున్నాను ఆ ఫొటోల్లో.

"సరే హ్యారీ, లాస్ ఏంజెలిస్‌లోని మన కొత్త ఇంటినే ఏకాంత దీవిలా మార్చుకుందాం" అని చెప్పాను. హ్యారీకి కెనడా నచ్చింది కానీ, నేను పుట్టి పెరిగిన లాస్ ఏంజెలిస్ ఇంకా బాగా నచ్చుతుందని చెప్పి ఒప్పించాను.

మా పెళ్లయ్యాక రెండు సమ్మర్‌లు రాణి గారి భవంతిలో ఎలా గడిచాయో తలచుకుంటే ఆశ్చర్యంగా ఉంటుంది. నేనేనా అక్కడుంది! నేనేనా కాలిపై కాలు వేసుకుని కూర్చోకుండా, మోకాళ్లు రెండూ కలిపి ఒద్దికగా కూర్చోవాలన్న రాణి గారి ఆదేశాన్ని పాటించింది! నేనేనా నా తోడికోడలు కేట్ మిడిల్టన్ మాటలకు రాని నవ్వు నవ్వింది! నేనేనా నా భర్త హ్యారీతో రాజమాత ముభావంగా ఉంటే 'ఏంటలా ఉన్నారు? నా భర్త చేసిన తప్పేమిటి?' అని అడక్కుండా ఉండగలిగింది! నేనేనా నేను వేసే ప్రతి అడుగుకూ సమ్మతి తీసుకుని, నేను వేసిన ప్రతి అడుగుకూ సంజాయిషీ ఇచ్చుకుంది! బ్రిటన్‌లో ఏడాదికి ఒకే సమ్మర్ ఉంటుంది. రాణిగారింట్లో ఏడాదంతా సమ్మరే!!

"ప్రిన్స్ హ్యారీ, ఇకనుంచీ మీరు మీ అభిష్టానుసారం ఇక్కడ ఉండొచ్చు. ఈ రాజ్యానికి మీరే రాజు" అన్నాను.. లాస్ ఏంజెలిస్‌లో ఫ్లయిట్ దిగగానే.

పెద్దగా నవ్వాడు హ్యారీ. "లాస్ ఏంజెలిస్‌కి రాణి గారు కదా ఉంటారు. రాణీ మేఘన్ మార్కల్" అన్నాడు!

ఆర్చిని హ్యారీ చేతికి అందించి, హ్యారీ ఛాతీకి నా తలను ఆన్చాను. నా కోసం తన సింహాసన వారసత్వాన్ని వదలుకుని వచ్చాడు. తన తర్వాత వచ్చే ఆర్చి స్థానాన్ని కూడా వదిలేసి వచ్చాడు.

"యు ఆర్ మై క్రౌన్" అన్నాను.

గిలిగింతలు పెట్టినప్పుడు అచ్చు ఆర్చి నవ్వినట్లే నవ్వాడు హ్యారీ.

గ్రేటాంధ్ర చౌరస్తా

వర్ధెల్లి మురళి

జనతంత్రం

నాలుగు రోడ్ల కూడలి, ఊరికి నడిబొడ్డు. అక్కడొక గారడీ ప్రదర్శన.. చుట్టూ జనం.. గుంపులోంచి ఎంపిక చేసుకున్న ఓ వ్యక్తిని పిలిచాడు గారడీ హెడ్డు. పడుకోమన్నాడు. కళ్లకు గంతలు కట్టాడు. గుంపులో కోటు వేసుకొన్న ఒకాయన దగ్గరకు వెళ్లి నిలబడ్డాడు హెడ్డు. పడుకున్న వ్యక్తిని 'బేటా' అని పిలిచాడు. 'నా పక్కన ఎవరున్నారు?' ప్రశ్నించాడు. 'ఓ కోటు ఈశ్వరుడు' బదులిచ్చాడు సదరు బేటా. 'ఎలా చెప్పావ్?' హెడ్డు ప్రశ్న. 'తావీజు మహిమ'... బేటా స్పందన. మద్దెల ముందేసుకొని గుంపు మధ్యలో కూర్చున్న హెడ్డుగారి అసిస్టెంట్ 'చప్పట్లూ' అని గట్టిగా అరిచాడు. జనం చప్పట్లు. ఆ చప్పట్లతో సింకయ్యేలా అసిస్టెంట్ మద్దెలదరువు అందుకొన్నాడు. మళ్లీ పిలిచాడు హెడ్డు. 'బేటా' ఈ కోటు ఈశ్వరుని పేరు చెప్పగలవా? 'ఓ... కియామియా' బేటా చెప్పేశాడు. హెడ్డు కోటు ముఖం చూశాడు 'ఔనా' అన్నట్టు. ఔనన్నట్టు కోటు తలూపింది. 'తాలియా' కెవ్వున అరిచాడు అసిస్టెంటు. జనం చప్పట్లు. ఈసారి సౌండ్ పెరిగింది. సౌండ్‌కు తగినట్టు మద్దెల మోతెక్కింది. మళ్లీ పిలిచాడు హెడ్డు. 'బేటా... ఈ కోటు మనసులో ఏముంది?' 'ఈ ఊరొదిలి పారిపోదామనుకుంటున్నాడు' గట్టిగా అరిచినట్టు చెప్పాడు బేటా. 'ఎలా చెప్పావ్?'... 'తావీజు మహిమ...' కోటు ముఖం చూడలేదు హెడ్డు. ఆ ఛాన్సివ్వలేదు అసిస్టెంటు. ఒక్కసారిగా కరెంటు షాక్ కొట్టినట్టు రెండు పిల్లిమొగ్గలేశాడు. పిల్లిమొగ్గలతో పాటే 'తాలియా' అనే అరుపును కూడా మిక్స్ చేశాడు. చప్పట్ల హోరు పెరిగింది. మద్దెల జోరందుకుంది. కోటు ఏదో చెప్పబోతున్నది. ఎవరికీ వినపడలేదు. హెడ్డుకు చిల్లర బాగానే రాలింది. బేటాకు వాటా ముట్టింది. ఒక షో ముగిసింది.

గజకర్ణ గోకర్ణ టక్కుటమారాది కనికట్టు ప్రజ్ఞలూ, ఇంద్రజాల మహేంద్రజాల విద్యలు.. గడసానుల గారడీ విన్యాసాలు ఆ చౌరస్తాలో చాలా చూడొచ్చు. ఎన్నికల్లో ఓడిపోయిన వెంటనే ఆగమేఘాలమీద అక్కడొక ఎల్లో కళాక్షేత్రాన్ని తెలుగుదేశం పార్టీ ఏర్పాటు చేసింది. ఈ ఏర్పాటు ఎంత వేగంగా జరిగిందంటే, దానితో పోల్చదగిన ఏకైక ఘటన మొన్న చైనాలో కరోనా వైరస్ నియంత్రణ కోసం పది రోజుల్లో వెయ్యి పడకల ఆస్పత్రిని నిర్మించడం మాత్రమే. కాకపోతే వాళ్లు వైరస్‌ను నియంత్రిస్తారు. వీళ్లు పంపిణీ చేస్తారు. ఎల్లో కళాక్షేత్రం పంపిణీ చేసే వైరస్ నెమ్మదిగా ప్రజల మెదళ్ల మీద పనిచేసేలాగా ప్రోగ్రామింగ్ చేశారు. ఎల్లో కళాక్షేత్రంలో ప్రదర్శనలు ఇచ్చేవాళ్లను మీడియా మేనేజర్లుగా టీడీపీ వాళ్లు పిలుచుకుంటారు. పార్టీ నాలెడ్జి సెంటర్‌తో ఈ మేనేజర్లు అనుసంధానమై వుంటారు. ఈ నాలెడ్జి సెంటర్ ప్రధాన కేంద్రం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో ఉంది. బ్రాంచిని గుంటూరు పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ సెంటర్‌లో పూర్తి కాలం పనిచేసే ఉద్యోగులే వంద మంది దాకా ఉన్నారు. వీళ్లు కాకుండా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి మీడియా సంస్థల్లో పనిచేసే జర్నలిస్టుల పార్ట్‌టైమ్ సేవలను, వివిధ రకాల సేవలను కూడా ఈ సెంటర్ వాడుకుంటున్నది. మరో వెయ్యిమందితో కూడిన సోషల్ మీడియా సైన్యానికి ఈ సెంటర్ నుంచే కమాండ్స్ అందుతుంటాయి. మీడియా సంస్థల యాజమాన్యాలతో తెలుగుదేశం పార్టీ అధినాయకత్వానికి ఉన్న సన్నిహిత సంబంధాలు ఈ సెంటర్‌కు అదనపు బలం. సెంటర్‌లో అందుబాటులో వున్న విస్తారమైన డేటాను ఉపయోగించుకొని పార్టీ ప్రయోజనాలకు అనుగుణంగా మోకాలుకు-బోడిగుండుకూ ముడిపెట్టడం, తిమ్మిని బమ్మిని చేయడం, పందిని నందిగా చూపడం వంటి స్క్రిప్టులన్నీ ఈ సెంటర్‌లోనే తయారవుతాయి. స్క్రిప్టు రెడీ కాగానే మీడియా మేనేజర్లు రంగంలోకి దిగుతారు. నిజం గడప దాటకముందే అబద్ధం దేశాటన పూర్తి చేస్తుందన్న చందంగా తెలుగుదేశం పార్టీ స్క్రిప్టు వేగంగా జనంలోకి వెళ్లిపోతుంది. ఈ కార్యక్రమం నాడీ కేంద్రం టీడీపీ నాలెడ్జి సెంటర్. వెయ్యికి పైగా వెబ్‌సైట్లు, యూ ట్యూబ్ ఛానళ్లు కూడా ఈ సెంటర్‌తో అనుసంధానమై వున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కనీసం నెల రోజులు కూడా నిండకముందు నుంచే నాలెడ్జి సెంటర్‌ను తెలుగుదేశం పార్టీ పూర్తి స్థాయిలో రంగంలోకి దించింది. గ్రామాల్లో జరిగే వ్యక్తిగత ఘర్షణలకు రాజకీయ రంగు పులిమి వైఎస్సార్‌సీపీ బాధితుల పునరావాస శిబిరం పేరుతో కొన్నాళ్లపాటు మీడియాలో హడావుడి నడిచింది. కృష్ణానదికి భారీ వరదలు వచ్చి చంద్రబాబు నివసిస్తున్న అక్రమ నిర్మాణంలోకి నీళ్లు వచ్చినప్పుడు కూడా మీడియాలో వారం రోజులపాటు చంద్రబాబు సానుభూతి ప్రభంజనం వీచింది. బాబు ఇంటిని ముంచేయడానికే బరాజ్ గేట్లు ఎత్తలేదని ఆరోపిస్తూ మిత్రుడు పవన్‌కల్యాణ్‌ను కూడా రంగంలోకి దించారు. కుటుంబ సభ్యుల నిర్వాకం, తన వ్యవహారాలతో పరువు పోగొట్టుకొని కోడెల శివప్రసాదరావు ఆత్మహత్య చేసుకున్న ఘటననూ అధికార పార్టీతో ముడివేస్తూ చాలాకాలం పాటు ప్రచారం నడిచింది. పేదపిల్లలకు ఇంగ్లీషు మీడియం ప్రకటనపై తిరుగుబాటు తేవాలని మీడియా ద్వారా విఫలయత్నం చేయడం తాజా ఉదాహరణే. మూడు రాజధానుల వ్యవహారంలో ఏం జరుగుతున్నదీ ఇప్పటికీ చూస్తూనే వున్నాము. కియా మోటార్స్ వెళ్లిపోవడానికి సూట్‌కేసు సర్దుకున్నదనీ, వైజాగ్ మిలీనియం టవర్స్ నుంచి ఓ ఐటీ సంస్థ కొచ్చి ఫ్లైట్‌కు టిక్కెట్ బుక్ చేసుకున్నదనీ గత రెండు మూడు రోజులుగా జరుగుతున్న హడావుడిని కూడా గమనిస్తున్నాము. పెన్షన్లు తగ్గిస్తున్నారు. రేషన్ కార్డులు కత్తిరిస్తున్నారంటూ వచ్చిన విమర్శలకు ప్రభుత్వం తరపున మంత్రులు సమాధానం చెప్పిన తర్వాత కూడా ప్రచార దుమారం ఆగలేదు. కొత్త ప్రభుత్వం వచ్చిన తొలి ఏడాదిలోనే ప్రతి అంశాన్నీ ఒక క్లైమాక్స్‌గా మార్చి మీడియా దన్నుతో జీవన్మరణ సమస్యగా తెలుగుదేశం పార్టీ ఆరాటం చేస్తున్నది. ఎందుకిలా?

ఎందుకంటే, చంద్రబాబు పరిపాలనా మోడల్‌కు, ఆయన తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ పరిపాలన మోడల్ పూర్తిగా భిన్నమైనది. చంద్రబాబు అనుసరించింది ప్రపంచ బ్యాంకు ప్రవచించిన అభివృద్ధి మోడల్. అమెరికా వంటి అగ్రదేశాలు వాటి ప్రయోజనాల కోసం అభివృద్ధి చెందుతున్న దేశాలు అనుసరించాలని కోరుకుంటున్న మోడల్. ఈ దేశాలు అప్పుల ఊబిలో కూరుకొనిపోయి శాశ్వతంగా రుణదాతల కబంధ హస్తాల్లో చిక్కుకొనిపోవాలి. ఈ దేశాల సహజ సంపదలను రుణదాత దేశాల బహుళ జాతి కంపెనీలు కొల్లగొట్టి లాభాలవేట సాగించాలి. ఆ విధమైన షరతులతోనే అవి రుణాలిస్తాయి. ఆ షరతుల ప్రకారం వాళ్లిచ్చిన రుణాన్ని భారీ రహదారులు, భారీ భవనాలు, ఎయిర్‌పోర్ట్స్, పవర్ ప్లాంట్స్ వగైరా బహుళజాతి కంపెనీల పెట్టుబడి విస్తృతికి అవసరమైన మౌలిక రంగాల్లోనే ఖర్చు చేయాలి. ఆ దేశ మానవ వనరుల అభివృద్ధి కోసం ఖర్చు చేయకూడదు. శ్రమజీవుల పిల్లలను బడికి పంపించడానికీ, వాళ్లను డాక్టర్లునూ, ఇంజనీర్లనూ చేయడానికి ఖర్చు చేయకూడదు. వ్యవసాయ రంగం అభివృద్ధికీ, రైతు సంక్షేమానికి ఖర్చు చేయరాదు. వ్యవసాయం దండగగా మారి రైతుల పొలాలు కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి కారుచౌకగా బదలాయింపు కావాలి. భూముల నుంచి బేదఖలయిన రైతులు చీప్ లేబర్ ఫోర్స్‌గా పెట్టుబడిదారులకు అందుబాటులో వుండాలి. తొలితరం ఆర్థిక సంస్కరణల రోజులనాటి ఈ ప్రపంచ బ్యాంకు ఆర్థిక ఎజెండాకు భారతదేశంలో దత్తపుత్రుడి వంటివాడు చంద్రబాబు. అందుకే ఆ రోజుల్లో చంద్రబాబును కమ్యూనిస్టు పార్టీలు ప్రపంచ బ్యాంకు జీతగాడుగా పిలిచేవి. ఈ అమానవీయ షరతులతో కూడిన రుణాల కారణంగా ఎన్నో దేశాలు సర్వనాశనమయ్యాయి. ఈ విధానాలను వ్యతిరేకించిన పనామా, ఈక్వెడార్ దేశాల అధ్యక్షులు హెలీకాప్టర్ల ప్రమాదాల్లో చనిపోయారు. దక్షిణ అమెరికా, సెంట్రల్ అమెరికా దేశాలు ఏకమై అమెరికాపై, ప్రపంచ బ్యాంకుపై ఒత్తిడి తెచ్చిన తర్వాత షరతుల్లో కొన్ని స్వల్పమైన మార్పులు చోటు చేసుకున్నాయి. రుణవ్యాఘ్రం గోముఖాన్ని తగిలించుకున్నది.

ప్రస్తుతం ఈ గోముఖవ్యాఘ్రం మోడల్‌కే చంద్రబాబు ప్రతినిధిగా ఉన్నాడు. అందుకే మరోసారి లభించిన ఐదేళ్ల అవకాశాన్ని ప్రపంచంలో అతి పెద్దదైన రియల్ ఎస్టేట్ వెంచర్ వేసే పనికే వినియోగించాడు తప్ప నిజమైన సమ్మిళిత అభివృద్ధివైపు దృష్టి పెట్టలేకపోయాడు. ఈ మోడల్ వల్ల లబ్ధిపొందే కార్పొరేట్ శక్తుల అధీనంలోనే జాతీయ మీడియా రంగం ఉన్నందువలన ఆనాటి నుంచి నేటి వరకూ మీడియా తోడ్పాటు చంద్రబాబుకు లభిస్తున్నది. ఈ చుట్టరికాన్ని దాచిపెట్టి 'ఇక్కడి పత్రికలు రాస్తే ఎల్లో మీడియా అంటారు. ఇప్పుడు జాతీయ పత్రికలు కూడా జగన్‌కు వ్యతిరేకంగా రాశాయి. ఇప్పుడేమంటారు?' అంటూ అమాయకత్వాన్ని నటించడం ఆయన గడుసుతనానికి నిదర్శనం. కమ్యూనిస్టులు నామకరణం చేసినట్టుగా ఆయన ప్రజాప్రయోజనాలను విస్మరించి ప్రపంచబ్యాంకు జీతగాడుగానే వ్యవహరించాడు. ఆ హోదాలో ఆయన సేవలకు గుర్తింపుగానే నాడే క్లింటన్ విజిట్, గేట్స్ విజిట్ వగైరాలను టిప్పులుగా అమెరికా అండ్ కో మంజూరు చేసింది. కానీ, ఆయన వాటిని తన ప్రపంచ స్థాయి పలుకుబడిగా ఈనాటికీ ప్రచారం చేసుకుంటాడు. ప్రపంచబ్యాంకు సృష్టించిన 'టిప్పు' సుల్తాన్ ప్రారంభించిన భారీ రియల్ ఎస్టేట్ వెంచర్ వైఎస్ జగన్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాల కారణంగా ప్రమాదంలో పడింది. చంద్రబాబు వర్గ ఆర్థిక ప్రయోజనాలతో పాటు కొన్ని కార్పొరేట్ శక్తుల ఆర్థిక ప్రయోజనాలు కూడా ఈ వెంచర్‌తో ముడిపడి ఉన్న కారణంగానే వీరిలో అసహనం పెరుగుతున్నది. వీలైనంత త్వరగా ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత తీసుకురావాలన్న లక్ష్యంతో ప్రతి అంశాన్ని వివాదాస్పదం చేసి దుష్ప్రచారం చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్పొరేట్ శక్తులు వాటి అధీనంలోని మీడియాతో పాటు తన వర్గం ఎల్లోమీడియా సంపూర్ణ తోడ్పాటు చంద్రబాబుకు లభిస్తున్నది. ఆ కారణంగానే గ్రేటాంధ్ర రాజకీయ చౌరస్తా సందడిగా మారింది. ఈ సందడిలో నిలబడి తెలుగుదేశం గారడీ షోను వీక్షిస్తూ, ఏం జరుగుతున్నదో అర్థం చేసుకోలేక తటపటాయించే తటస్తులారా!.. ఈ రాష్ట్రంలో విశాల ప్రజానీకం ప్రయోజనాలకూ, పిడికెడుమంది పెత్తందార్ల ప్రయోజనాలకూ మధ్య యుద్ధం జరుగుతున్నది. ప్రభుత్వం ప్రజలవైపు దృఢంగా నిలబడి వున్నది. ప్రతిపక్షం పెత్తందార్ల జెండాను భుజాన వేసుకున్నది. మీరెటువైపు? ప్రజల వైపా, పెత్తందార్ల వైపా?

muralivardelli@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

నిరుద్యోగం

"సీఎంఐఈ నివేదిక ప్రకారం నిరుద్యోగికత 37 శాతంకి చేరుకుందంటే, తీవ్రమైన స్థాయిని కూడా దాటిపోయినట్టే. దీని నుంచి మనం ఎప్పుడు బయటపడతాం? అభివృద్ధి గురించి గొప్పలు చెప్పకుంటే యువతకు ఉద్యోగావకాశాలు కల్పించినట్టు కాదు"

– ప్రీతిష్ నంది, జర్నలిస్ట్

ఓటు

"మీ ఓటు ఏ పార్టీకి వేయడం సమంజసం అనుకుంటే ఆ పార్టీకే ఓటు వేయండి. కానీ, అన్ని పార్టీల పట్ల విమర్శనాత్మకంగానే ఉండండి. ముఖ్యంగా అధికార పార్టీ ఎప్పుడూ బాధ్యతతో వ్యవహరించేలా చూడండి. ఏ పార్టీనీ గుడ్డిగా సమర్థించకండి. మీరు ఓటు వేసినందుకు రాజకీయ పార్టీలు కష్టపడి పని చేసేలా చూడండి"

– ప్రతీక్ సిన్హా, రచయిత

ఉద్యోగం

"సీఏఏకు వ్యతిరేకంగా జరిగే నిరసనల గురించి ఫోన్‌లో మాట్లాడుతున్న ప్రయాణికుణ్ణి పోలీస్‌లకు పట్టివ్వడానికి ప్రయత్నించిన ముంబై ఉబర్ డ్రైవర్ రోహిత్ సింగ్ గౌర్‌కు కొత్త ఉద్యోగం కావాలి. అతను బాలీవుడ్‌లో అవకాశం కోసం ఎదురుచూస్తున్నాడు. బిగ్‌బాస్ లాంటి కార్యక్రమానికి పనికొస్తాడు. ఎవరో ఒకరు సహాయం చేసి అతను రోడ్డున పడకుండా చూడండి"

– శోభా డే, రచయిత్రి

నమ్మకం

"ఇందుకే బీజేపీని నమ్మకూడదు అనేది. జాతీయ పౌరపట్టిక సందర్భంలో ఎటువంటి డాక్యుమెంట్లూ చూపించాల్సిన అవసరం లేదని బీజేపీ నాయకులు అన్ని చానళ్లలో ఊదరగొట్టారు. కానీ, ఇప్పుడు బీజేపీ అధికార ట్విట్టర్ ఖాతా ఏమో డాక్యుమెంట్లు చూపించకతప్పదంటోంది. దీన్నిబట్టి ప్రధాని నరేంద్ర మోదీ అబద్ధం చెప్పినట్టేగా. ఎంత సిగ్గుచేటు"

– తెహ్సీన్ పూనావాలా, న్యాయవాది

నమ్మకం

"మీరు ఎక్కడ పోగొట్టుకున్నదాన్నయినా తిరిగి పొందవచ్చు. కానీ, ఒకసారి నమ్మకాన్ని కోల్పోతే తిరిగి పొందలేం"

– అమితాబ్ బచ్చన్, నటుడు

కొడుకు

"నా ప్రపంచం అంతా నా కొడుకే. వాడికి కలిగే నొప్పే ఈ ప్రపంచంలో నన్ను ఎక్కువ బాధించే నొప్పి. పిల్లలకు ఏమైనా జరిగితే తట్టుకోలేను. ప్రపంచంలోని ఏ పిల్లాడికి నొప్పి కలిగినా ఒక తల్లిగా నేను చలించిపోతాను. అత్యాచారం, హత్యకు గురైన పిల్లల గురించి నేను రోజుల తరబడి ఏడుస్తూ ఉంటా. అందుకే పాకిస్తాన్ తెస్తానంటున్న బహిరంగ ఉరిశిక్షలను నేను సమర్థించలేను"

– మెహర్ తరార్, కాలమిస్ట్

ఫేక్

"లోక్‌సభలో ప్రధాని నరేంద్ర మోదీ ఉటంకించిన ఫేక్ న్యూస్ వెబ్‌సైట్ ప్రస్తావనను రికార్డుల నుంచి తొలగించలేదు. జై శ్రీరామ్ అనండి, మీ పాపాలన్నీ పోతాయని విపక్ష ఎంపీలను ఉద్దేశించి పర్వేష్ వర్మ చేసిన వ్యాఖ్యలను పట్టించుకోలేదు"

– మహువా మొయిత్రా, ఎంపీ

వర్సిటీలకు హెచ్చరిక

అన్ని దేశాల్లోనూ విశ్వవిద్యాలయాలు ప్రభుత్వాలకు సమస్యాత్మకంగానే కనబడుతున్నాయి. తాజాగా బ్రిటన్ ప్రభుత్వం అక్కడి విశ్వవిద్యాల యాల పాలనాధికారులకు వార్నింగ్ ఇచ్చింది. భావ ప్రకటనా స్వేచ్ఛ హద్దు మీరకుండా చూస్తారా లేక ఆ పని మమ్మల్నే చేయమంటారా అన్నది ఆ హెచ్చరిక సారాంశం. విద్యావేత్తలను వేధించడం, అకడమిక్ కార్యక్రమాలకు అడ్డుతగలడం ఉద్యమకారులకు రివాజుగా మారిందని, దీన్ని సహించేది లేదని బ్రిటన్ విద్యామంత్రి గావిన్ విలియమ్‌సన్ టైమ్స్‌కి రాసిన ఒక వ్యాసంలో వ్యాఖ్యానించారు. విద్యార్థి సంఘాల విధులేమిటో వర్సిటీలు చెప్పాలని, భావప్రకటనా స్వేచ్ఛ పేరిట ఇష్టానుసారం వారి అలజడులను ప్రోత్సహించరాదని ఆయన హితవు చెప్పారు. సమస్యలు సృష్టిస్తున్నవారిని అదుపు చేయడంలో పోలీసులకు సహకరించాలని గావిన్ సూచించారు. వర్సిటీలు తమ కర్తవ్య నిర్వహణలో విఫలమైతే ప్రభుత్వమే అవసరమైన చట్టాన్ని తీసుకొచ్చి మెరుగైన వాతావరణాన్ని ఏర్పరుస్తుందని కూడా ఆయన న్నారు. అహింసాయుతంగా ఆందోళనలు జరిగితే తమకు అభ్యంతరం లేదని, వేధింపులకూ, హింసకూ, బెదిరింపులకూ దిగితే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. తన వాదనకు మద్దతుగా ఈ మధ్యే వెలువడిన సర్వేను ఆయన ప్రస్తావించారు. కానీ మంత్రిగారి ఆందోళనను ప్రముఖ విశ్వవిద్యాలయాలు కొట్టిపారేస్తున్నాయి. తమకు సమస్యలేమీ లేవని, ప్రభుత్వానికొస్తున్న సమస్యేమిటో అర్థం కావడం లేదని చెబుతున్నాయి.

అంతర్జాతీయ విద్యకు అతిపెద్ద దెబ్బ.. కరోనా!

అంతర్జాతీయ విద్యకు సంబంధించి మానవచరిత్రలో అతిపెద్ద అంతరాయానికి కరోనా వైరస్ వ్యాప్తి కారణం కావచ్చు. విద్యకోసం వివిధ దేశాలకు వెళుతున్న విద్యార్థుల అంతర్జాతీయ పర్యటనలకు కరోనా వైరస్ భారీస్థాయిలో అడ్డుకట్ట వేయవచ్చని అంచనా. ఈ ఏడాది ఆస్ట్రేలియాలో చదువుకోవాలని తలపెట్టిన దాదాపు లక్షమంది చైనా విద్యార్థులు.. విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే సమయానికి ఆస్ట్రేలియా చేరుకునే అవకాశాలు రోజులు గడుస్తున్న కొద్దీ సన్నగిల్లిపోతుండటం అనుభవంలోకి వస్తోంది. తమ మాతృదేశాన్ని వదలి విదేశాల్లో చదువుతున్న 50 లక్షల 30 వేలమంది చైనా విద్యార్థుల వ్యవహారాలను చైనా విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పట్టించుకుంటోందనుకోండి.

2001 సెప్టెంబర్ 11 దాడుల తర్వాత అమెరికా ప్రత్యేకించి మధ్యప్రాచ్య దేశాలకు చెందిన విద్యార్థుల వీసా నిబంధనలను కఠినతరం చేయడమే కాకుండా తాత్కాలికంగా తన సరిహద్దులను మూసివేసింది. దీంతో వేలాదిమంది విద్యార్థులు వివిధ విదేశీ విద్యా కేంద్రాలను ఎంచుకోవల్సి వచ్చింది. 2018లో సౌదీ అరేబియా ప్రభుత్వం.. కెనడాలో చదువుతున్న తన పౌరులను వెనక్కు తిరిగి రావలసిందిగా ఆదేశించింది. కారణం సౌదీ జైళ్లలోని మహిళా హక్కుల కార్యకర్తలను విడుదల చేయాలని కెనడా విదేశాంగ మంత్రి పిలుపునివ్వడమే. తర్వాత సౌదీ ప్రభుత్వం తన వైఖరిని కాస్త సడలించుకున్నా, కెనడాలో చదువుకుంటున్న 12 వేలమంది సౌదీ విద్యార్థుల్లో చాలామంది తమ చదువుల కోసం కెనడా వదిలిపెట్టి ఇతర దేశాల విద్యాసంస్థలకు తరలిపోయారు. కాబట్టి ఇంతకు ముందు ఎన్నో ఉపద్రవాలను మనం చూసి ఉన్నాం. కానీ చైనాలో తలెత్తుతున్న ఇలాంటి స్థాయి ఉపద్రవాన్ని చరిత్రలో ఎన్నడూ చూడలేదు.

చైనా నుంచి ఆస్ట్రేలియాకు ప్రస్తుతం తాత్కాలికంగా వలస వెళుతున్న విద్యార్థుల భారీ సంఖ్య ప్రపంచం ఇంతవరకు చూసి ఉండలేదు. 2019 చివరినాటికి 2,12,000 మందికిపైగా చైనా విద్యార్థులు ఆస్ట్రేలియాలో చదువుకుంటున్నారని ఫెడరల్ విద్యాశాఖ డేటా సూచిస్తోంది. అంటే ఆస్ట్రేలియాలో చదువుతున్న మొత్తం అంతర్జాతీయ విద్యార్థుల్లో చైనా విద్యార్థుల సంఖ్య 28 శాతంగా ఉంటున్నట్లు లెక్క. ప్రపంచంలో అత్యధిక సంఖ్యలో చైనా నుంచి విద్యార్థులు అమెరికాకు వెళ్లి చదువుతుండగా, రెండో స్థానంలో భారతీయ విద్యార్థులు అమెరికాలో చదువుకుంటున్నారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో కంటే వేసవి సెలవుల తర్వాత అమెరికాకు వెళ్లే విద్యార్థులపై ఈ కరోనా వైరస్ వ్యాప్తి ఏ ప్రభావాన్ని కలిగించనుందో ఊహించడం కూడా కష్టమే. వేసవి సెలవుల కోసం చైనా విద్యార్థులు అనేకమంది ఇప్పటికే అమెరికా తదితర దేశాల నుంచి

మాతృదేశానికి చేరుకున్నారు. మిగిలినవారు ఫిబ్రవరి చివరిలో విదేశాలకు వెళ్లనున్నారు.

పోల్చి చూస్తే 2003లో చైనాలో చెలరేగిన సార్స్ అంటువ్యాధి.. ఆస్ట్రేలియాలో చదువుకోసం వెళ్లిన చైనా విద్యార్థులపై పెద్దగా ప్రభావం వేయలేద

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
ఆదివారం ॥ 9-2-2020

ఆదెర్ల శ్రీనివాస్

వీళ్లెక్కడికి వెళ్లొచ్చినా..
గుడికి వెళ్లొచ్చినట్లే ఉంటుంది!
వీళ్ల పెళ్లిరోజు సెలబ్రేషన్ కూడా
గుడికి వెళ్లి రావడమే!
పెళ్లయి ఇరవై మూడేళ్లయింది.
ఎప్పుడు చూసినా..
అప్పుడే గుడి నుంచి వచ్చినట్లుగా
ఫ్రెష్‌గా.. ప్రశాంతంగా ఉంటారు.
ఇంటర్వ్యూకి వెళ్లాక..
"ఎలా సాగుతోంది మీ మ్యారిడ్ లైఫ్"
అని అడగాలనిపించలేదు.
'జస్ట్ మ్యారీడ్'లా కళ్లెదుట కనిపిస్తుంటే..
ఇక ప్రశ్నలేముంటాయ్?
అయినా అడిగాం.
ఇష్టాల్నీ, కష్టాల్నీ చెప్పమన్నాం.
'వియ్ ఆర్ లక్కీ' అన్నారు శ్రీకాంత్, ఊహ.
ఏ విషయంలో వాళ్లు లక్కీ?! చదవండి.

● ఊహ, శ్రీకాంత్

వియ్ ఆర్ లక్కీ

● గత నెల పెళ్లి రోజు (జనవరి 20)ని ఎలా జరుపుకున్నారు?

ఊహ: మా పెళ్లి రోజు సెలబ్రేషన్ అంటే గుడికి వెళ్లి, దేవుడికి దండం పెట్టుకోవడమే. ఈసారి తిరుపతి వెళ్లాం. ఆ తర్వాత షిరీడి వెళ్లాం.

శ్రీకాంత్: అవును.. ప్రతీ యానివర్సరీకి ఏదో ఒక గుడికి వెళ్తాం. ఒకసారి కాశీ వెళ్లాం. మేం ఇద్దరం ప్రత్యేకంగా సెలబ్రేట్ చేసుకోం. అయితే ముగ్గురు పిల్లల బర్త్‌డేలను మాత్రం వాళ్ల ఫ్రెండ్స్‌ని పిలిచి, గ్రాండ్‌గా చేస్తాం.

● ప్రేమించి పెళ్లి చేసుకున్నారు కదా. మొదట్లో ఉన్నంత ప్రేమ 23 ఏళ్ల వైవాహిక జీవితం తర్వాత కూడా ఉందా?

ఊహ: చెప్పాలంటే ప్రేమ ఇంకా పెరిగింది. ఒకరి మీద ఒకరికి నమ్మకం, ఒకర్నొకరు అర్థం చేసుకోవడం.. ఏ కపుల్ మధ్య అయినా ఈ రెండూ ఉంటే అంతా హ్యాపీగా వెళ్లిపోతుంది.

శ్రీకాంత్: అలాగే చిన్న చిన్న అలకలు కూడా.

ఊహ: అవి ఉంటేనే బావుంటుంది. మా మధ్య అవి కూడా ఉంటాయి. బాధ్యతల వల్ల మనుషులు ఇంకా దగ్గరవుతారు. అయితే బిగినింగ్ డేస్‌లో ఎలా ఉంటామో పిల్లలు పుట్టిన తర్వాత ఖచ్చితంగా అలా ఉండలేం. రోజంతా ఎవరి బిజీలో వాళ్లు ఉండిపోతాం. మేం సరదాగా ఎక్కడుంటాం అంటే ఏదైనా పిక్నిక్‌కు వెళ్లినప్పుడో, ఫంక్షన్‌కు వెళ్లినప్పుడో.. అప్పుడు ఫుల్‌గా ఎంజాయ్ చేస్తాం. అలకలు, బాధ్యతల వల్ల ప్రేమ పెరిగినట్లు ఎవరికైనా ఒంట్లో బాగాలేనప్పుడు తెలుస్తుంది.. ఎవరి ఎఫెక్షన్ ఎంత ఉంటుందో.

● అలా ఆరోగ్యం బాగాలేని సందర్భాలేమైనా?

ఊహ: అప్పట్లో ఆయన కాలికి పెద్ద ఆపరేషన్ జరిగింది. షూటింగ్స్‌లో జరిగిన ప్రమాదాల్లో చాలాసార్లు దెబ్బలు తగిలాయి. ఆపరేషన్ చేయాలని డాక్టర్ అంటే పోస్ట్‌పోన్ చేసుకుంటూ వచ్చారు. జనవరి 20న మా పెళ్లయింది. హనీమూన్ వెళదామని ప్లాన్ చేసుకున్నాం. వెళ్లేముందు జస్ట్ డాక్టర్ చెకప్‌కి వెళ్లాం. టెస్ట్ చేసి వెంటనే ఆపరేషన్ చేయాలన్నారు. ట్రిప్ ఎప్పుడైనా వెళ్లొచ్చు అనుకుని హనీమూన్ క్యాన్సిల్ చేసుకున్నాం.

శ్రీకాంత్: అప్పుడు బాగా చూసుకుంది.

ఊహ: ఆయన కూడా అంతే. నాకు ఆరోగ్యం బాగా లేదంటే కేరింగ్‌గా ఉంటారు.

● జనరల్‌గా మీ ఇద్దరికీ ఎలాంటి విషయాల్లో గొడవలు వస్తుంటాయి?

ఊహ: పిల్లల విషయంలోనే వస్తుంది. నేనేమో స్ట్రిక్ట్‌గా ఉండాలంటాను. ఆయనేమో పోనీలే అంటారు.

శ్రీకాంత్: సీరియస్ గొడవలు ఏం ఉండవు.

● మీ ప్రేమ ఎలా మొదలైంది?

ఊహ: ఇప్పటికి ఆలోచించినా అర్థం కాదు.

ఇష్టం అంతే.

శ్రీకాంత్: మేం ఇద్దరం కలిసి నాలుగు సినిమాలు చేశాం. ఫస్ట్ నుంచి కూడా ఒకరంటే ఒకరికి సాఫ్ట్ కార్నర్ ఉండేది. అలా ప్రేమ మొదలైంది.

● ఒకరిలో ఒకరికి నచ్చిన క్వాలిటీస్ ఏంటి?

ఊహ: నేను అసలు చెప్పాల్సిన అవసరం లేదు. అందరికీ తెలిసిందే. ఆయన చాలా మంచి వ్యక్తి. అందరితో సరదాగా ఉంటారు. ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా అర్థం చేసుకుని యాక్సెప్ట్ చేస్తారు. ఇంకేం కావాలి?

శ్రీకాంత్: తనది సర్దుకుపోయే మనస్తత్వం. కోపం వచ్చినా మెచ్యూర్డ్‌గా ప్రవర్తిస్తుంది. అందరూ కావాలనుకుంటుంది. అందరితో ప్రేమగా ఉంటుంది.

● మీది సర్దుకుపోయే స్వభావం అన్నారు శ్రీకాంత్ గారు. మరి.. అత్తగారింట్లో సర్దుకుపోయి ఉండాల్సి వచ్చిందా?

ఊహ: మా పెళ్లయినప్పటి నుంచి ఇప్పటి వరకూ నాకు సర్దుకుపోవాల్సిన అవసరం రాలేదు. వాళ్ల ఇంట్లో అమ్మాయిలానే చూసుకుంటారు. అత్తయ్య మామయ్య అని పిలవను. అమ్మానాన్న అనే పిలుస్తాను.

శ్రీకాంత్: సర్దుకుపోవాల్సి వచ్చి ఉంటే 23 ఏళ్ల ప్రయాణం కొనసాగేది కాదేమో.

ఊహ: మాది జాయింట్ ఫ్యామిలీ.

శ్రీకాంత్: నాకు జాయింట్ ఫ్యామిలీ ఇష్టం. మా అమ్మా నాన్న మాతోనే ఉంటారు.

● మీరు మీ అత్త, మామలను బాగా చూసుకుంటున్నారు. మరి మీ అమ్మా, నాన్నలను శ్రీకాంత్‌గారు ఎలా చూసుకుంటారు?

ఊహ: నాకంటే బాగా చూసుకుంటారు. మా అమ్మా, నాన్నలను అత్తయ్య, మామయ్య అనరు. నేను తన అమ్మానాన్నని పిలిచినట్లే ఆయన కూడా అత్తమామలను అమ్మానాన్నా అనే పిలుస్తారు.

● మీది ప్యూర్ వెజ్ ఫ్యామిలీ. వీళ్లు నాన్‌వెజ్. ఇబ్బందిగా ఉంటుందా?

ఊహ: ఫస్ట్ కొన్ని నెలలు ఇబ్బందిగా ఉండేది. నా పక్కన ఎవరైనా కూర్చుని నాన్‌వెజ్ తిన్నా నాకు కడుపులో తిప్పేది. గుడ్డు మాత్రం తినేదాన్ని. అది కూడా వారానికి రెండు రోజులే. మిగతా రోజులన్నీ ఆ వ్రతం ఈ వ్రతం ఉండేవి. ఒకసారి అత్తయ్యవాళ్లు అమెరికా వెళ్లారు. వాళ్లు ఉన్నన్ని రోజులు నాన్ వెజ్ వండేవారు. నాకు మా సైడ్ వంటకాలు అన్నీ వచ్చు కానీ ఆంధ్రా స్టయిల్ వంటలు రావు. ఈయన ఇబ్బంది పడేవారు. బయట నుంచి తెప్పించుకునేవారు. లైఫ్ లాంగ్ ఇలా అయితే ఇబ్బంది అవుతుంది కదా అని నాన్ వెజ్ వండాలని డిసైడ్ అయ్యాను. మా వంట మనిషిని పక్కన పెట్టుకుని రెసిపీ బుక్ చూస్తూ, ముక్కుకి కర్చీఫ్ కట్టుకొని దూరంగా నిలబడి కుక్ చేశాను. అలా మెల్లిమెల్లిగా వండటం స్టార్ట్ చేశాను. అయితే వండుతున్న ప్రతిసారీ 'అయ్యో పాపం' అని వండుతాను. కానీ ఇప్పటికీ నాన్‌వెజ్ తినను.

● మీరు మలయాళీ. మరి కేరళ వంటకాలు కూడా అలవాటు చేశారా?

ఊహ: మాది కేరళ అయినా పుట్టింది, పెరిగిందీ చెన్నైలోనే. మా ఫుడ్ ఎక్కువ సాంబార్ బేస్డ్ ఉంటుంది. ఇంట్లో అవి కూడా చేస్తాం.

శ్రీకాంత్: అన్ని రకాల వంటలు చేస్తుంది. నాన్ వెజ్, వెజ్.. ఏదైనా బాగా వండుతుంది.

● కుక్ ఉంటారు కదా. అయినా మీరే చేస్తారా?

ఊహ: కుక్ ఉంటారు. కానీ పిల్లలకు కావాల్సినవి ఎక్కువగా నేనే చేస్తాను. రోషన్, మేధ (పాప పేరు), రోహన్ ముగ్గురి టేస్ట్ వేరు. రోషన్, మేధది సెపరేట్ డైట్.

● మీ ప్రేమను ఇంట్లో ఒప్పించడానికి కష్టపడ్డారా?

శ్రీకాంత్: చాలా ఈజీగా అయిపోయింది.

ఊహ: మాది లవ్ మ్యారేజా? అరేంజ్డ్ మ్యారేజా అని చాలామంది సందేహపడ్డారు. అంత స్మూత్‌గా జరిగింది.

శ్రీకాంత్: ఎంగేజ్‌మెంట్ జరిగేవరకూ ఎవరికీ తెలియదు.

● మీరు ప్రేమలో ఉన్నారని ఇండస్ట్రీలో ఎవరూ కనిపెట్టలేదా?

ఊహ: కొంచెం క్లోజ్‌గా ఉండే ఫ్రెండ్స్ వరకూ తెలుసు.

శ్రీకాంత్: మా ఇంట్లోవాళ్లకి, వాళ్ల ఇంట్లో వాళ్లకి తెలుసు. కానీ మేమిద్దరం బయటకు వెళ్లడం లాంటివి ఏం చేయలేదు. ఫోన్లో మాట్లాడుకునేవాళ్లం. ఫంక్షన్స్ అప్పుడు మా ఇంటికి పిలిచేవాణ్ణి. అక్కడ అందర్నీ పరిచయం చేసేవాణ్ణి.

ఇద్దరూ ఏది పెడితే అది తినరు. మా చిన్నోడు రోహన్, ఈయన ఒకేలా తింటారు. కొంచెం పులిహోర టైపు వంటలవీ రోహన్ బాగా తింటాడు.

● ఓకే... మీరు చేసిన చిత్రాల్లో 'పెళ్లాం ఊరెళితే' ఒకటి. అందులో భార్య ఊరెళితే గర్ల్‌ఫ్రెండ్‌తో స్పెండ్ చేస్తారు.. మరి?

ఊహ: (మధ్యలో అందుకుంటూ) నేను ఊరెళ్లినా ఒకటే. లేకపోయినా ఒకటే.

శ్రీకాంత్: ఎక్కువగా ఫ్రెండ్స్‌తో ఉంటాను. అందరూ మగ స్నేహితులే (నవ్వుతూ).

ఊహ: నేను లేకుండా ఉండలేరు.

శ్రీకాంత్: తను ఇంట్లో ఉంటేనే ఫ్రీగా ఉంటుంది. తను లేనప్పుడు ఫ్రెండ్స్‌తో కూర్చుంటే ఏదో తప్పు చేసిన ఫీలింగ్. తనుంది కాబట్టి ఏదైనా చేయొచ్చు అనే ఫీలింగ్ (నవ్వుతూ).

ఊహ: ఖాళీ సమయాల్లో ఆయన బయటకు వెళ్లరు. వాళ్ల ఫ్రెండ్స్ ఇంటికే వస్తుంటారు.

● మీరు ఒక హీరోయిన్‌గా చేసిన 'ఆయనకి ఇద్దరు' సినిమాలో మీ భర్త పాత్రను మరో అమ్మాయి (రమ్యకృష్ణ) వెంటాడుతుంది. ఆ సిట్యువేషన్‌ని ఎలా టాకిల్ చేయాలో తెలియక తడబడుతుంటారు. రియల్ లైఫ్‌లో అయితే?

ఊహ: (పెద్దగా నవ్వుతూ) ఛాన్సే లేదండి. ఆయన మీద నాకున్న నమ్మకం అది. ఇక్కడ ఆయనకి అంత లేదు. ఈ క్వొశ్చన్ నన్ను అడగాల్సిన అవసరమే లేదు. శ్రీకాంత్‌గారి గురించి సినిమా పరిశ్రమలో అందరికీ తెలుసు.

శ్రీకాంత్: నాతో నటించిన హీరోయిన్స్ అందరూ ఉమ (ఊహ అసలు పేరు)కు ఫ్రెండ్సే. వాళ్ల ఇళ్లకు మేం వెళ్తాం, మా ఇంటికి వస్తుంటారు. రోజా నన్ను 'అన్నయ్యా' అంటుంది. 'నువ్వు నన్ను అన్నయ్యా అంటే నీతో డ్యూయెట్ ఎలా చేస్తాను' అనేవాణ్ని. సంగీత కూడా అంతే. దాదాపు అందరం ఫ్యామిలీలానే ఉంటాం. చిరంజీవిగారు వాళ్లు ఎయిటీస్ బ్యాచ్ అని రీయూనియన్ చేసుకుంటున్నారు. ఆ తర్వాత 90స్ బ్యాచ్ మాది. మేమందరం కూడా అలా కలవాలని ట్రై చేసి, ఓసారి చెన్నైలో కలిసాం. తర్వాత అందరం బిజీ బిజీగా ఉండి 1980స్ బ్యాచ్‌లా ప్రతి ఏడాదీ కలవలేకపోతున్నాం.

● కెరీర్ ఫామ్‌లో ఉన్నప్పుడు పెళ్లి చేసుకొని సినిమాలు మానేశారు. ఆ విషయంలో ఏదైనా బాధగా ఉందా?

ఊహ: ఏమీ అనిపించలేదు. లైఫ్‌లాంగ్ ఎలానూ హీరోయిన్‌గా ఉండలేం. జీవితానికి ముఖ్యంగా కావాల్సింది మ్యారీడ్ లైఫ్. ఏ సమయంలో అయినా పెళ్లి చేసుకుని సెటిల్ అవ్వాల్సిందే. ఫామ్‌లో ఉన్నప్పుడే పెళ్లి చేసుకోవడం బెటర్. మంచి పేరుతో ఇండస్ట్రీ బయటకి వచ్చినట్టు ఉంటుందనిపించింది.

● అమలగారు, నదియాగారు.. ఇలా సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేస్తున్నారు. మీక్కూడా ఆ ఉద్దేశం ఏమైనా ఉందా?

ఊహ: ముగ్గురు పిల్లలు ఉన్నారు. నాకు వాళ్లతోనే సరిపోతోంది.

శ్రీకాంత్: టీవీలో చేయమని చాలాసార్లు అడిగారు. చేయనని చెప్పింది.

● ఓకే.. ఇన్నేళ్లు మీడియా ముందుకు రాని మీరు మీ పెద్దబ్బాయి రోషన్ హీరో అయినప్పుడు వచ్చి, మాట్లాడారు...

శ్రీకాంత్: (మధ్యలో అందుకుంటూ) అవునండీ.. నా సినిమాలకు కూడా రాలేదు.

ఊహ: అప్పుడు ఈయన జోక్స్ కూడా చేశారు. నా సినిమాల ఇంటర్వ్యూ అప్పుడు పిలిస్తే వచ్చే దానివి కాదు. మీ అబ్బాయి సినిమా కాబట్టి వస్తున్నావు అనేవారు. మనం పని చేసిన ఇండస్ట్రీలో మన అబ్బాయి కూడా వచ్చి పని చేయడం ఆ ఫీలింగ్ భలే ఉంటుంది. ఆ ఫీలింగే వేరు.

● మీ ముగ్గురు పిల్లల పెంపకం గురించి... ముగ్గుర్ని పెంచడం కష్టంగా ఉంటుందా?

ఊహ: కష్టం అనుకుంటే ఒకరిద్దరు ఉన్నా పెంచలేం. హ్యాపీగా పెంచితే వాళ్లే పెరిగిపోతారు. పిల్లల పెంపకాన్ని ఎంజాయ్ చేస్తున్నాను. సినిమాలు మానేశాను కాబట్టి ఇంట్లోనే ఉంటున్నాను. పిల్లలే లోకం. షూటింగ్ ముగించుకొని ఈయన వస్తే ఈయన.

శ్రీకాంత్: నాకు గుర్తున్నంతవరకూ నేను పిల్లల స్కూల్‌కి వెళ్లింది ఒకే ఒక్కసారి. స్కూల్‌కి తీసుకెళ్లడం, ట్యూషన్స్‌కి తీసుకెళ్లడం.. అన్నీ తనే. పిల్లల విషయంలో నేను చాలా తక్కువ పట్టించుకున్నట్లే.

● 'రుద్రమదేవి' సినిమాలో మీ పాప కూడా యాక్ట్ చేసింది కదా. కంటిన్యూ చేస్తారా?

శ్రీకాంత్: తనకి ఇంట్రస్ట్ లేదు. ఆ సినిమాలో చిన్నపిల్లల క్యారెక్టర్ అని చేసింది. అంతే. తను బాగా చదువుతుంది. బాస్కెట్ బాల్ నేషనల్ ప్లేయర్. మా చిన్నబ్బాయి రోహన్‌కి కూడా సినిమా హీరో అవ్వాలని ఉంది.

ఊహ: రోహన్ ప్రభుదేవాతో ఓ సినిమా చేస్తున్నాడు. ఏప్రిల్‌లో ఆ సినిమా రిలీజవుతుంది.

● మాకు తెలిసి శ్రీకాంత్‌గారు బాగా ఖర్చు పెడతారు.. అది నిజమేనా?

శ్రీకాంత్: ఇద్దరం ఖర్చు విషయంలో ఒకేలా ఉంటామనే చెప్పాలి. దగ్గరివాళ్ల పెళ్లిళ్లు అంటే బాగా ఇస్తుంది. ఇక అవసరం అని వస్తే ఎవరినీ కాదనదు. ఇద్దరం కూడా అవసరం అనుకున్నచోట ఎంతయినా వెనకాడం. నా ఖర్చులంటే పెద్దగా ఏముంటాయి? ఫ్రెండ్స్‌తో బాగా ట్రావెల్ చేస్తుంటాను. అదే నా ఖర్చు.

ఊహ: సినిమా ఇండస్ట్రీ గురించి అందరికీ తెలిసిందే. ఎప్పుడు ఎలా ఉంటుందో అన్నట్లు ఉంటుంది. అందుకని కొంచెం జాగ్రత్తగానే ఉంటాం. అయితే మా పెళ్లయిన రోజు నుండి ఇంతవరకు ఏ లోటు లేకుండా చూసుకుంటున్నారు. డబ్బు ఉంది కదా అని కొంతమంది కాసినోలకు వెళతారు. ఆయన అలాంటివి చేయరు.

● సినిమా ఇండస్ట్రీలో అప్ అండ్ డౌన్స్ మామూలే. డౌన్స్ వచ్చినప్పుడు మీరెలా సపోర్ట్ చేస్తారు?

ఊహ: మన టైమ్ బాగున్నప్పుడు పైన ఉంటాం. లేదంటే కొంచెం కిందకు దిగుతాం. మనం పైకి వెళ్లినప్పుడు ఎంత బాగా యాక్సెప్ట్ చేసుకున్నామో, కిందకు వచ్చినప్పుడు కూడా అలానే ఉండాలి. మనకు మనం ఆలోచించుకుని సెటిల్డ్‌గా ఉంటే బావుంటుంది. ఈయన దగ్గర ఉన్న గొప్ప విషయం ఏంటంటే... తన ఫీలింగ్స్‌ని బయటకు చూపించరు. హ్యాపీనెస్‌ని షేర్ చేసుకుంటారు కానీ డల్ మూమెంట్స్‌ని బయటపెట్టరు. అయితే నేను కనిపెట్టేస్తాను. కానీ అది బయటకు చెప్పకుండా ఆయనతో మామూలుగానే ఉంటాను. మెయిన్‌గా పిల్లలు కూడా ఈ విషయంలో సపోర్ట్ చేస్తారు. మేమిద్దరం ఆ విషయంలో అదృష్టవంతులం. మా పెద్దబ్బాయి రోషన్ సిట్యువేషన్‌ని అర్థం చేసుకొని ప్రవర్తిస్తాడు. పాప పదో తరగతి. చాలా జాగ్రత్తగా ఉంటుంది. మా చిన్నబ్బాయి ఐదో తరగతి చదువుతున్నాడు.

శ్రీకాంత్: అలాంటి టైమ్స్‌లో వాళ్లకంటే నేను ఎక్కువ ధైర్యంగా ఉండాలి.

● ఏమైనా కావాలంటే పిల్లలు ఎవర్నడుగుతారు?

ఊహ: దాదాపుగా నన్నే అడుగుతారు. ఏదైనా పెద్ద బడ్జెట్ అయితే ఆయన దగ్గరికి వెళతారు. టెన్షన్ పడుతూ వెళతారా, వాళ్లు టెన్షన్ పడ్డంత సేపు కూడా ఈయన ఉండరు. వెంటనే ఓకే అంటారు. (నవ్వుతూ). పిల్లలు కొంచెం డల్‌గా ఫేస్ పెడితే చాలు. వాళ్లకి నచ్చినది దొరికినట్లే. కానీ, మా పిల్లల్లో నచ్చేది ఏంటంటే దాన్ని గ్రాంటెడ్‌గా తీసుకోరు. ఇలా మనం బాధగా ఫేస్ పెడితే నాన్న ఏదైనా చేసేస్తారు అనే మెంటాలిటీ లేదు. అది మంచి విషయం. మేం చాలా లక్కీ. నాన్నని ఏదైనా అడగాలంటే ఓ రోజంతా ఆలోచిస్తారు. అడుగుదామా? వద్దా? అని.

● సరే.. మీ ఇంట్లో ఎవరు డామినేటింగ్?

ఊహ: ఇద్దరం బ్యాలెన్స్‌డ్‌గా ఉంటాం.

శ్రీకాంత్: తనే డామినేటింగ్ (నవ్వులు).

ఊహ: అవును.. మరి ఇల్లు మొత్తం పట్టించుకోవాలి కదా.

శ్రీకాంత్: అంటే నేను షూటింగ్‌లు అని పనుల్లో తిరుగుతూ ఉంటాను. ఆ టైమ్‌లో ఇంటికి అది కావాలి? ఇది కావాలి? అని ఆలోచిస్తే అవుట్. ఎప్పుడూ ఇంటి టెన్షన్ అనేది మన దగ్గరికి రాకూడదు. నాకా టెన్షన్ లేదు. ఒక్కోసారి సడెన్‌గా నైట్ షూటింగ్ అంటారు. ఏం ఆలోచించకుండా ఓకే అనేస్తాను. ఎందుకంటే నాకు ఇంటి టెన్షన్ లేదు.

● రోషన్ మళ్లీ స్క్రీన్ మీద ఎప్పుడు కనపడతాడు?

శ్రీకాంత్: ఈ ఇయర్ అనుకుంటున్నాం.

● ఫైనల్లీ.. ప్రేమికులుగా ఉన్నప్పుడు ఇచ్చి పుచ్చుకున్న గిఫ్ట్‌ల గురించి?

శ్రీకాంత్: ఏముంటాయి? పాపల బొమ్మలో, బాబుల బొమ్మలో ఇచ్చుంటాను.

ఊహ: అవునండీ.. నాకు బొమ్మలంటే చాలా ఇష్టం. టెడ్డీబేర్‌లు ఇచ్చేవారు. పెళ్లయ్యాక కూడా అవి కొనిచ్చారు.

శ్రీకాంత్: బంగారపు గొలుసులు అవీ ఇచ్చేవాణ్ని.. ఇప్పుడు అది కూడా లేదు. ఇప్పుడు ఇక ఏముంటుంది?

ఊహ: అవును.. ఏముంటుంది? (నవ్వులు).

– డి.జి. భవాని

ఆస్కార్

1917 వర్సెస్ పారాసైట్

'అండ్ ది ఆస్కార్ ఫర్ ది బెస్ట్ పిక్చర్ గోస్ టూ...' అని ప్రకటించడానికి ఎంతో సమయం లేదు. ఇవాళ రాత్రి హాలీవుడ్ సినిమా పండగ ఆస్కార్ జరగనుంది. 92వ ఆస్కార్ వేడుకలో ఉత్తమ చిత్రం విభాగంలో పది సినిమాలు ('ది ఐరిష్ మేన్, జోజో రాబిట్, జోకర్, ది లిటిల్ ఉమెన్, ఫార్డ్ వెర్సస్ ఫెరారీ, మ్యారేజ్ స్టోరీ, 1917, వన్స్‌పాన్ ఏ టైమ్ ఇన్ హాలీవుడ్, పారాసైట్') పోటీ పడుతున్నాయి. పోటీలో ఎన్ని సినిమాలున్నా హాట్ ఫేవరెట్ అంటూ రెండుమూడు సినిమాల చుట్టే చర్చ నడుస్తుంటుంది. అలా ఈ ఏడాది ఎక్కువశాతం మంది హాట్ ఫేవరెట్ సినిమాలు రెండే. ఒకటి వార్ డ్రామాగా తెరకెక్కిన '1917', సోషల్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన 'పారాసైట్'.

వార్ వన్ సైడ్?

దర్శకుడు శ్యామ్ మెండిస్, కెమెరామేన్ రోజర్ డీకిన్స్ సృష్టించిన విజువల్ వండర్ '1917'. సింగిల్ కట్ చిత్రంలా రూపొందిన సినిమా ఇది. జర్మనీ మీద దాడి చేయడానికి

వ్యూహం రచిస్తారు బ్రిటీష్ సైనికులు. కానీ అది తాము అల్లిన వ్యూహం కాదని జర్మన్ వేసిన ఉచ్చు అని చివరి నిమిషంలో గ్రహిస్తారు. దాంతో దాడిని విరమించాలనే విషయాన్ని ఇద్దరు సైనికుల ద్వారా పంపిస్తారు. వాళ్లు సకాలంలో వెళ్లారా? సందేశాన్ని చేర

వేశారా? సుమారు 1600 మంది సైన్యాన్ని రక్షించారా? అన్నదే చిత్ర కథాంశం.

ఆస్కార్ ఆశ నెరవేరుతుందా?

కంటెంట్‌లో అయినా మేకింగ్‌లో అయినా హాలీవుడ్ సినిమాలకు దీటైన సినిమాలను ఎప్పటికప్పుడు అందిస్తూనే ఉంది కొరియన్ సినిమా. కానీ ఆస్కార్ అవార్డు మాత్రం కొరియాకు అందని ద్రాక్షే. ఈ ఏడాది బొంగ్ జూన్ హో తెరకెక్కించిన డార్క్ థ్రిల్లర్ 'పారాసైట్' ఆస్కార్ ఆశ నెరవేర్చేలా కనిపిస్తోంది. ఒక ధనిక కుటుంబాన్ని తెలివిగా బోల్తా కొట్టించి వాళ్ల ఇంట్లో పని లోకి ప్రవేశిస్తుంది ఓ పేదకుటుంబం. ఆ తర్వాత జరిగే పరిణామాలే సినిమా కథ.

ప్రేక్షకుడిని యుద్ధవాతావరణంలో తీసుకెళ్లడంలో '1917' కచ్చితంగా సఫలమైంది. ప్రస్తుతం ప్రపంచంలో ఏ మూల చూసినా ఉన్న వర్గ పోరు (క్లాసిజాన్ని) కళ్లకు కట్టినట్టు చూపించింది 'పారాసైట్'. మరి ఈ రెండిట్లో ఏ సినిమాను ఆస్కార్ కమిటీ ఎంపిక చేసిందో వేచి చూడాలి. మరో విషయం... అస్కార్‌కి ఆశ్చర్యపరచడం కూడా తెలుసు. గతంలోనూ హాట్ ఫేవరెట్స్‌కి దక్కకుండా కొత్త విన్నర్‌ని ప్రకటించిన సందర్భాలున్నాయి. సో.. ఈ రెండూ కాకుండా వేరే సినిమాకి ఆస్కార్ దక్కినా ఆశ్చర్యపోవడానికి లేదు.

అదే మాకు పెద్ద సక్సెస్

"ఒక నటుడిగా నేను బాగానే చేస్తున్నా నంటున్నారు కానీ రావాల్సిన పేరు ఇంకా మనకు రాలేదా? అనే ఒక చిన్న వెలితి ఉండేది. 'జాను' చిత్రం యాక్టర్‌గా నన్ను మెరుగుపరిచింది. నా కెరీర్‌లోనే ఎప్పుడూ రానన్ని ప్రశంసలు వస్తున్నాయి. ఈ విజయం యాక్టర్‌గా నా ఆకలిని కొంచెం తీర్చిం ది" అన్నారు శర్వానంద్. సి. ప్రేమ్ కుమార్ దర్శకత్వంలో శర్వానంద్, సమంత ముఖ్య తారలుగా తెరకెక్కిన చిత్రం 'జాను'. తమిళంలో హిట్ సాధిం చిన '96' చిత్రానికి ఇది రీమేక్. 'దిల్' రాజు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 7న విడుదలైంది. ఈ సందర్భంగా హైదరా బాద్‌లో జరిగిన విలేకరుల సమా వేశంలో శర్వానంద్ చెప్పిన విశేషాలు.

శర్వానంద

- '96' చూసి క్లాసిక్ మూవీ, తెలుగు రీమేక్ అవస రమా? అనిపించింది. 'శతమానం భవతి'(2017) సినిమా సమయంలో కూడా 'కథ బాగుంది కాక పోతే నా పాత్ర అంతగా ఉన్నట్లు లేదు' అనే సందేహం వచ్చినప్పుడు.. ఈ సినిమాతో ఫ్యామి లీకి దగ్గరవుతావు' అన్న 'దిల్' రాజుగారి జడ్జ్ మెంట్ నిజమైంది. 'జాను వర్కౌట్ అవుతుంది' అని అన్నారాయన. ఆ నమ్మకంతోనే నటించాలను కున్నాను. 'దిల్' రాజుగారు నిర్మాత కాకపోతే గ్యారంటీగా 'జాను' చిత్రం చేసేవాడిని కాను.
- ఒక రోజు రాత్రి జరిగే కథ. ఓ నలభై రోజులు కాల్షీట్లు ఇస్తే సరిపోతుందిలే అనుకున్నా. కానీ రామచంద్ర క్యారెక్టర్ కళ్లతోనే ఎక్కువగా మాట్లా డాలి. ఇరవై రోజులు కెన్యాలో షూట్ చేశాం. మాల్దీ వుల్లో చేశాం. ఓ సీన్‌లో గాయపడ్డాను. మరోవైపు కో-స్టార్‌గా సమంత. రిలీజ్ తర్వాత మా ఇద్దరి యాక్టింగ్‌కు పోలికలు పెట్టి ట్రోల్ చేస్తారేమోనన్న భయం. కానీ నా కెరీర్‌లోనే నేను బాగా కష్టపడ్డ సినిమా 'జాను'. సమంత కాకుండా వేరే ఎవరైనా 'జాను' పాత్ర చేసినా నా నుంచి అంత నటన వచ్చి ఉండేది కాదేమోనని ఒక యాక్టర్‌గా నేను అనుకుం టున్నాను. '96'లో చేసిన విజయ్‌సేతుపతి, త్రిష లను మర్చిపోయి 'జాను'లో శర్వా, సమంతలను చూస్తున్నాం అంటున్నారు. అదే మాకు పెద్ద సక్సెస్.
- వ్యక్తిగా, నటుడిగా సమంత నుంచి చాలా నేర్చు కున్నాను. 'నేనొక సూపర్‌స్టార్.. నేను అక్కినేని ఫ్యామిలీ' అనే గర్వం తనలో లేదు. నేనొక షాట్ పూర్తి చేసి వెళ్లి కూర్చొంటే... సమంత మాత్రం మానిటర్ దగ్గరకు వెళ్లి చెక్ చేసుకునేది. ఇప్పుడు ఆ ఫార్ములాను నా సెట్‌లో నేను వాడుతున్నాను. రిలీజ్ తర్వాత మేం ఫోన్లో మాట్లాడుకున్నాం. 'సైలెంట్‌గా ఉంటావ్ కానీ బాగానే మార్కులు కొట్టే శావ్.. నువ్వు దొంగవి' అంది సమంత.
- ప్రతి ఒక్కరి జీవితంలో ఫస్ట్ లవ్ ఉంటుంది. నాకు కూడా ఉంది కాబట్టే రామచంద్ర పాత్రలో బాగా నటించానేమో (నవ్వుతూ). ఫస్ట్ లవ్‌ను పెళ్లి చేసుకునేవారు చాలా తక్కువ. 100లో 5 పర్సెంట్ ఉంటారేమో.
- నా కెరీర్‌లో 'గమ్యం, ప్రస్థానం' వంటి మంచి హిట్స్ ఉన్నాయి. కానీ 'జాను' లాంటి సిని మాలు మళ్లీ మళ్లీ రావు. నా కెరీర్‌లో 'జాను' గుర్తుండిపోయే సినిమా.
- తక్కువ రోజుల్లోనే షూట్‌ను కంప్లీట్ చేద్దా మనే అక్షయ్‌కుమార్ ఫార్ములాను ఫాలో అవు దామని ఫిక్స్ అయ్యాను. 3 సినిమాలు అయిపో వాలి.. 3 సెట్స్‌పై ఉండాలి. 'శ్రీకారం'లో రైతు పాత్ర చేస్తున్నాను. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 24న విడుదల చేస్తున్నాం.

బ్యాచ్‌లర్ వచ్చేశాడు

అఖిల్ హీరోగా 'బొమ్మరిల్లు' భాస్కర్ తెరకెక్కిస్తున్న చిత్రం 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్'. పూజా హెగ్డే కథానాయికగా నటిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ'వాసు, వాసు వర్మ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శనివారం ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ''హైదరాబాద్, అమెరికా లొకేషన్స్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరించాం. ఈ నెల 15నుంచి కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించనున్నాం. ఈ షెడ్యూ ల్‌తో మేజర్ టాకీపార్టు పూర్తవుతుంది. ఇందులో ఉన్న 6 పాటల్లో 4 పాటలను పూర్తి చేశాం. మిగతా రెండు పాటలను ఫారిన్‌లో షూట్ చేస్తాం. సినిమాను ఏప్రిల్‌లో రిలీజ్ చేయాలనుకుంటున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి గోపీసుందర్ స్వరకర్త.

అఖిల్

లుక్ లీక్

రజనీకాంత్

శివ దర్శకత్వంలో ఓ కుటుంబ కథా చిత్రంలో నటిస్తున్నారు రజనీకాంత్. ఇందులో ఖుష్బూ, మీనా, నయనతార, కీర్తీ సురేశ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఈ సినిమాలో రజనీకాంత్ లుక్ ఒకటి బయటకు వచ్చింది. పంచె కట్టు, మెలి తిప్పిన మీసా లతో కనిపిస్తున్నారు రజనీ. లుక్ అదిరిం దంటున్నారు ఫ్యాన్స్. గ్రామీణ నేపథ్యంలో ఈ సినిమా కథ సాగుతుందని సమాచారం. ఈ ఏడాది దసరాకు ఈ సినిమాను విడుదల చేయాలనుకుంటున్నారు.

తమన్నా

కోచ్ జ్వాల

కబడ్డీ కోచ్ జ్వాలారెడ్డిగా మారిపో యారు తమన్నా. 'గౌతమ్‌నంద' (2017) చిత్రం తర్వాత గోపీచంద్ హీరోగా సంపత్ నంది దర్శకత్వంలో కబడ్డీ ఆట నేప థ్యంలో 'సీటీమార్' అనే చిత్రం తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇందులో కథానాయికగా తమన్నా, దిగంగనా సూర్యవన్షీ నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని శ్రీనివాసాచిట్టూరి నిర్మిస్తున్నారు. ఇందులో ఆంధ్రా మహిళల కబడ్డీ జట్టు కోచ్‌గా గోపీచంద్, తెలంగాణ మహిళల జట్టు కోచ్ జ్వాలారెడ్డి పాత్రలో తమన్నా నటిస్తున్నారు. దర్శకుడు సంపత్ నంది కుమారుడు యువ ఓ గెస్ట్ రోల్ చేస్తున్నారు. శనివారం జ్వాలారెడ్డి లుక్‌ను విడు దల చేశారు. ''నా పాత్ర చాలెంజింగ్‌గా, ఆసక్తికరంగా ఉంటుంది'' అన్నారు తమన్నా. ''హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ స్టూడి యోలో కొత్త షెడ్యూల్ మొదలుపెట్టాం. సమ్మర్‌లో సినిమాను రిలీజ్ చేయాలనుకుంటున్నాం'' అన్నారు శ్రీనివాసా చిట్టూరి.

ఈ సినిమాతో నా ఇమేజ్ మారిపోతుంది

''వరల్డ్ ఫేమస్ లవర్' టీజర్ రిలీజ్ అయినప్పుడు టీజర్ బావుంది అన్నారు. కానీ నా పాత్రకి కొన్ని నెగటివ్ కామెంట్స్ వచ్చాయి. ఇలాంటి పాత్ర రాశీ ఖన్నా ఎందుకు చేసింది? అన్నారు. యాక్టర్ అన్నాక అన్ని రకాల పాత్రలు చేయాలి. ఎప్పుడూ ఒకే లాంటి పాత్రలు చేస్తూ ఉండలేం కదా. ఎప్పుడో ఓసారి దాన్ని బ్రేక్ చేయాలి. 'వరల్డ్ ఫేమస్ లవ ర్'తో అలాంటి ప్రయత్నం చేశాను. ఈ సినిమాతో నా ఇమేజ్ మారిపోతుంది అనుకుంటున్నాను'' అన్నారు రాశీఖన్నా. క్రాంతి మాధవ్ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ హీరోగా నటించిన చిత్రం 'వరల్డ్ ఫేమస్ లవర్'. రాశీ ఖన్నా, ఐశ్వర్యా రాజేశ్, కేథరీన్, ఇజబెల్లా కథానాయికలుగా నటించిన ఈ సినిమాను కేయస్ రామారావు నిర్మించారు. ఫిబ్రవరి 14న ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా రాశీ ఖన్నా చెప్పిన విశేషాలు.

- ఈ సినిమాలో నేను చేసిన యామినీ పాత్ర చాలా ఎమోషనల్‌గా ఉంటుంది. స్ట్రాంగ్ రోల్. చాలెంజింగ్‌గా అనిపించింది.
- యామినీ పాత్రకు బాగా కనెక్ట్ అయ్యాను. నా పాత్ర నేనే చేసిన ట్టుంది. నిజ జీవితంలో నేను చాలా ఎమోషనల్ పర్సన్‌ని. ఎమోషన్స్ కంట్రోల్ చేసుకోలేను. స్ట్రాంగ్ ఉమెన్ ఎమోషనల్ సైడ్‌ని బయటకు చూపించకూడదనుకుంటాను. నా పాత్రకు నేనే డబ్బింగ్ చెప్పుకున్నాను.
- సాధారణంగా నాకు లవ్ స్టోరీలంటే చాలా ఇష్టం. దర్శకుడు క్రాంతి మాధవ్‌గారు నాకు ఈ కథ చెప్పినప్పుడు బాగా నచ్చింది. ఆయన దగ్గర నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను.
- సినిమాలో సెంటరాఫ్ అట్రాక్షన్‌గా నేనే ఉండాలి అనుకోను. మనం చేసే పాత్రకు ప్రాముఖ్యత ఉండాలి. నలుగురు హీరోయిన్లు ఉన్నప్పటికీ నాకేం ప్రాబ్లమ్ లేదు. యాక్టర్‌గా నేను చాలా సెక్యూర్‌గా ఉంటాను. ఒకవేళ ఈ సినిమాలో నా పాత్ర కాకుండా వేరే పాత్రను ఎంచుకోమంటే ఐశ్వర్యా రాజేశ్ చేసిన పాత్ర చేస్తాను.
- వేలంటైన్స్ డే అంటే నాకు ఇష్టం. ప్రేమను చెప్ప డానికి ధైర్యం తెచ్చుకుని చెబుతుంటారు. వేలంటైన్స్ డేకి ఇది పర్ఫెక్ట్ సినిమా. ప్రస్తుతం రెండు సినిమాలు చర్చల దశలో ఉన్నాయి. త్వరలో ప్రకటిస్తాను.

రాశీఖన్నా

- ఈ సినిమా టీజర్ విడుదలైనప్పుడు 'అర్జున్ రెడ్డి 2' అన్నారు. కానీ ట్రైలర్‌తో ఆ అభిప్రాయం మారిపోయింది. విజయ్ గడ్డంతో ఉంటే అర్జున్ రెడ్డి లానే ఉంటారు. కానీ ఆ సినిమాకు ఈ సినిమాకు సంబంధం ఉండదు.

వేనవిలో నిశ్శబ్దం

'నిశ్శబ్దం' చిత్రం కొత్త విడుదల తేదీ ఖారరైంది. అనుష్క, మాధవన్, అంజలి, షాలిని పాండే, మైఖేల్ మ్యాడిసన్ ముఖ్య తారాగణంగా హేమంత్ మధుకర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'నిశ్శబ్దం'. ఈ సినిమాను జనవరి 31న విడుదల చేయాలనుకున్నారు. కానీ ఏప్రిల్ 2న విడుదల చేస్తున్నట్లు శనివారం చిత్ర బృందం ప్రకటించింది.

అనుష్క



సాక్షి ఫ్యామిలీ సన్నిధి
నల్లగొండ॥ ఆదివారం
9-2-2020

మేని పులకింప చేసే ప్రకృతి సోయగాల నడుమ చెప్పలేనన్ని చారిత్రక విశేషాలకు నెలవైన కొండవీడు కోట సమీపంలో ఆధ్యాత్మిక విశేషాలతో అలరారుతున్నది శ్రీ విజయదుర్గ సమేత శ్రీ మల్లికార్జునస్వామి దేవస్థానం. శ్రీచక్రయుత శక్తి పంచాయతన ఆగమోక్తంగా నిర్మించి నిత్యార్చనలతో అలరారుతూ భక్తులకు కొంగుబంగారంలా నిలచిన ఈ ఆలయం నేడు తృతీయ వార్షిక బ్రహ్మోత్సవాలు జరుపుకుంటోంది. ఈ సందర్భంగా ఆలయ విశేషాలు.

శ్రీచక్రాలయం

ప్రకృతి పురుషుడు

గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం కొండవీడు కోట సమీపంలోని పుట్టకోట కొత్తపాలెంలో నిర్మాణమైన ఈ ఆలయం అడుగడుగునా ఆధ్యాత్మిక సంపదతో నిండి ఉంది. కొండవీడు రెడ్డి రాజుల కాలంనాడు కోట ద్వారం ముందు ప్రవేశానికి అనుమతిస్తున్నట్లుగా దక్షిణాభిముఖంగా ప్రతిష్ఠించిన స్థానగణపతి ఈ ఆలయం రాజగోపురం ముందే కొలువై ఉంటాడు. చూసీ చూడగానే అత్యంత పురాతనమైన విగ్రహమని సామాన్యులకు సైతం స్ఫురిస్తూ చారిత్రక విశిష్టతను తెలియచెప్తుంటుంది ఈ విగ్రహం. రాజగోపురం దాటి లోపలకు వెళ్ళగానే ద్వార గణపతి దర్శనమిస్తాడు. ఆలయ ప్రదక్షణ మార్గంలో తొలుత గురు సాంప్రదాయానికే మూలమైన దత్తాత్రేయస్వామి మందిరం, ఆ తర్వాత సాయిబాబా మందిరం, ముందుకు సాగితే సిద్ధిబుద్ధి సమేత మహాగణపతి మందిరం, ఆ పక్కనే పదునెనిమిది మెట్లతో తీర్చిదిద్దిన శ్రీ హరిహరసుతుడు అయ్యప్పస్వామి దేవస్థానం కొలువై ఉన్నాయి. ఆలయం వెనుక భాగంలో తవ్వకాలలో లభించిన చరిత్రకు సాక్ష్యాలుగా నిలిచే సుందరమైన శ్రీ మహాలక్ష్మీ, శ్రీకామాక్షి, శ్రీసుబ్రహ్మణ్యేశ్వర, ఆంజనేయ ప్రతిమలు దర్శనమిస్తాయి. ఉత్తరభాగంలో ఆరోగ్యప్రదాత ఛాయ సంధ్యా సమేత సూర్యనారాయణ మందిరం, చండీశ్వరుడు, తూర్పువైపున శివకేశవులకు భేదం లేదన్న ఆదిశంకరాచార్యుని బోధలను ఆచరణలో చూపుతూ గరుడాళ్వార్ సమేత శ్రీ లక్ష్మీనారాయణ మందిరం గొప్ప శిల్పసౌందర్యంతో రూపుదిద్దుకున్నాయి. ఈశాన్యభాగంలో కాలభైరవ మందిరం, ఆ పక్కనే శ్రీ కళ్యాణ నవగ్రహ దేవతలు, నాగేంద్రులు ప్రతిష్ఠించబడ్డారు. గోశాలలో ప్రత్యక్షదేవతలైన గోమాతలు దర్శనమిస్తాయి.

కళ్యాణ ప్రదాతలుగా నవగ్రహ దేవతలు

సాధారణంగా అన్ని ఆలయాలలోలా కాక ఈ ఆలయంలో ప్రతి నవగ్రహ దేవత వారివారి దేవేరులతో కూడి వాహనారూఢులై కనిపిస్తారు. దేవేరులతో కొలువై ఉన్నందున కళ్యాణ ప్రదాతలుగా వెలుగొందుతున్నారు.

భక్తులను కట్టిపడేసే శ్రీ చక్రం

శ్రీ చక్రయుత శక్తి పంచాయతన దేవాలయంగా పేరొందిన ఈ ఆలయంలో గర్భాలయానికి ముందు పరిపూర్ణమైన మూర్తిత్వంతో తీర్చిదిద్దిన భారీ శ్రీ చక్రం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. భక్తులందరూ ఆసీనులై సాంప్రదాయ బద్ధంగా అర్చనలు చేసుకునేలా శ్రీ చక్రాన్ని ఏర్పాటు చేసారు.

అర్ధనారీశ్వర తత్వానికి, పంచకోశ సాంప్రదాయానికి ప్రతీక గర్భాలయం

ఒకే గర్భాలయంలో ఆదిదంపతులు కొలువుదీరి అర్ధనారీశ్వర తత్వాన్ని బోధిస్తుంటారు. గర్భాలయంలో ముందు శివలింగం ఆ వెనుకనే విజయదుర్గ అమ్మవారు, కొలువై ఉన్నారు. గర్భాలయం చుట్టూ పంచకోశ దేవతలైన నృత్యగణపతి, దక్షిణామూర్తి, లింగోద్భవ మూర్తి, బ్రహ్మదేవుడు, శ్రీ వైష్ణవ దుర్గ అద్భుత శిల్పసంపదతో అభయమిస్తారు.

ప్రకృతి పులకింతల మధ్య కొలువైన ప్రకృతి స్వరూపులు

ప్రకృతి స్వరూపులైన శివపార్వతులు ఒకే గర్భాలయంలో కొలువుదీరిన ఈ దేవాలయం చుట్టూ ఉన్న ప్రకృతి రమణీయత భక్తులను కట్టిపడేస్తుంది. ఆలయం ఎదురుగానే స్వాగత తోరణాల్లాగా కొండవీటి కొండలు అద్భుతంగా దర్శనమిస్తాయి. ఆలయానికి వెళ్ళే దారిపొడవునా, చుట్టూ ఉద్యాన పంట లు, పూదోటలు, ప్రకృతిమాత శోభ కళ్ళ ముందు ఆవిష్కృత మవుతాయి.

ఏకకాలంలో శివకేశవులకు కళ్యాణం

వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని చండీ, రుద్ర, సుదర్శన హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. శివకేశవులకు ఏకకాలంలో కళ్యాణాలు వేరువేరు వేదికలపై నిర్వహించడం ఉత్సవాలలో ప్రత్యేకత. ఇలా రెండు కళ్యాణాలు ఒకేసారి నిర్వహించడం వలన శివకేశవుల అనుగ్రహం నిండుగా ప్రసరిస్తుందని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ఫిరంగిపురం వాస్తవ్యులు, ప్రఖ్యాత జ్యోతిష పండితులు బ్రహ్మశ్రీ కల్వకొలను సాంబశివ శర్మ, వారి కుటుంబ సభ్యుల విశ్వాసం. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామికి, గర్భాలయంలో కొలువుతీరిన శ్రీ విజయదుర్గ సమేత శ్రీ మల్లికార్జున స్వామికి అంగరంగ వైభవంగా కళ్యాణం చేస్తారు.

– **కోలుకొండ శ్రీకర్**, సాక్షి, గుంటూరు
ఫొటోలు: **మిరియాల వీరాంజనేయులు**

ధార్మిక సమాధానమ్

నిత్యం చేసుకునే పూజలలో సూర్యోదయ సమయంలో ఉన్న తిథిని సంకల్పంలో చెప్పుకుంటాం కదా... ఇదే పద్ధతిని ఆయా తిథుల్లో వచ్చే పండుగలకు అనుసరిస్తారా? అంటే సూర్యోదయ సమయాన ఉన్న తిథి ఉన్న రోజునే పండుగ జరుపుకోవాలా?

- డి.ఎల్. అనూరాధ, కొత్తగూడెం

సూర్యోదయ సమయంలో ఉన్న తిథినే నిత్య సంకల్పంలో చెప్పుకోవాలి. అందులో సందేహం లేదు. పండుగలలో కూడా అలాగే చెప్పుకున్నా– కొన్ని పండుగలకు మాత్రం విభిన్న కాలాలు వర్తిస్తాయి. ఉదాహరణకు– భాద్రపదమాసంలో మధ్యాహ్నం శుక్లచవితి ఉన్న రోజునే వినాయక చవితి జరుపుకుంటాం. చంద్రోదయంతో కృష్ణచవితి ఉన్న రోజున సంకష్ట హర చతుర్థి చేస్తాం. మధ్యాహ్న వ్యాపిని అయిన చైత్రశుద్ధ నవమి శ్రీరామ నవమి గానూ, రాత్రి అష్టమి ఉన్న రోజున కృష్ణాష్టమినీ, అమావాస్య రాత్రి ఉన్న రోజున దీపావళినీ, అర్ధరాత్రి చతుర్దశి ఉన్న రోజున శివరాత్రిని– ఇలా నిర్వహిస్తాం. వాటికి సంబంధించిన రోజున ఆ పర్వాన్ని పేర్కొని అర్చనాదులు చేయాలి.

– *ఋషి పీఠం సౌజన్యంతో...*

ఇస్లాం వెలుగు

వ్యాపార ధర్మం

నిర్వహణ:
డి.వి.ఆర్. భాస్కర్

'**మీ** సామగ్రి అమ్ముకోడానికి ప్రజలకు అబద్ధాలు చెప్పకండి, అసత్య ప్రమాణాలు చెయ్యకండి. అలా చేయడం వల్ల మీ వ్యాపారం అభివృద్ధి చెందినట్లు తాత్కాలికంగా అనిపించినా, చివరికి మీ వ్యాపారంలో శుభాలు అంతరించి పోతాయి. వ్యాపారంలో ఎప్పుడూ నమ్మకం, విశ్వసనీయత కలిగి ఉండాలి. పనికిరాని, నాసిరకం వస్తువుల్ని మాయమాటలు చెప్పి అమ్మడం గాని, సాధారణ లాభం కంటే చాలా ఎక్కువ లాభం గడించడంగాని చేసి, ధర్మబద్ధమైన మీ వ్యాపారాన్ని అధర్మమైనదిగా చేసుకోకండి. సత్యవంతుడైన వ్యాపారి ప్రళయ దినాన ప్రవక్తలు, సత్యసంధులు, షహీదుల సహచర్యంలో ఉంటాడు.' అని ప్రవక్త మహనీయులవారు ఉపదేశించారు.

అంతేకాదు, మీరు చేస్తున్న పనిలో శుభం (బర్కత్) కలగాలంటే ప్రాతః కాలాన్నే నిద్రలేవాలని చెప్పారు. ఉపాధి అన్వేషణలో, ధర్మసమ్మతమైన సంపాదన కోసం ప్రాతః కాలాన్నే ఎంచుకోండి. ఎందుకంటే ఉదయకాల ప్రార్థన(నమాజ్) తరువాత చేసే పనుల్లో శుభాలు, లాభాలు సమృద్ధిగా ఉంటాయి. ధర్మసంపాదనతో జీవితం గడిపినవారు నా సంప్రదాయాన్ని పాటించినవారవుతారు. నా సున్నత్ ను పాటించినవారు తప్పకుండా స్వర్గంలోకి ప్రవేశిస్తారు.

ప్రవక్త మహనీయులవారి ఈ ఉపదేశాల ద్వారా మనకు చాలా విషయాలు తెలుస్తున్నాయి. కనుక ప్రవక్త వారి సుభాషితాలను దృష్టిలో ఉంచుకొని, వ్యాపారంలో విలువలు పాటించాలి. సాధ్యమైనంతవరకు వినియోగదారునికి మంచి సరుకు, మంచి వస్తువు సమకూర్చే ప్రయత్నం చెయ్యాలి. మీకు నమ్మకంలేని సామగ్రిని మీరసలు అమ్మనే కూడదు. నిజాయితీగా, పట్టుదలతో వ్యాపారం చేసి బాగా సంపాదించుకోవడంలో ఎలాంటి తప్పులేదు. కాని అబద్ధాలు చెప్పి, కల్తీచేసి, మాయచేసి, మోసంచేసి అడ్డదారులు తొక్కి సంపాదించాలన్న దుర్బుద్ధి ఉండకూడదు. వ్యాపారంలో నమ్మకం, నిజాయితీ, ఖచ్చితత్వం ఉండాలి. సరుకును కల్తీచేయడం, తూనికలు, కొలతల్లో మోసం చేయడం, అబద్ధం చెప్పడం లాంటి చేష్టలకు పాల్పడితే అలాంటి వ్యాపారికి వినాశం తప్పదని ప్రవక్త హెచ్చరించారు. ఒకసారి ప్రజలు, 'అన్నిటికన్నా శ్రేష్ఠమైన సంపాదన ఏది?' అని ప్రవక్తవారిని అడిగారు. దానికాయన, 'స్వహస్తాలతో ఆర్జించిన సంపాదన..అబద్ధం, నమ్మక ద్రోహం లేని వ్యాపారం' అని సమాధానం చెప్పారు.

– **ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్**

స్త్రీ వైశిష్ట్యం-27

...తరువాత ఏడ్చి ఉపయోగమేమిటి!

55 ఏళ్ళు అన్నయ్యకు, 50 ఏళ్ళు తమ్ముడికి. అన్నయ్య ఇంటికి తమ్ముడెళ్ళడు, తమ్ముడింటికి అన్నయ్య వెళ్ళడు. ఒక్క అమ్మ కడుపున పుట్టిన వాళ్ళమనే భావన ఈ జన్మకు ఆ ఇద్దరితోటే కదా. 55 ఏళ్ళు వస్తే నువ్వు మహా బతికితే 70 ఏళ్లు వచ్చేవరకే. ఆ తరువాత నీవు స్వతంత్రంగా తిరగలేవు. ఆ తరువాత మరో 15 ఏళ్ళు బతుకగలవేమో. అప్పుడప్పుడూ వెళ్ళేది లెక్కేసుకున్నా ఈ శరీరం ఉండగా మహా అయితే బహు కొద్దిసార్లు మాత్రమే నీ తమ్ముడింటికి వెళ్ళగలవు. ఆ మాత్రం దానికి ఎందుకు కొట్టుకు చస్తారు? అన్నదమ్ములిద్దరూ చిన్నప్పుడెంత ప్రేమగా మెలిగారో అలా చెయ్యి చెయ్యి పట్టుకుని, పాత జ్ఞాపకాలు నెమరేసుకుంటూ సంతోషంగా కలిసి మెలగలేరా... నిజానికి ఏ ఒక్కరి శరీరం పడిపోయినా ఆ బంధం తాలూకు మాధుర్యం జీవితంలో మళ్ళీ వస్తుందా... పోగొట్టుకున్న తరువాత ఏడ్చి ఉపయోగం ఏమిటి ?

రాముడు పుష్పక విమానంలోంచి దిగుతుంటే లక్ష్మణ స్వామి, భరత శత్రుఘ్నులు ఎదురెళ్ళి పాదుకలు తొడిగి కిందకు దింపుతుంటే... విభీషణుడు పక్కకు తిరిగి కళ్ళొత్తుకున్నాడు...''నా అన్న రావణుడు కూడా మహానుభావుడు. సమస్త శాస్త్రాలను చదువుకున్నవాడు. పది తలలున్నవాడు. ఘోరమైన తపస్సు చేసినవాడు. కాంచన లంకాధిపతి. లోకాలను గడగడలాడించినవాడు. నేనే చంపించేసాను. కుంభకర్ణుడు సామాన్యుడు కాడు. నేనే చంపించేసాను. అన్నయ్య కనపడితే పాదాల దగ్గర అన్నయ్యా అని నమస్కరిద్దామంటే ఏడీ? అన్నయ్యా! చెప్పులేసుకో అని ఇలా చెప్పులు తీసి అన్నయ్య కాళ్ళదగ్గర పెడదామంటే ఏడీ? చంపించేసాను.'' అని తలచుకుని ఆవేదన చెందాడు. సుగ్రీవుడు కూడా పక్కకు తిరిగి కళ్ళొత్తుకున్నాడు. ''నా అన్న వాలి. ఎదుటివారి బలం సగం లాగగలడు. అప్రమేయ పరాక్రమవంతుడు. నాలుగు సముద్రాల దగ్గర సంధ్యా వందనం చేయగలడు. అంతటి బలవంతుడు. నేనే ఈ రాముడి తోటే బాణం వేయించి చంపేసాను. నాకు అన్న లేడు.. నేనిలా చెప్పులు తొడగలేను. నేనిలా కౌగిలించుకోలేను. అన్నయ్యా! అని చెయ్యివ్వలేను... అన్నను పోగొట్టుకున్న దురదృష్టవంతుణ్ణి'' అని వేదనా భరితుడయినాడు.

రామలక్ష్మణ భరత శత్రుఘ్నులు నలుగురూ చెయ్యి చెయ్యి పట్టుకుని బతికారు జీవితాంతం.. కానీ ఆ గొప్ప వాళ్ళదికాదు. అలా బతకగలిగారంటే.. వాళ్ళు అలా బతికేటట్టుగా మాట్లాడి... బతకడానికి అవకాశమిచ్చిన వారు – శాంతి స్థానంలో ఉన్న వాళ్ళ భార్యలు.

''మీ అన్న రాముడు అరణ్యవాసానికి వెడుతున్నాడు... అంటే మీ నాన్న దశరథ మహారాజు గారు వరమడిగారు, వెడుతున్నాడు. మీ వదిన సహధర్మచారిణి కాబట్టి వెడుతోంది.. 14 ఏళ్ళు నువ్వెందుకయ్యా వెళ్ళడం..?'' అని లక్ష్మణ స్వామి భార్య ఊర్మిళ భర్తను అడగవచ్చు కదా! అడగలేదు. అంటే ఆయన ధర్మాత్ముడు.. అన్నగారి కోసం వెళ్ళిపోయాడు. అటువంటి భర్తకన్నా నాకేం కావాలి ?'' అనుకుని ఊర్మిళ ప్రశ్నించలేదు. ఆ నలుగురు అన్నదమ్ములు అలా సఖ్యతతో ఉండడానికి కారణం సీతమ్మ. ఊర్మిళ, మాండవి, శృతకీర్తి సహకరించడం. స్త్రీ తాను ఎంత శక్తిమంతురాలో తెలుసుకోవడం ఒక ఎత్తు, అది తెలుసుకున్న తరువాత తన కుటుంబ శాంతి కోసం శీలవైభవాన్ని పొందడం ఒక ఎత్తు. అది ఆచరణాత్మకమైన నాడు పదిమంది ప్రశాంతంగా జీవనం చెయ్యగలిగిన అవకాశం కలుగుతుంది.

గురు సన్నిధి

శ్రీ రాఘవేంద్ర యతీంద్రులు



బృందావనంలో కొలువై భక్తుల మొరలను ఆలకించే గురువు శ్రీరాఘవేంద్రస్వామి. రాఘవేంద్ర తీర్థులని పిలిచినా, శ్రీరాయలు అంటూ ఆరాధించినా కొలిచిన వారికి కల్పవృక్షం గురు రాఘవేంద్ర యతీంద్రులు.

తిమ్మన్నభట్టు, గోపాంబ అనే దంపతుల పుత్రుడు వెంకటనాథుడు. అతడి తెలివితేటలను చూసి పొగడనివారు లేరు. కుమారుడి పాటవానికి తల్లిదండ్రులు మురిసిపోయేవారు. వజ్రంలా ప్రకాశిస్తున్న తమ కుమారుడి ప్రతిభకు సానపెట్టమని శ్రీ సుధీంద్రతీర్థుల వద్ద శిష్యునిగా చేర్చారు తండ్రి. గురువుల సాన్నిధ్యంలో వేద, శాస్త్రాలతో బాటుగా సంగీతాన్ని అభ్యసించి, పిదప గృహస్థాశ్రమం స్వీకరించాడు వెంకటనాథుడు.

అతనే వారసుడు

''వేద శాస్త్రాలను వడబోసిన వెంకటనాథుడే నీ వారసుడని'' ఒకనాడు మూలరాములు శ్రీ సుధీంద్ర తీర్థులకు కలలో కనబడి ఆదేశించడంతో సుధీంద్ర తీర్థులు వెంకటనాథునికి సన్యాసాశ్రమాన్ని ప్రసాదించి, రాఘవేంద్ర తీర్థులని నామకరణం చేసారు. సన్యాసం స్వీకరించిన రాఘవేంద్రులు దక్షిణభారతమంతా సంచరించి ద్వైత సిద్ధాంతాన్ని విరివిగా ప్రచారం చేసారు.

పరిమళాచార్యుడు

అసమాన ప్రజ్ఞాదురంధరుడెన్న రాఘవేంద్ర తీర్థులు తొమ్మిది ప్రధాన ఉపనిషత్తులకు వ్యాఖ్యానాలతో సహా అనేక గ్రంథాలనూ వ్రాసారు. జైమిని పూర్వమీమాంస సూత్రాలకు రాసిన 'భట్ట సంగ్రహం' భారతీయ తత్వశాస్త్రానికి అపురూపమైన కానుకగా పండితులు చెబుతారు. వ్యాసతీర్థుల చంద్రికకు 'ప్రకాశిక' పేరుతో పరిమళ వ్యాఖ్యానం చేసి పరిమళాచార్యుడిగా ప్రఖ్యాతి గాంచారు. వ్యాకరణ శాస్త్రంలో వారి ప్రతిభకు మెచ్చి మహాభాష్యకార బిరుదుతో సన్మానించారు.

నాటి మంచాల...నేటి మంత్రాలయం

ఆనాటి ఆ ప్రాంతాన్ని పాలిస్తున్న నవాబు వీరి మహిమకు సంతసించి ఒక గ్రామాన్ని కానుకగా ఇవ్వగా శ్రీ రాఘవేంద్రులు మఠం ఏర్పాటుచేసారు. అక్కడే బృందావనం ప్రవేశం చేసారు. నేడది మంత్రాలయం అనే పుణ్యక్షేత్రంగా వెలుగొందుతోంది. అలజడి, అశాంతి, ఆందోళనలతో నిండిన వారు మంత్రాలయంలోని బృందావనాన్ని దర్శిస్తే శాంతి లభిస్తుంది.

బృందావనం నుంచి సమాధానం

రాఘవేంద్రులు మహాసమాధిలోకి ప్రవేశిస్తున్న సమయంలో అప్పణాచార్యులనే శిష్యుడొకరు గురువును చివరిసారి దర్శించుకునేందుకై తుంగభద్ర నదిని దాటి పరుగున బృందావనానికి చేరుకున్నాడు. కానీ అప్పటికే సమాధి కార్యక్రమం ముగిసింది. గురువు కడచూపు దక్కనందుకు కన్నీటి పర్యంతమవుతూ ఒక శ్లోకాన్ని చదివాడు అప్పణాచార్యులు. కానీ శ్లోకం చివరిపాదం ఎంతకూ తట్టలేదు. అందరూ ఆతృతగా ఎదురు చూస్తుండగా చివరి పాదానికి కావలసిన ఏడక్షరాలూ రాఘవేంద్రుల సమాధి లోంచి వెలువడ్డాయి. ఈనాటికీ ఆ శ్లోకాన్ని బృందావనంలో పఠిస్తారు.

– **అప్పాల శ్యామప్రణీత్ శర్మ అవధాని**
వేదపండితులు

మీకు తెలుసా?

దేవతల కాల ప్రమాణం

కల్పం అంటే బ్రహ్మకు ఒక పగలు. ఇది మొత్తం 432 కోట్ల సంవత్సరాలు. ఒక కల్పంలో 14 మన్వంతరాలుంటాయి. మన్వంతరాన్నే మనువు యొక్క యుగమని అంటారు. మన్వంతరానికి 31,10, 40, 000 సంవత్సరాలు. ఒక్కో మన్వంతరంలో భూమిని ఒక్కొక మనువు పరిపాలిస్తాడు. ప్రస్తుతం నడుస్తున్నది ఏడవ మన్వంతరం. దీనిని పాలిస్తున్నది వైవస్వత మనువు. అందుకే, దీనిని వైవస్వత మన్వంతరం అంటారు. ఒక్కో మన్వంతరంలో 71 మహాయుగాలు, ఒక్కో మహాయుగంలో నాలుగు యుగాలు (కత, త్రేతా, ద్వాపర, కలి యుగాలుంటాయి). దేవతల కాల ప్రమాణం, మన కాల ప్రమాణానికి 360 రెట్లు ఎక్కువ. అంటే, మన ఒక సంవత్సరకాలం దేవతలకు ఒక రోజు. అలా, మానవుల 30 సంవత్సరాలు దేవతలకు ఒక నెల. మానవుల 360 సంవత్సరాలు వారికి ఒక (దివ్య) సంవత్సరం. ఇటువంటి 12,000 దివ్య సంవత్సరాలు వారికి ఒక దివ్య యుగం (మహాయుగం). ఇది మనకు నాలుగు యుగాలకు సమానం. ఈ విధంగా లెక్క పెడితే మన (భూలోకంలోని) 43, 20,000 సంవత్సరాలు ఒక మహాయుగం అవుతుంది.

సువార్త

దాతృత్వం.. ప్రార్థన.. ఉపవాసం.. రహస్యంగా సాగాలి!



పాత నిబంధన కాలంలో దేవుడు తన న్యాయసంవిధాన సూత్రావళిగా మోషేకిచ్చిన పదాజ్ఞలతో కూడిన ధర్మశాస్త్రానికి పొడిగింపుగా, కొత్తనిబంధన కాలపు విశ్వాసులకు కరదీపికగా, యేసుప్రభువే స్వయంగా ఆ ధర్మశాస్త్రానికిచ్చిన వినూత్నమైన భాష్యం ఆనాడు యేసుప్రభువు కొండమీది చేసిన ప్రసంగం!! ధర్మశాస్త్రాన్ని తూచా తప్పకుండా అమలుపర్చడమే దేవుని ప్రసన్నుని చేసుకోగలిగిన ఏకైక మార్గమైతే, అది మానవమాత్రులకెంత అసాధ్యమో ధర్మశాస్త్రమే రుజువు చేస్తుంది. అత్యున్నతమైన ధర్మశాస్త్రపు పవిత్రతా స్థాయిని ప్రామాణికం చేసుకుంటే, ఈ లోకంలో అందరూ పాపులే అని నిర్వచిస్తుంది బైబిల్ (రోమా 3:23). అందువల్ల కొత్తనిబంధన కాలపు విశ్వాస జీవితానికి యేసు ప్రభువు వారి కొండమీది ప్రసంగం పునాది లాంటిది. దేవుని మహిమ కోసం విశ్వాసి బాహాటంగా చెయ్యవలసిన అనేక విషయాలతోపాటు, దేవుని మహిమ కోసం, తన మేలుకోసం విశ్వాసి పరమ రహస్యంగా చేయవలసిన మూడు ప్రధానమైన అంశాలను కూడా యేసుప్రభువు తన కొండమీది ప్రసంగంలోనే ప్రకటించాడు. విశ్వాసి మొదటిగా తన 'దాన ధర్మాలను', రెండవదిగా' ప్రార్థనను', మూడవదిగా తన 'ఉపవాస దీక్ష'ను చాలా గుప్తంగా, రహస్యంగా చెయ్యాలని యేసుప్రభువు ఆదేశించాడు. ఇవి సలహాలు కాదు, ప్రభువిచ్చిన చాలా స్పష్టమైన ఆదేశాలు. అది తెలియకే, గోప్యత లోపించిన మన ప్రార్థనలు, దానధర్మాలు, ఉపవాస దీక్షలు ఈనాడు బహిరంగ ప్రచార వేదికలయ్యాయి, వాటివల్ల బోలెడు పేరుప్రఖ్యాతులైతే వస్తాయేమో కాని వాటి అసలు ఫలాలు, ఆశీర్వాదాలు మాత్రం మనకు, మన కుటుంబాలకూ రావడం లేదు. విశ్వాసి ఇతరులకు ఒక చేతితో చేసే సహాయం మరో చేతికి తెలియకూడదని, అదంతా రహస్యంగా జరగాలని ప్రభువు ఆదేశించాడు. మనం మన పొరుగువారికి, పేదలకు చేసే సహాయం లేదా ధర్మం ఎంత రహస్యంగా ఉంటే దానివల్ల దేవుని ఆశీర్వాదాలు మనకు అంత ధారాళంగా ప్రతిఫలంగా లభిస్తాయి. చర్చికి కానుకగా బెంచీలిచ్చి, వాటి వెనక తమ పేర్లు రాయించుకుంటే, ఆ పేర్లు ఈ లోకంలోనే ఉండిపోతాయి కానీ పరలోకంలో దేవుని జీవగ్రంథంలో మాత్రం రాయబడవన్నది తెలుసుకోవాలి. పేదలకు చేసే ధర్మం గురించి యేసు ఇలా చెప్పాడు కానీ దేవుని కిచ్చే కానుకల గురించి కాదంటూ కొందరు పాస్టర్లు తమ స్వార్థం కోసం దీనికి వక్రభాష్యం చెబుతారు. ఒక పేద విధవరాలు గుప్తంగా ఇచ్చిన చిరుకానుకను ప్రభువెందుకు శ్లాఘించాడో అర్థమైతే, ఈ వాస్తవమేమిటో బోధపడుతుంది. ఇక ప్రార్థనయితే, గది తలుపు లేసుకొని మరీ రహస్యంగా చేయాలన్నది ప్రభువాదేశం. కానీ ఆనాటి పరిసయ్యుల్లాగే, జీవితం లో ఎన్నడూ రహస్య ప్రార్థన చెయ్యని వారు కూడా మైకుల్లో సుదీర్ఘంగా ప్రార్థన చేసేందుకు ఉబలాట పడుతుంటారు. దేవుని సంబోధిస్తూ, దేవునికే చేసే మన ప్రార్థన అసలు ఇతరులెందుకు వినాలి? చర్చిల్లో ప్రార్థనలకు, కుటుంబ ప్రార్థనలకు అతీతమైనది, ఆశీర్వాదకరమైనది విశ్వాసి తన ప్రభువుతో ఏకాంతంగా చేసే రహస్య ప్రార్థన. ఇదే బలమైన ప్రార్థనాజీవితమంటే!! పోతే అందరికీ తెలిసేలా ఉపవాస దీక్షలు చెయ్యడానికి కూడా తాను వ్యతిరేకమని, అదంతా వృథా ప్రయాస అని కూడా ప్రభువు స్పష్టం చేశాడు. ఈ మూడూ ఎంత రహస్యంగా చేస్తే అవి మనకంత ఆశీర్వాదకరమవుతాయి. అవెంత బహిరంగంగా చేస్తే, మనమంతటి వేషధారులమవుతాము. దేవుని ఆశీర్వాదాలు కావాలంటే, దేవుడు చెప్పినట్టు చేయాలి కదా... అలా కాకుండా మాకు తోచినట్టే చేస్తాం అంటే, ఎండమావుల్లో నీళ్లు వెదకడమే కాదా??

– **రెవ.డా.టి.ఎ.ప్రభుకిరణ్**

ప్రశ్నోత్తర భారతం



అర్జునుడు

1. అర్జునుడు గురించి వ్యాసుడు ఏమని చెప్పాడు?
2. ద్రోణాచార్యుడు తన శిష్యుల విద్యా కుశలతను ఏ విధంగా పరీక్షించాడు?
3. సరైన సమాధానం ఎవరు చెప్పారు?
4. అర్జునునితో ద్రోణుడు ఏమన్నాడు?
5. ద్రోణాచార్యుడి ఆజ్ఞను అర్జునుడు ఏ విధంగా అనుసరించాడు?

జవాబులు

1) అర్జునుడు విద్యాభ్యాసంలో కనబరిచే కౌశలంతో గురువుగారి అనురాగం అధికంగా పొందగలిగాడు. అందరికీ ఒకేరీతిని నేర్పుతున్నా అర్జునుడు తన ప్రతిభతో అతిరథుడయాడు. దుర్యోధనాదులు అసూయ చెందారు 2) భాసం అనే కృత్రిమ పక్షిని తయారుచేయించి, చెట్టు కొమ్మ చివర ఉంచి, అందరినీ పిలిచి చెట్టు చివరన ఏముంది అని ప్రశ్నించాడు. వారెవ్వరూ సరైన సమాధానం చెప్పలేదు 3) అర్జునుడు 4) ధనుస్సు సంధించి, సిద్ధంగా ఉండమనీ, రెండు ఘడియల్లో తన ఆజ్ఞ వినగానే లక్ష్యాన్ని ఛేదించమనీ అన్నాడు 5) ధనుస్సును మండలాకారంగా లాగి సంధించి, చెట్టు మీది కృత్రిమ పక్షి వైపు దృష్టి ప్రసారిస్తూ నిలబడ్డాడు.

- నిర్వహణ:
డా. వైజయంతి పురాణపండ

నీతి రాజం

యామున రాజనీతి-1

(ఆముక్త మాల్యద)

ఏ పట్టున విసువక ర
క్షాపరుడవు గమ్ము ప్రజల చక్కి విపన్ను
ల్గూపెట్టిన విని తీర్పుము
కాపురుషుల మీద నిడకు కార్యభరంబుల్

భావం: రాజ్యాన్ని పరిపాలించే రాజు ఏ సమయంలోనూ విసుగుతో వేసారకుండా, ప్రజలను రక్షించే భావనతోనే ఉండాలి. ఎవరైనా తాము ఆపదలో ఉన్నామని వచ్చి మొరపెట్టుకుంటే, వారి మాటలను సహృదయంతో ఆలకించి, వారి ఆపదలను తొలగించాలి. గొప్ప గొప్ప పనులు చేయవలసి వచ్చినప్పుడు వాటిని కుత్సితులైనవారికి అప్పగించకూడదు. అలా వారికి అప్పచెప్పడం వలన ఆ గొప్ప పనికి తూట్లు పొడిచి, రాజుకు చెడ్డపేరు తెస్తారని ఆముక్తమాల్యదలో శ్రీకృష్ణదేవరాయలు యామునాచార్యుని నోట ఈ రాజనీతిని పలికించాడు.

ఆలయం ఆగమం-38

వితానం

ఆలయంలో మనం విమానం అనే పేరు చాలా ఎక్కువగా వింటుంటాం. గర్భగుడిపైన ఉండే నిర్మాణాన్ని విమానం లేక విమానగోపురం అని పిలుస్తారు. కానీ వితానం అనే పేరు మనకు అస్సలు పరిచయం ఉండదు. అదేంటంటే మనం ప్రాచీన ఆలయాలకు వెళ్లి దేవుణ్ణి ముఖమండపంలో ఉండి దర్శనం చేసుకుంటాం. హారతి, తీర్థం, ప్రసాదం స్వీకరించి వచ్చేస్తాం. కానీ ఒక్కసారి తలఎత్తి పైకి చూస్తే అద్భుతమైన శిల్పాలు కనువిందు చేస్తాయి. మధ్యలో పద్మం, దానిచుట్టూ విచ్చుకుంటూ వికసించిన పద్మపురేకులు కనిపిస్తాయి. కొన్ని ఆలయాల్లో మధ్యలో దేవుడు ఆయన చుట్టూ ఎనిమిది దిక్కులలో అష్టదిక్పాలకులు కొలువు తీరి ఉంటారు. కర్ణాటకలో బేలూరు, హళేబీడు వంటి ఆలయాలు చూసిన వారికి ఇది పరిచయమే. ప్రతీ మండపానికీ మధ్యలో వితానాలంకారాన్ని నిర్మించవచ్చని అపరాజిత పృచ్ఛ చెప్పింది. అలాగే లూమా అనే మరో రకమైన అలంకరణ కూడా వితానంలో ఉంది. ఈ వితానాలంకారం ప్రాముఖ్యతని వివరిస్తూ ఇల్లాలు లేని ఇ

శనివారం మేడారంలోని సమ్మక్క గద్దె వద్ద భక్తులు సమర్పించిన మొక్కులు

జాతర ముగియడంతో తిరుగు పయనమవుతున్న భక్తులు

జాతీయ హోదాకు కృషి

మేడారం అంశాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్తా..

- కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా హామీ
- జాతర ఏర్పాట్లు బాగున్నాయని కితాబు

సాక్షి, భూపాలపల్లి : మేడారం మహాజాతరకు జాతీయ హోదా కల్పించాలనే అంశం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్తానని కేంద్ర గిరిజనశాఖ మంత్రి అర్జున్‌ముండా తెలిపారు. ములుగు జిల్లాలోని మేడారం శ్రీ సమ్మక్క–సారలమ్మలను శనివారం ఆయన దర్శించుకున్నారు. తులాభారంతో నిలువెత్తు (75 కిలోలు) బంగారాన్ని అమ్మవార్లకు సమర్పించారు. ఈ సందర్భంగా మేడారానికి జాతీయ హోదా కల్పించడంతో పాటు అభివృద్ధికి నిధులు, గురుకులాలు కేటాయించాలని రాష్ట్ర మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, పువ్వాడ అజయ్‌కుమార్, ఇంద్రకరణ్‌రెడ్డి తదితరులు కేంద్ర మంత్రికి విన్నవించారు. దీంతో స్పందించిన ఆయన.. జాతర విశిష్టతను తెలియజేసి జాతీయ హోదా కల్పించే అంశాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. గిరిజనులు ఎంతో కాలంగా కోరుకుంటున్న జాతీయ హోదా దక్కుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. మేడారంలో వనదేవతలను దర్శించుకోవడం ఆనందంగా ఉందని, వచ్చే జాతరకు తప్పకుండా వస్తానని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. గిరిజనులకు ఆస్తులు లేకపోయినా సంతోషంగా బెల్లాన్ని బంగారంగా అమ్మవార్లకు సమర్పించే అంశం గిరిజన పురాతన సంప్రదాయాలకు నిదర్శనమన్నారు. ఆసియాలో అతిపెద్ద గిరిజన జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం కృషి మరువలేనిదని కితాబిచ్చారు. ఆయన వెంట మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, సత్యవతి, ఇంద్రకరణ్ రెడ్డి, ఎమ్మెల్యే సీతక్క ఉన్నారు. కాగా, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ సేవలందించిందని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ అన్నారు. జాతర సమయంలో 36 వేల ట్రిప్పుల ద్వారా 12 లక్షల మందిని గమ్యస్థానాలకు తరలించినట్లు వెల్లడించారు.

శనివారం మేడారంలో సారలమ్మ గద్దెను మొక్కుతున్న కేంద్ర మంత్రి అర్జున్ ముండా

దీవించు తల్లీ..!

శనివారం మేడారంలోని సారలమ్మ గద్దెను మొక్కుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి. చిత్రంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

సమ్మక్క గద్దె వద్ద చీర సమర్పిస్తున్న మండలి చైర్మన్ 'గుత్తా'

సమ్మక్క గద్దెను మొక్కుతున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్

సమ్మక్క గద్దెను మొక్కుతున్న డీజీపీ మహేందర్ రెడ్డి

శనివారం సాయంత్రం అకాల వర్షంతో వ్యాపార సముదాయాల్లోకి చేరిన నీరు

కురిసిన మేఘం.. ఆగమాగం

మేడారంలో గంటన్నర పాటు భారీ వర్షం

- తడిసి ముద్దయిన భక్తులు
- వ్యాపార సముదాయాల్లోకి చేరిన నీరు
- బురదలో దిగబడిన వాహనాలు
- ట్రాఫిక్‌జాంతో నరకయాతన

ఏటూరునాగారం /మంగపేట: శ్రీ సమ్మక్క – సారలమ్మ మహా జాతర చివరి రోజైన శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గంటన్నర పాటు కురిసిన వర్షం వల్ల మేడారంలోని రోడ్లు, పరిసర ప్రాంతాలు బురదమయంగా మారాయి. భక్తులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు తడుచుకుంటూనే అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రతి జాతర సమయంలో చిరుజల్లు పడటం ఆనవాయితీ. ఈ సారి వనదేవతలు గద్దెలపై ఉన్న క్రమంలో వర్షం కురవడం శుభసూచికంగా భక్తులు భావిస్తున్నారు. అకాల వర్షం పడటం వల్ల భక్తులు తడిబట్టలతో దర్శనం చేసుకుని తన్మయత్వం పొందారు.

తిరుగు పయనం కష్టాలు

అకాల వర్షంతో మేడారం తిరుగు ప్రయాణంలో భక్తులకు వర్షం కష్టాలు ఎదురయ్యాయి. ఆర్టీసీ బస్టాండ్, పలు చోట్ల ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాల్లో నిలిపి వేసిన వాహనాలు దిగబడటంతో వాటిని బయటకు తీసేందుకు భక్తులు పడ రాని పాట్లు పడ్డారు. మేడారం సమ్మక్క గుడి ప్రాంతంలో ఉన్న ఖాళీ ప్రదేశంలో నిలిపి ఉన్న వాహనాలు దిగబడగా.. వీవీఐపీ, వీఐపీ వాహనాలు రెండు గంటల పాటు ఇరుక్కుపోయాయి. అలాగే మేడారం నుంచి తిరుగు ప్రయాణంలో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనాల్లో వెళ్తున్న భక్తులు సైతం ఇబ్బందులకు గురయ్యారు. ఊరట్టం స్తూపం నుంచి పస్రా వెళ్లే దారిలో వాహనాలు నిలిచిపోయాయి. మేడారం లోని పలు ప్రాంతాల నుంచి వచ్చే రోడ్ల నుంచి కూడా వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో రెడ్డిగూడెం వెళ్లే గ్రామ పంచాయతీ కార్యాలయం మూల మలుపు వద్ద రెడ్డిగూడెం వైపు నుంచి వచ్చే వాహనాలు ఇరుక్కుపోవడంతో ట్రాఫిక్ జాం ఏర్పడింది.

దుర్వాసన

శనివారం కురిసిన వర్షంతో మేడారం పరిసరాల్లో దుర్వాసన మొదలైంది. జాతరలో భక్తులు వదిలేసిన తిను బండారాలు, పేరుకుపోయిన చెత్తాచెదారం, కోళ్లు, మేకల వ్యర్థాలతో పాటు, తాత్కాలిక మరుగుదొడ్ల వలన దుర్వాసన వస్తోంది. అధికారులు స్పందించి యుద్ధ ప్రాతిపదికన క్లోరినేషన్ పనులు చేపట్టకపోతే స్థానికులు ఇబ్బంది పడే అవకాశాలు ఉన్నాయి.

ప్రపంచ దృష్టిని ఆకర్షించేలా..

మేడారం అభివృద్ధి: ఎమ్మెల్యే సీతక్క

ములుగు: మేడారం జాతర ప్రపంచ దృష్టిని ఆకర్షించేలా మరింత అభివృద్ధి చేయాలని ములుగు ఎమ్మెల్యే ధనసరి సీతక్క అన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఆదివాసీ బిడ్డగా.. రెండు సార్లు ఎమ్మెల్యేగా జాతర నిర్వహణలో పాల్గొనడం తన అదృష్టమని పేర్కొన్నారు. వచ్చే 2022 మహా జాతరలో ఈ సారి ఎదురైన సమస్యలను గుర్తించి మరిన్ని సౌకర్యాలు కల్పించే విధంగా ప్రభుత్వం సహకరించాలని కోరారు. మొదటి రెండు రోజులు జంపన్న వాగు వద్ద నీరు లేక భక్తులు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. నిధుల వినియోగ విషయంలో అన్ని వర్గాల ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి అభిప్రాయాలను సేకరిస్తే బాగుండేదని అభిప్రాయపడ్డారు. భవిష్యత్‌లో భక్తులు ఎలాంటి ఇబ్బంది పడకుండా ఉండాలంటే బడ్జెట్ ప్రణాళికలో మార్పు రావాలని ఆమె అభిప్రాయపడ్డారు.

విజయవంతం

జాతర పునరుద్ధరణ కమిటీ చైర్మన్ రామ్మూర్తి

ఎస్ఎస్‌తాడ్వాయి: సమ్మక్క – సారలమ్మ జాతర విజయవంతానికి జిల్లా అధికార యంత్రాంగం కృషి చేసిందని జాతర పునరుద్ధరణ కమిటీ చైర్మన్ ఆలం రామ్మూర్తి తెలిపారు. శనివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు జరిగిన జాతరలో అధికారులు భక్తులకు ఎనలేని సేవలందించారని చెప్పారు. జాతర విజయవంతంగా ముగియడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. జాతరలో కోటి మంది భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ప్రభుత్వం చేసిందని, మేడారంలో శాశ్వతంగా అభివృద్ధి పనుల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని సీఎంకు వినతిపత్రం అందించామని చెప్పారు.

సంతోషంగా ఉంది

పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు

ఎస్ఎస్ తాడ్వాయి: అందరి సహకారంతో జాతర విజయవంతమైందని శ్రీ సమ్మక్క– సారలమ్మ పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు అన్నారు. జాతరలో నాలుగు రోజుల పాటు జిల్లా అధికార యంత్రాంగం, పోలీసులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కృషి చేశారని కితాబిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించే సౌకర్యాలు చాలా ఉపయోగపడ్డాయని వివరించారు. భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడి ఉన్నా.. ఎలాంటి ఘటలు కూడా జరగకుండా దేవాదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారని పేర్కొన్నారు.

1.30 కోట్ల మంది దర్శనం

ఈఓ రాజేంద్రం వెల్లడి

ఎస్ఎస్‌తాడ్వాయి: శ్రీ సమ్మక్క– సారలమ్మలను కోటి 30 లక్షల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఈఓ రాజేంద్రం తెలిపారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా అధికార యంత్రాంగం కృషి చేసిందని చెప్పారు. జాతర విజయవంతం చేయడంలో ప్రభుత్వం కృషి ఎంతో ఉందన్నారు. అమ్మవారి ప్రసాదం (బంగారం, బెల్లం)ను వాలంటీర్ల ద్వారా లక్షల మంది భక్తులకు అందించామని వివరించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వీఐపీ, వీవీఐపీలకు ప్రొటోకాల్ ప్రకారం అమ్మవార్ల దర్శనం కల్పించామని పేర్కొన్నారు.

10.57 లక్షల మంది చేరవేత

భక్తులకు ఆర్టీసీ విస్తృత సేవలు

హన్మకొండ : మేడారం మహాజాతరలో ఆర్టీసీ విస్తృతమైన సేవలు అందించింది. భక్తులను చేరవేయడానికి ప్రత్యేక బస్సులు సమకూర్చుకోవడంతో పాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టింది.4 వేల బస్సుల ద్వారా రవాణా సౌకర్యం కల్పించి ఈ నెల 2 నుంచి శనివారం రాత్రి 8 గంటల వరకు 10,57,757 మంది భక్తులను గమ్యస్థానాలకు చేరవేసింది. 17,575 ట్రిప్పుల ద్వారా 52 ప్రత్యేక బస్ స్టేషన్‌ల నుంచి 5,42,145 మంది భక్తులను మేడారానికి, 17,600 ట్రిప్పుల ద్వారా మేడారం నుంచి ఆయా గమ్యస్థానాలకు 5,15,612 మంది భక్తులను చేరవేశారు. శనివారం 1900 ట్రిప్పుల ద్వారా మేడారానికి 27,621 మంది భక్తులను.. తిరుగు ప్రయాణంలో 2,650 ట్రిప్పుల ద్వారా 1,05,273 మంది భక్తులను చేరవేసింది.

విద్యుదాఘాతంతో భక్తురాలి మృతి

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారంలో కరీంనగర్ జిల్లా దురిశేడు గ్రామానికి చెందిన గంధం లక్ష్మి (37) విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందింది. భర్త శ్రీనివాస్‌తో కలసి లక్ష్మి శనివారం మేడారానికి వచ్చి వనదేవతలను దర్శించుకున్నారు. ఆ తర్వాత సరదాగా గడిపేందుకు జాయింట్ వీల్ ఉన్న ప్రాంతానికి వెళ్లారు. అదే క్రమంలో వర్షం కురవడంతో విద్యుత్ సరఫరా అవుతున్న వైర్ ప్రమాదవశాత్తు తెగి పడింది. ఆ సమయంలో అక్కడ ఉన్న లక్ష్మికి షాక్ తగలడంతో ఆమెను 108లో మేడారంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే క్రమంలోనే మృతి చెందింది.

నా హయాంలోనే జంపన్నవాగుపై వంతెన

సాక్షి ప్రతినిధి, వరంగల్: మేడారంలోని జంపన్నవాగుపై వంతెన నిర్మాణం అప్పట్లో కీలకం. ఓ వైపు నక్సలైట్ల ప్రభావం.. మరోవైపు నిర్మాణానికి ముందుకు రాని కాంట్రాక్టర్లు.. వెరసి జాతరకు వచ్చే భక్తులకు రవాణా సౌకర్యం ఆటంకంగా ఉండేది. 2002లో ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్ కొప్పోలు ప్రభాకర్‌రెడ్డి ఈ అంశాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ప్రధాన డిమాండ్‌గా ఉన్న జంపన్నవాగుపై వంతెన నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం నిధులు ఇవ్వకున్నా.. హుండీ డబ్బులతో కాంట్రాక్టర్ కేతిరి సుదర్శన్ రెడ్డితో 37 రోజుల్లో నిర్మించి రికార్డు సృష్టించారు. ప్రభాకర్‌రెడ్డి శనివారం సమ్మక్క – సారలమ్మల దర్శనానికి వచ్చారు. 'జంపన్నవాగుపై నా హయాంలో వంతెన నిర్మాణం జరగడం అదృష్టం.. తల్లుల దర్శనం కోసం ప్రతీ జాతరకు వస్తుంటా'అని చెప్పారు. శనివారం కొప్పుల ప్రభాకర్‌రెడ్డి 'సాక్షి ప్రతినిధి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

మావోయిస్టులు బెదిరించినా 37 రోజుల్లో కట్టించా..

- అప్పటి ప్రభుత్వం నిధులివ్వకున్నా.. హుండీ డబ్బులతో నిర్మాణం
- 2002లో తల్లిని తీసుకొచ్చే క్రమంలో నేనే తుపాకీ పేల్చేవాడిని..
- తల్లుల దర్శనం కోసం ప్రతి జాతరకు వస్తా..
- 'సాక్షి'తో వరంగల్ మాజీ కలెక్టర్ కొప్పోలు ప్రభాకర్‌రెడ్డి

జాతరలో చాలా మార్పులు

2002తో పోలిస్తే మేడారం జాతరలో చాలా మార్పులు వచ్చాయి. ఒకప్పుడు నక్సలైట్ ప్రాబల్యం ఎక్కువగా ఉండేది. దీంతో జాతరకు భక్తులు అంతగా వచ్చే వాళ్లు కాదు.సెల్ ఫోన్లు లేవు.. కేవలం వైర్‌లెస్ సెట్ల ద్వారా సమాచారం తెలుసుకోవడం, ఇవ్వడం ఉండేది. కేవలం చుట్టు ప్రక్కల వాళ్లు మాత్రమే ట్రాక్టర్లు, బండ్ల సాయంతో మూడు రోజులే వచ్చేవారు. ప్రస్తుతం ప్రతి ఆదివారం 5 లక్షల మంది భక్తులు రావడం సంతోషంగా ఉంది.

37 రోజుల్లో నిర్మాణం చేశాం

జంపన్నవాగుపై వంతెన నిర్మాణం ఏళ్ల తరబడి ప్రజల డిమాండ్‌గా ఉంది. కలెక్టర్‌గా నేను విధులు నిర్వహిస్తున్న కాలంలో.. భక్తులు ఇబ్బంది పడకూడదని మంచి పేరున్న కాంట్రాక్టర్ కేతిరి సుదర్శన్‌రెడ్డితో వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేయాలని నిర్ణయించాం. అయితే, కట్టొద్దని మావోయిస్టులు అడ్డుకున్నారు. నిర్మాణానికి ఉపయోగించే ప్రొక్లెయిన్‌ను దగ్ధం చేశారు. కానీ స్థానిక మహిళలు మాత్రం వంతెన అవసరమని, తమ పిల్లల స్కూళ్లకు వెళ్లాలన్నా, అత్యవసర సమయంలో ఆసుపత్రికి వెళ్లాలన్నా నిర్మాణం జరగాల్సిందేనని డిమాండ్‌ను బలంగా వినిపించారు. మావోయిస్టులు పనులను అడ్డుకోకుండా సైట్ చుట్టూ వంతుల వారీగా పడుకున్నారు. ఎవరైనా వస్తే మమ్మల్ని చంపేసిన తర్వాత వంతెన దగ్గరకు పొండి అని చెబుతామని ధైర్యసాహసాలు ప్రదర్శించారు. వారి సహకారంతో కేవలం 37 రోజుల్లో వంతెన నిర్మాణం పూర్తి చేశాం. జంపన్నవాగుపై వంతెన నిర్మించిన తర్వాత పబ్లిసిటీ బాగా పెరిగి. సీఎం, పీఎంలు కూడా వచ్చారు. దాని వల్ల మాకు, కాంట్రాక్టర్‌కు, ప్రభుత్వానికి మంచి పేరు వచ్చింది. అంతకు ముందు ఒక్క బస్సు కూడా లేని ఈ రూట్‌కి ఆర్టీసీ వారు ఆరు బస్సులు వేశారు.

కలెక్టర్‌గా తుపాకీ పేల్చేవాడిని..

ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్‌గా ఉన్న సమయంలో చిలకలగుట్ట నుంచి అధికారులతో కలసి సమ్మక్క తల్లిని తీసుకొచ్చే ప్రక్రియలో పాలు పంచుకునే వాడిని. అప్పుడు నేనే గన్ పేల్చేవాన్ని. వంతెన నిర్మాణం, తల్లిని గద్దెల మీదకు తీసుకొచ్చే అవకాశం నా అదృష్టంగా భావిస్తా. అందుకే ఇక్కడి నుంచి వెళ్లిన తర్వాత కూడా ప్రతిసారి జాతరకు వస్తున్నా. ప్రతి జాతరకు భక్తుల సంఖ్య పెరుగుతుండటం చూసి గర్వంగా అనిపిస్తుంది.

సాక్షి స్పోర్ట్స్
ఆదివారం
9-2-2020

పుల్లెల గోపీచంద్‌కు ఐఓసీ జీవిత సాఫల్య పురస్కారం

భారత బ్యాడ్మింటన్‌కు కోచ్‌గా విశేష సేవలందిస్తోన్న జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్, తెలుగు తేజం పుల్లెల గోపీచంద్‌కు ప్రతిష్టాత్మక అవార్డు దక్కింది. కోచ్‌ల విభాగంలో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) జీవిత సాఫల్య పురస్కారానికి గోపీచంద్ ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని ఐఓసీ అథ్లెట్స్ కమిషన్ ప్రకటించింది. 'భారత బ్యాడ్మింటన్‌కు ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా 2019గానూ పురుషుల కోచ్‌ల విభాగంలో పుల్లెల గోపీచంద్‌కు ప్రతిష్టాత్మక ఐఓసీ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారాన్ని అందజేస్తున్నాం' అని పేర్కొంది.

మ్యాచ్‌తో పాటు సిరీస్ కూడా...

అద్భుత రీతిలో న్యూజిలాండ్‌పై టి20 సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన భారత్ వన్డే సిరీస్‌లో తలవంచింది. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఓడి సిరీస్‌ను సమర్పించుకుంది. ఇటీవలి కాలంలో ఎన్నడూ లేని విధంగా బ్యాటింగ్ వైఫల్యం భారత్‌ను దెబ్బ తీసింది. కివీస్ జట్టు భిన్న ఆటగాళ్ల సమష్టి ప్రదర్శనతో ఆధిక్యం ప్రదర్శించి ఊపిరి పీల్చుకుంది. ఛేదనలో శ్రేయస్ అయ్యర్, జడేజా, సైనీ చేసిన పోరాటం టీమిండియా మ్యాచ్ గెలిచేందుకు సరిపోలేదు.

- రెండో వన్డేలో భారత్ పరాజయం
- 22 పరుగుల తేడాతో న్యూజిలాండ్ గెలుపు
- 2-0తో సిరీస్ సొంతం
- కివీస్ సమష్టి ప్రదర్శన
- మంగళవారం చివరి వన్డే

సౌతీ బౌలింగ్‌లో భారత కెప్టెన్ కోహ్లి బౌల్డ్

జట్టులోని రిజర్వ్ ఆటగాళ్లంతా అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ అసిస్టెంట్ కోచ్ ల్యూక్ రోంచీ బరిలోకి దిగి ఫీల్డింగ్ చేయడం విశేషం. రోంచీ కివీస్ తరఫున 2017లో చివరి మ్యాచ్ ఆడాడు. అయితే ఒక కోచ్ జట్టు సభ్యుడిగా మైదానంలోని వ్యూహాల్లో భాగం కావడం విమర్శకు దారి తీసిన మరో కోణం.

ఆక్లాండ్: సొంతగడ్డపై న్యూజిలాండ్‌కు ఊరట దక్కింది. భారత్‌తో శనివారం జరిగిన రెండో వన్డేలో 22 పరుగులతో గెలిచిన కివీస్ మూడు వన్డేల సిరీస్‌ను 2-0తో సొంతం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 273 పరుగులు చేసింది. మార్టిన్ గప్టిల్ (79 బంతుల్లో 79; 8 ఫోర్లు, 3 సిక్సర్లు), రాస్ టేలర్ (74 బంతుల్లో 73 నాటౌట్; 6 ఫోర్లు, 2 సిక్సర్లు) అర్ధసెంచరీలు సాధించారు. అనంతరం భారత్ 48.3 ఓవర్లలో 251 పరుగులకే ఆలౌటైంది. రవీంద్ర జడేజా (73 బంతుల్లో 55; 2 ఫోర్లు, 1 సిక్స్), శ్రేయస్ అయ్యర్ (57 బంతుల్లో 52; 7 ఫోర్లు, 1 సిక్స్), నవదీప్ సైనీ (49 బంతుల్లో 45; 5 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించారు. 6 అడుగుల 8 అంగుళాల పొడగరి, ఈ మ్యాచ్‌తోనే అరంగేట్రం చేసిన కివీస్ బౌలర్ కైల్ జేమీసన్ తన ఆల్‌రౌండ్ ప్రదర్శనకుగాను 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. చివరి వన్డే మంగళవారం మౌంట్ మాంగనీలో జరుగుతుంది.

గ్రాండ్‌హోమ్, లాథమ్, జేమీసన్

రాణించిన ఓపెనర్లు...

న్యూజిలాండ్‌కు మరోసారి ఓపెనర్లు శుభారంభం అందించారు. ఈసారి పరుగుల వేటలో గప్టిల్ ముందుండగా, నికోల్స్ (59 బంతుల్లో 41; 5 ఫోర్లు) సహకరించాడు. బుమ్రా వేసిన ఎనిమిదో ఓవర్లో గప్టిల్ 2 ఫోర్లు, సిక్స్ బాదడం విశేషం. తొలి పవర్‌ప్లే ముగిసేసరికి కివీస్ 52 పరుగులు చేసింది. ఈ భాగస్వామ్యం శతకానికి చేరువవుతున్న దశలో నికోల్స్‌ను ఎల్బీగా అవుట్ చేసి చహల్ తొలి వికెట్ అందించాడు. నికోల్స్ రివ్యూ కోరినా లాభం లేకపోయింది. మరోవైపు 15 సెకన్ల సమయం ముగిసిన తర్వాత కూడా నికోల్స్‌ను అంపైర్ రివ్యూకు అనుమతించడంపై కోహ్లి నిరసన వ్యక్తం చేశాడు. అనంతరం 49 బంతుల్లో గప్టిల్ అర్ధ సెంచరీ పూర్తయింది.

టపటపా...

చక్కటి ఆరంభం తర్వాత కివీస్ బ్యాటింగ్ ఒక్కసారిగా తడబడింది. భారత బౌలర్ల ధాటికి ఆ జట్టు వరుస వికెట్లు కోల్పోయింది. బ్లన్‌డెల్ (22)ను శార్దుల్ అవుట్ చేయడంతో పతనం మొదలైంది. ఒక దశలో 55 పరుగుల వ్యవధిలో ఆ జట్టు 7 వికెట్లు చేజార్చుకుంది.

ఆదుకున్న టేలర్...

ఈ దశలో మరోసారి రాస్ టేలర్ కీలక ఇన్నింగ్స్ ఆడగా... కైల్ జేమీసన్ (24 బంతుల్లో 25 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్సర్లు) అతనికి అండగా నిలిచాడు. వీరిద్దరు తొమ్మిదో వికెట్‌కు 51 బంతుల్లోనే అభేద్యంగా 76 పరుగులు జోడించడంతో కివీస్ చెప్పుకోదగ్గ స్కోరు సాధించగలిగింది.

అయ్యర్ మినహా...

మయాంక్ అగర్వాల్ (3) ఆరంభంలోనే వెనుదిరగ్గా, పరుగులు మొత్తం బౌండరీల రూపంలోనే చేసిన పృథ్వీ షా (19 బంతుల్లో 24; 6 ఫోర్లు)ను బౌల్డ్ చేసి జేమీసన్ కెరీర్‌లో తొలి వికెట్ సాధించాడు. అయితే సౌతీ చక్కటి బంతికి కోహ్లి (15) కూడా బౌల్డ్ కావడంతో భారత శిబిరంలో ఆందోళన పెరిగింది. అద్భుతమైన ఫామ్‌లో ఉన్న లోకేశ్ రాహుల్ (4) అనూహ్యంగా విఫలం కాగా, కేదార్ జాదవ్ (27 బంతుల్లో 9) బంతులను వృథా చేశాడు. మరో ఎండ్‌లో అయ్యర్ మాత్రం కొన్ని చక్కటి షాట్లతో పోరాటం కొనసాగించాడు. 56 బంతుల్లో అతను అర్ధ సెంచరీ సాధించాడు. అయితే అయ్యర్‌తో పాటు శార్దుల్ (15 బంతుల్లో 18; 3 ఫోర్లు)ను కూడా తక్కువ వ్యవధిలో పెవిలియన్ పంపించి కివీస్ పట్టు బిగించింది.

అయ్యర్

జడేజా

కీలక భాగస్వామ్యం...

153/7 స్కోరుతో భారత్ 32వ ఓవర్లోనే ఓటమికి సిద్ధమైనట్లు కనిపించింది. ఈ దశలో జడేజా, సైనీ కలిసి గెలిపించే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా పేసర్ సైనీ బ్యాటింగ్ ఆకట్టుకుంది. గ్రాండ్‌హోమ్ ఓవర్లో మూడు ఫోర్లు కొట్టిన అనంతరం జేమీసన్ బౌలింగ్‌లో ఎక్స్‌ట్రా కవర్ మీదుగా అతను కొట్టిన సిక్సర్ హైలైట్‌గా నిలిచింది. 34 బంతుల్లో మరో 45 పరుగులు చేయాల్సిన స్థితిలో సైనీ బౌల్డ్ కావడం భారత్ విజయావకాశాలను దెబ్బ తీసింది. వీరిద్దరు ఎనిమిదో వికెట్‌కు 80 బంతుల్లో 76 పరుగులు జత చేశారు.

స్కోరు వివరాలు

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: గప్టిల్ (రనౌట్) 79; నికోల్స్ (ఎల్బీ) (బి) చహల్ 41; బ్లన్‌డెల్ (సి) సైనీ (బి) శార్దుల్ 22; టేలర్ (నాటౌట్) 73; లాథమ్ (ఎల్బీ) (బి) జడేజా 7; నీషమ్ (రనౌట్) 3; గ్రాండ్‌హోమ్ (సి) అయ్యర్ (బి) శార్దుల్ 5; చాప్‌మన్ (సి అండ్ బి) చహల్ 1; సౌతీ (సి) సైనీ (బి) చహల్ 3; జేమీసన్ (నాటౌట్) 25; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 273.**

వికెట్ల పతనం: 1-93; 2-142; 3-157; 4-171; 5-175; 6-185; 7-187; 8-197.

బౌలింగ్: శార్దుల్ 10-1-60-2; బుమ్రా 10-0-64-0; సైనీ 10-0-48-0; చహల్ 10-0-58-3; జడేజా 10-0-35-1.

భారత్ ఇన్నింగ్స్: పృథ్వీ షా (బి) జేమీసన్ 24; మయాంక్ (సి) టేలర్ (బి) బెన్నెట్ 3; కోహ్లి (బి) సౌతీ 15; అయ్యర్ (సి) లాథమ్ (బి) బెన్నెట్ 52; రాహుల్ (బి) గ్రాండ్‌హోమ్ 4; జాదవ్ (సి) నికోల్స్ (బి) సౌతీ 9; జడేజా (సి) గ్రాండ్‌హోమ్ (బి) నీషమ్ 55; శార్దుల్ (బి) గ్రాండ్‌హోమ్ 18; సైనీ (బి) జేమీసన్ 45; చహల్ (రనౌట్) 10; బుమ్రా (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 16; **మొత్తం (48.3 ఓవర్లలో ఆలౌట్) 251.**

వికెట్ల పతనం: 1-21; 2-34; 3-57; 4-71; 5-96; 6-129; 7-153; 8-229; 9-251; 10-251. **బౌలింగ్:** బెన్నెట్ 9-0-58-2; సౌతీ 10-1-41-2; జేమీసన్ 10-1-42-2; గ్రాండ్‌హోమ్ 10-1-54-2; నీషమ్ 9.3-0-52-1.

'యువ' భారత్ మళ్లీ సాధిస్తుందా!

నాలుగు సార్లు ఇప్పటికే విజేతగా నిలిచిన జట్టు ఒకవైపు... ఇంతకుముందు ఏ స్థాయిలో కూడా ప్రపంచకప్‌లో కనీసం ఫైనల్‌కు చేరుకోని జట్టు మరోవైపు... టోర్నీలో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా అజేయంగా నిలిచిన రెండు టీమ్‌లు... ప్రస్తుతం బలాబలాలపరంగా చూస్తే దాదాపుగా సమ ఉజ్జీలు... ఈ నేపథ్యంలో భారత్, బంగ్లాదేశ్ మధ్య అండర్-19 ప్రపంచకప్ ఫైనల్‌కు రంగం సిద్ధమైంది. నేడు జరిగే ఈ ఆసియా జట్ల పోరులో చాంపియన్ ఎవరనేది కొన్ని గంటల్లో తేలిపోతుంది.

- నేడు అండర్-19 ప్రపంచ కప్ ఫైనల్
- బంగ్లాదేశ్‌తో భారత్ ఢీ
- సమ ఉజ్జీలుగా రెండు జట్లు
- మధ్యాహ్నం గం.1.30 నుంచి స్టార్ స్పోర్ట్స్-3లో ప్రత్యక్ష ప్రసారం

అక్బర్ అలీ, ప్రియమ్ గార్గ్

పాచెఫ్‌స్ట్రూమ్ (దక్షిణాఫ్రికా): 16 యువ జట్లు పాల్గొన్న అండర్-19 ప్రపంచ కప్ తుది సమరానికి సమయం వచ్చేసింది. నేడు జరిగే ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ భారత్‌తో తొలిసారి ఫైనల్ చేరిన బంగ్లాదేశ్ తలపడనుంది. తమ టైటిల్ నిలబెట్టుకునేందుకు టీమిండియా బరిలోకి దిగుతుండగా, ఈ సువర్ణావకాశాన్ని వదులుకోరాదని బంగ్లాదేశ్ పట్టుదలగా ఉంది. ఫైనల్ మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉంది. ఆదివారం ఇక్కడ భారీగా వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఇప్పటికే ప్రకటించింది. అయితే ఐసీసీ సోమవారాన్ని 'రిజర్వ్ డే'గా పెట్టింది. ఆ రోజూ మ్యాచ్ సాధ్యం కాకపోతే ఇరు జట్లను సంయుక్త విజేతలుగా ప్రకటిస్తారు.

పోటాపోటీ...

లీగ్ దశలో ఇరు జట్లూ అజేయంగా నిలిచాయి. ఆ తర్వాత నాకౌట్ మ్యాచ్‌లలో ఆస్ట్రేలియా, పాకిస్తాన్‌లను భారత్ ఓడిస్తే... దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్‌లను బంగ్లాదేశ్ చిత్తు చేసింది. భారత్ తరఫున యశస్వి జైస్వాల్ పరుగుల వరద పారిస్తే బంగ్లా జట్టు నుంచి తన్‌జీద్ హసన్ బ్యాటింగ్‌లో చెలరేగుతున్నాడు. కార్తీక్ త్యాగి, సుశాంత్ మిశ్రాలతో మన పేస్ దళం పదునుగా కనిపిస్తుంటే అటువైపు నుంచి తన్‌జీమ్ హసన్, షరీఫుల్ ఇస్లామ్ తమ పేస్ పదును చూపించేందుకు సిద్ధంగా ఉన్నారు. వికెట్ల పండగ చేసుకున్న భారత లెగ్‌స్పిన్నర్ రవి బిష్ణోయ్‌కి పోటీగా రకీబుల్ హసన్ తన స్పిన్‌తో ప్రత్యర్థి ని పడగొట్టాలని భావిస్తున్నాడు. ఇలాంటి స్థితిలో ఫైనల్ హోరాహోరీగా సాగడం ఖాయం. రెండు జట్లు కూడా మార్పుల్లేకుండా సెమీస్‌లో ఆడిన టీమ్‌లతోనే బరిలోకి దిగే అవకాశం ఉంది.

- 2018 ప్రపంచ కప్‌లో ఇరు జట్లు క్వార్టర్ ఫైనల్లో తలపడ్డాయి. నాడు భారత్ 131 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.
- గత ప్రపంచ కప్ తర్వాత భారత్, బంగ్లాదేశ్ జట్లు అండర్-19 విభాగంలో 7 సార్లు తలపడ్డాయి. ఇందులో 2 మ్యాచ్‌లు వర్షంతో రద్దు కాగా... మిగిలిన ఐదు మ్యాచ్‌లలో 4 గెలిచిన భారత్ 4-1తో ఆధిక్యంలో ఉంది. 2018 ఆసియా కప్ సెమీఫైనల్లో, 2019 ఆసియా కప్ ఫైనల్లో భారత్‌నే విజయం వరించింది. గత ఏడాది ఇంగ్లండ్‌లో జరిగిన పోరులో బంగ్లాదేశ్ 2 వికెట్లతో భారత్‌ను ఓడించింది.

మెరిసిన షఫాలీ వర్మ, స్మృతి

ఆస్ట్రేలియాపై ఏడు వికెట్లతో నెగ్గిన భారత మహిళల జట్టు

షఫాలీ, స్మృతి

మెల్‌బోర్న్: ఫైనల్ ఆశలు సజీవంగా ఉండాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో భారత మహిళల జట్టు అదరగొట్టింది. ముక్కోణపు టి20 క్రికెట్ టోర్నీలో భాగంగా శనివారం ఆస్ట్రేలియా జట్టుతో జరిగిన లీగ్ మ్యాచ్‌లో భారత జట్టు ఏడు వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. తొలుత ఆసీస్ 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 173 పరుగులు చేసింది. యాష్లే గార్డెనర్ (57 బంతుల్లో 93; 11 ఫోర్లు, 3 సిక్స్‌లు) త్రుటిలో సెంచరీ చేజార్చుకుంది. భారత బౌలర్లలో దీప్తి శర్మ రెండు వికెట్లు తీయగా... రాజేశ్వరి గైక్వాడ్, రాధా యాదవ్, హర్లీన్ డియోల్‌లకు ఒక్కో వికెట్ లభించింది. 174 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ 19.4 ఓవర్లలో మూడు వికెట్లకు 177 పరుగులు చేసి అద్భుత విజయం సాధించింది. ఓపెనర్లు షఫాలీ వర్మ (28 బంతుల్లో 49; 8 ఫోర్లు, సిక్స్), స్మృతి మంధాన (48 బంతుల్లో 55; 8 ఫోర్లు) తొలి వికెట్‌కు 8.2 ఓవర్లలో 85 పరుగులు జోడించి శుభారంభం ఇచ్చారు. అనంతరం జెమీమా రోడ్రిగ్స్ (19 బంతుల్లో 30; 5 ఫోర్లు), హర్మన్ ప్రీత్ కౌర్ (20 బంతుల్లో 20 నాటౌట్; సిక్స్), దీప్తి శర్మ (4 బంతుల్లో 11 నాటౌట్; 2 ఫోర్లు) కూడా ధాటిగా ఆడటంతో భారత్ రెండు బంతులు మిగిలి ఉండగానే విజయాన్ని దక్కించుకుంది. టి20ల్లో భారత్‌కిదే అత్యుత్తమ ఛేజింగ్ కావడం విశేషం.

ప్రసాద్‌కు రజతం

బుడాపెస్ట్ (హంగేరి): బోక్స్కాయ్ అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆంధ్రప్రదేశ్ బాక్సర్ పొలిపల్లి లలితా ప్రసాద్ రజత పతకం సాధించాడు. పురుషుల 52 కేజీల ఫైనల్లో వైజాగ్‌కు చెందిన 25 ఏళ్ల ప్రసాద్ 0-5తో సబీర్‌ఖాన్ మఖ్‌మూద్ (కజకిస్తాన్) చేతిలో ఓడిపోయాడు. భారత్‌కే చెందిన జ్యోతి (51 కేజీలు), మనీషా (57 కేజీలు), గౌరవ్ (91 కేజీలు) రజత పతకాలు నెగ్గారు. ఫైనల్స్‌లో జ్యోతి 2-3తో స్వెత్లానా (రష్యా) చేతిలో... మనీషా 0-5తో లుద్మిలా (రష్యా) చేతిలో... గౌరవ్ 0-4తో ఒరాల్‌బే (కజకిస్తాన్) చేతిలో ఓడారు. సెమీస్‌లో ఓడిన సచిన్ సివాచ్ (57 కేజీలు)కు కాంస్యం దక్కింది.

ప్రపంచ చాంపియన్‌కు భారత్ షాక్

ప్రొ హాకీ లీగ్ మ్యాచ్‌లో బెల్జియంపై 2-1తో విజయం

భువనేశ్వర్: అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రొ హాకీ లీగ్‌లో భారత పురుషుల జట్టు తమ జోరు కొనసాగిస్తోంది. నెదర్లాండ్స్‌తో తొలి రౌండ్ రెండు మ్యాచ్‌ల్లో నెగ్గిన టీమిండియా... ప్రపంచ చాంపియన్ బెల్జియంతో శనివారం రెండో రౌండ్ తొలి మ్యాచ్‌లో 2-1తో సంచలన విజయం సాధించింది. ఆట రెండో నిమిషంలో మన్‌దీప్ సింగ్ గోల్‌తో భారత్ ఖాతా తెరిచింది. 39వ నిమిషంలో బొకార్డ్ గోల్‌తో బెల్జియం స్కోరును సమం చేసింది. ఆ తర్వాత 47వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను రమణ్‌దీప్ సింగ్ గోల్‌గా మలచడంతో భారత్ 2-1తో ఆధిక్యంలోకి వచ్చింది. ఆ తర్వాత ఈ ఆధిక్యాన్ని కాపాడుకున్న భారత్ విజయాన్ని ఖాయం చేసుకుంది. నేడు ఇదే వేదికపై ఈ రెండు జట్లు మళ్లీ తలపడతాయి.

51,954 మంది ప్రేక్షకులు...

కేప్‌టౌన్: ఆఫ్రికా దేశాల్లోని చిన్నారుల విద్యా, క్రీడాభివృద్ధి కోసం స్విట్జర్లాండ్ టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెడరర్ ఫౌండేషన్ 'మ్యాచ్ ఇన్ ఆఫ్రికా' పేరిట ఫెడరర్, స్పెయిన్ స్టార్ రాఫెల్ నాదల్ మధ్య దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్‌లో ఎగ్జిబిషన్ మ్యాచ్ నిర్వహించింది. 2010 ఫుట్‌బాల్ ప్రపంచకప్ ఫైనల్ వేదిక కేప్‌టౌన్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌కు ఏకంగా 51,954 మంది ప్రేక్షకులు హాజరయ్యారు. ఓ టెన్నిస్ మ్యాచ్‌ను ఇంతమంది వీక్షించడం ఇదే ప్రథమం. ఈ మ్యాచ్‌లో ఫెడరర్ 6-4, 3-6, 6-3తో నాదల్‌ను ఓడించాడు. ఈ మ్యాచ్ ద్వారా ఫెడరర్ ఫౌండేషన్ 35 లక్షల డాలర్లను (రూ. 25 కోట్లు) సేకరించడం విశేషం. దక్షిణాఫ్రికాకు చెందిన ఫెడరర్ తల్లి లినెట్టి కూడా ఈ మ్యాచ్‌ను వీక్షించారు. తన 22 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌లో ఏనాడూ ఫెడరర్ దక్షిణాఫ్రికాలో మ్యాచ్ ఆడలేదు. గత నవంబర్‌లో మెక్సికోలో ఫెడరర్, జ్వెరెవ్ (జర్మనీ) మ్యాచ్‌కు 42,517 మంది ప్రేక్షకులు హాజరయ్యారు.

తెలంగాణ ప్రభుత్వం
తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ

TREIS, TSWREIS, TTWREIS, MJPTBCWREIS
గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశమునకై 2020-21 విద్యాసంవత్సరానికి
ఉమ్మడి ప్రవేశ పరీక్ష ప్రకటన

కేజి టు పిజి మిషన్‌లో భాగంగా గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్న విద్యార్థులకు, నాణ్యమైన ఉత్తమ విద్యను అందించడానికి, వారిలో నిబిడీకృతమై ఉన్న ప్రతిభను గుర్తించి, ఆయా రంగాలలో వారిని ప్రోత్సహించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంచే నిర్వహించబడుతున్న సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, వెనుకబడిన తరగతుల సంక్షేమ మరియు విద్యాశాఖల ఆధ్వర్యంలో ఇంగ్లీషు మీడియంలో బోధనతో విజయవంతంగా నడుస్తున్న గురుకుల **పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశమునకై తేది: 12.04.2020 నాడు ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంట వరకు** అన్ని జిల్లా కేంద్రాలలో (ఎంపిక చేయబడిన కేంద్రాలలో) ప్రవేశ పరీక్ష నిర్వహించబడును. అభ్యర్థులు దరఖాస్తులను ఆన్‌లైన్‌లోనే సమర్పించాలి. అన్ని వివరాలకు, ప్రాస్పెక్టస్ కొరకు http://tswreis.in (లేదా) http://tresidential.cgg.gov.in (లేదా) http://tgtwgurukulam.telangana.gov.in (లేదా) http://mjptbcwreis.cgg.gov.in మరియు http://mjptbcwreis.telangana.gov.in (లేదా) http://tgcet.cgg.gov.in లను దర్శించండి.

దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు సూచనలు

1. అభ్యర్థులు తమ అర్హతలను పరిశీలించుకొని తేది: 10.02.2020 నుండి 01.03.2020 వరకు ఆన్‌లైన్‌లో రూ.100/- రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకొనవచ్చును. ఒక ఫోన్ నెంబర్‌తో ఒక దరఖాస్తు మాత్రమే చేయవచ్చును.
2. వేరేవారి ఫోటోలు పెట్టి దరఖాస్తు చేసినచో అట్టివారిపై సెక్షన్ 416 ఆఫ్ IPC 1860 ప్రకారం క్రిమినల్ చర్యలు చేపట్టబడును.
3. ఇతర సమాచారం కొరకు హెల్ప్‌లైన్ నెంబర్ 1800 425 45678ని లేదా ప్రాస్పెక్టస్‌లో పేర్కొన్న సంబంధిత జిల్లా ప్రధానాచార్యులను ఫోన్‌లో సంప్రదించవచ్చును.

Sd/- Dr. R.S. Praveen Kumar, IPS
Secretary TSWREIS &
Chief Convenor, VTG CET-2020

DIPR RO.No.659-PP/CL/Advt/1/2019-20, Dt: 07.02.2020

మన గురుకులాలు - విద్యార్థుల ప్రగతికి సోపానాలు

హంపి శుభారంభం

సెయింట్ లూయిస్ (అమెరికా): కెయిన్స్ కప్ అంతర్జాతీయ మహిళల చెస్ టోర్నమెంట్‌లో భారత నంబర్‌వన్, ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి శుభారంభం చేసింది. యిప్ కరీసా (అమెరికా)తో జరిగిన తొలి రౌండ్ గేమ్‌లో హంపి 40 ఎత్తుల్లో గెలిచింది. ఆంధ్రప్రదేశ్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక 47 ఎత్తుల్లో కాటరీనా లాగ్నో (రష్యా)తో గేమ్‌ను 'డ్రా' చేసుకుంది. మొత్తం పది మంది అగ్రశ్రేణి క్రీడాకారిణుల మధ్య తొమ్మిది రౌండ్‌ల పాటు జరిగే ఈ టోర్నీ ఈనెల 16న ముగుస్తుంది.

ఫైనల్లో బెంగళూరు రాప్టర్స్

సాక్షి, హైదరాబాద్: డిఫెండింగ్ చాంపియన్ బెంగళూరు రాప్టర్స్ వరుసగా రెండో ఏడాది ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్)లో ఫైనల్లోకి దూసుకెళ్లింది. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో శనివారం జరిగిన రెండో సెమీఫైనల్లో బెంగళూరు రాప్టర్స్ 4-3తో పుణే సెవెన్ ఏసెస్ జట్టును ఓడించింది. నేడు జరిగే ఫైనల్లో నార్త్ ఈస్టర్న్ వారియర్స్‌తో బెంగళూరు రాప్టర్స్ అమీతుమీ తేల్చుకుంటుంది. సెమీఫైనల్లో నాలుగు మ్యాచ్‌ల తర్వాత బెంగళూరు, పుణే జట్లు 3-3తో సమంగా నిలిచాయి. మిక్స్‌డ్ డబుల్స్‌గా జరిగిన నిర్ణాయక ఐదో మ్యాచ్‌లో చాన్ పెంగ్ సూన్-ఎమ్ హై వన్ (బెంగళూరు) జంట 15-13, 15-10తో క్రిస్-గాబ్రియేలా (పుణే) జోడీపై గెలిచి రాప్టర్స్ జట్టును ఫైనల్‌కు చేర్చింది. బెంగళూరు తరఫున పురుషుల సింగిల్స్‌లో లెవెర్‌డెజ్ నెగ్గగా... సాయిప్రణీత్ ఓటమి చవిచూశాడు. మహిళల సింగిల్స్‌లో తై జు యింగ్ గెలిచింది.

మసూద్, ఆజమ్ సెంచరీలు

రావల్పిండి: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో పాకిస్తాన్ దీటైన జవాబు ఇచ్చింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి పాకిస్తాన్ తొలి ఇన్నింగ్స్‌లో 87.5 ఓవర్లలో 3 వికెట్లకు 342 పరుగులు చేసింది. 109 పరుగుల ఆధిక్యం సంపాదించింది. ఓపెనర్ షాన్ మసూద్ (160 బంతుల్లో 100; 11 ఫోర్లు), బాబర్ ఆజమ్ (192 బంతుల్లో 143 బ్యాటింగ్) సెంచరీలు చేశారు. ప్రస్తుతం ఆజమ్‌తో పాటు అసద్ షఫీక్ (111 బంతుల్లో 60 బ్యాటింగ్; 8 ఫోర్లు) క్రీజులో ఉన్నాడు.

ఎబోలా...

పుట్టిన ప్రాంతం: ఆఫ్రికా
ఎలా సంక్రమిస్తుంది: గబ్బిలాలు
మరణాల రేటు: 50%

ప్రాణాంతకమైన ఎబోలా వైరస్ డిసీజ్ (ఈవీడీ) జ్వరం, ఒళ్లు నొప్పులు, వాంతులు, విరోచనాలతో మొదలవుతుంది. ఒక్కోసారి శరీరం వెలుపల, లోపల కూడా రక్తస్రావం అవుతుంది. చివరికి బ్రెయిన్ హెమరేజ్‌తో మనిషి ప్రాణాలే పోతాయి. మొట్టమొదటిసారి 1976లో ఆఫ్రికాలో ఈ వైరస్ బట్టబయలైంది. సూడాన్, రిపబ్లిక్ ఆఫ్ కాంగో దేశాల్లో ఒకేసారి వ్యాప్తి చెందిన ఈ వైరస్ ఇంకా ప్రపంచ దేశాలను వణికిస్తూనే ఉంది. ఆఫ్రికాలో ప్రవహించే నది ఎబోలా పేరునే ఈ వైరస్‌కు పెట్టారు. ఫ్రూట్ గబ్బిలాల నుంచి ఈ వైరస్ సంక్రమిస్తుంది. ఆ తర్వాత మనిషి నుంచి మనిషికి విస్తరిస్తుంది. గాయాలు, రక్తం, లాలాజలం ద్వారా ఈ వ్యాధి వ్యాపిస్తుంది. అప్పట్లో ఈ వైరస్ సోకిన వారిలో 90% మంది ప్రాణాలు కోల్పోయారు. 2014-16 మధ్య మళ్లీ ఈ వ్యాధి విజృంభించింది. అయితే మొత్తం కేసుల్లో మరణాల రేటు 50 శాతంగా ఉంది. ఆ రెండేళ్లలోనే దాదాపుగా 12 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. అప్పుడే డబ్ల్యూహెచ్‌ఓ అంతర్జాతీయ ఆరోగ్య అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. ఈ వైరస్‌కు చికిత్స కోసం మందుని కనుక్కొనే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ వైరస్ రాకుండా వ్యాక్సినేషన్ కూడా ప్రయోగాల దశలో ఉంది.



డెంగీ...

పుట్టిన ప్రాంతం: ఫిలిప్పీన్స్, థాయ్‌లాండ్
ఎలా సంక్రమిస్తుంది: దోమలు
మరణాల రేటు: 20%

కొన్ని వందల ఏళ్ల క్రితమే డెంగీ వైరస్ ఆఫ్రికా దేశాలను అతలాకుతలం చేసింది. ఇప్పుడు 20వ శతాబ్దంలో ఈ వైరస్ 1950లో ఫిలిప్పీన్స్, థాయ్‌లాండ్‌లో తొలిసారిగా బయటకి వచ్చింది. అక్కడ్నుంచి ఆసియా పసిఫిక్, కరేబియన్ దేశాలను వణికిస్తోంది. భారత్‌లో కూడా ఈ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంది. ఏడెస్ దోమ కాటుతో ఈ వ్యాధి సంక్రమిస్తుంది. నీళ్లు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఏడెస్ వేగంగా వృద్ధి చెందుతుంది. దీనిని టైగర్ దోమ అని కూడా పిలుస్తారు. ప్రస్తుతం ప్రపంచ జనాభాలో 40 శాతం మంది డెంగీ వ్యాధి ప్రబలే ప్రాంతాల్లో నివసిస్తున్నారు. డబ్ల్యూహెచ్‌ఓ గణాంకాల ప్రకారం ప్రతీ ఏడాది డెంగీ 5 కోట్ల నుంచి 10 కోట్ల మందికి సంక్రమిస్తుంది. వారం రోజులకు పైగా జ్వరంతో మనిషిని పీల్చి పిప్పిచేస్తుంది. ఒక్కోసారి డెంగీ జ్వరం తీవ్రత ఎక్కువై బ్రెయిన్ హెమరేజ్ వచ్చి ప్రాణాలు కోల్పోతారు. ఇలా మృతి చెందేవారు ప్రపంచ దేశాల్లో ఏడాదికి 25 వేల మంది వరకు ఉంటారని అంచనా. ప్రపంచ వ్యాప్తంగా దోమల్ని అరికట్టే కార్యక్రమాలు డబ్ల్యూహెచ్‌ఓ ఆధ్వర్యంలో వివిధ దేశాల్లో స్వచ్ఛంద సంస్థలు చేపడుతూ ఉండటంతో డెంగీ కేసులు కాస్తయినా నివారించగలుగుతున్నారు.



ఏకే 47 కాల్పుల కేసులో సదానందం అరెస్టు

హుస్నాబాద్: సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండల కేంద్రంలో ఏకే 47 తుపాకీతో కాల్పులు జరిపిన దేవుని సదానందంను శనివారం రాత్రి హుస్నాబాద్ జడ్జి ఎదుట హాజరుపరిచినట్లు హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 7వ తేదీన అక్కన్నపేట చెందిన గుంటి గంగరాజు, అతని కుటుంబ సభ్యులపై సదానందం ఏకే 47 తుపాకీతో కాల్పులు జరిపి హత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. గంగరాజు అక్కన్నపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు ప్రారంభించామన్నారు. మూడు బృందాలుగా ఏర్పడి నిందుతుడిని కోసం గాలింపు చర్యలు చేపట్టగా కోహెడ మండల కేంద్రం బస్టాండ్ సమీపంలో సదానందంను అరెస్టు చేశామన్నారు. అతని వద్ద నుంచి ఏకే 47 గన్, 25 రౌండ్ల మ్యాగజైన్‌తో పాటుగా అతని ఇంటిలో 9ఎంఎం కార్బన్, కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సదానందంపై ఐపీసీ సెక్షన్ 307, సెక్షన్ 25ఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ప్రకటనలో పేర్కొన్నారు. 2016లో హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో మాయమైన తుపాకులు సదానందం వద్దనే ఉన్నాయని జిల్లా వ్యాప్తంగా బహిరంగంగా చర్చ జరుగుతున్నప్పటికీ పోలీసులు మాత్రం దీనిపై ఎలాంటి వివరాలు వెల్లడించకపోవడం గమనార్హం.

మద్యం అనుకుని పొరపాటున..

అల్లుడు తాగిన పురుగు మందు తాగి మామ మృతి

కాటారం: కూతురు భర్త పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.. అతని అంత్యక్రియలకు హాజరైన మామ కార్యక్రమాలు ముగిశాక మందు తాగుదామని భావించాడు. అయితే పొరపాటున అల్లుడు పురుగు మందు కలుపుకొని తాగిన మద్యం సీసాలోని మందే తాగడంతో ఆయ న కూడా కన్నుమూయడం ఆ కుటుంబంలో మరింత విషాదాన్ని నింపింది. ఈ ఘటన జయ శంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. మల్హార్ మండలం పెద్ద తూండ్లకు చెంది న పోలు రవి(45) చిన్న కుమార్తెను కాటారం మం డల కేంద్రానికి చెందిన మద్ది నాగ రాజు మూడేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. అయితే, నాగరాజు అప్పుల బాధతో మద్యంలో పురుగు మందు కలుపుకుని ఈనెల 6న సాయంత్రం తాగాడు. దీంతో అస్వస్థతకు గురైన నాగరాజును కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ 7వ తేదీన మృతి చెందాడు. దీంతో రవి దంపతులు పెద్దతూండ్ల నుంచి నాగరాజు అంత్యక్రియల కోసం కాటారానికి వచ్చారు. శుక్రవారం రాత్రి అంత్యక్రియలు ముగిశాక మద్యం బాటిల్‌ను తెచ్చుకుందామని వైన్స్‌కు వెళ్లే క్రమంలో నాగరాజు బెడ్‌రూంలో మద్యం సీసా కనిపించింది. అది సాధారణ మద్యమే అనుకున్న రవి తాగాడు. కానీ అదే సీసాలో నాగరాజు పురుగు మందు కలిపి తాగి ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలియదు. దీంతో ఆ మందు తాగగానే రవి సైతం ఒక్కసారిగా అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మహదేవపూర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

సంపూర్ణ అక్షరాస్యత సాధించాలి

ఈచ్ వన్.. టీచ్ వన్‌లో అందరూ భాగస్వాములు కావాలి

విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

సాక్షి, సిద్దిపేట

అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న తెలంగాణ, సంపూర్ణ అక్షరాస్యత సాధనలో కూడా ముందు ఉండాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (మల్టీపర్పస్ హైస్కూల్) ప్లాటినం జూబ్లీ ఉత్సవాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, స్వాతంత్ర్యానికి ముందు ఏర్పాటు చేసిన ఈ ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న అనేక మంది వివిధ రంగాల్లో పేరు ప్రఖ్యాతులు సంపాదించడం గర్వకారణం అన్నారు. ఇంతటి చరిత్ర గల పాఠశాలకు రావడం సంతోషంగా ఉందని, ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన ఈచ్ వన్.. టీచ్ వన్ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో నిరక్షరాస్యులు లేకుండా చేయవచ్చని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని చెప్పారు. తెలంగాణ సాహిత్య అకాడమి చైర్మన్ నందిని సిధారెడ్డి మాట్లాడుతూ.. 75 సంవత్సరాల క్రితం చదువుకున్న చదువులమ్మ ఒడిలోకి చేరిన వృద్ధులు కూడా ఇక్కడ చిన్న పిల్లల్లా కన్పిస్తున్నారని, వారు చిన్ననాటి జ్ఞాపకాలు నెమరు వేసుకుంటున్నారని అన్నారు. ఏం చదివాం..ఏం చేస్తున్నాం అనడం కన్నా.. ఎక్కడ నేర్చుకున్నాం అన్నది ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. నాటి నుండి నేటి వరకు సిద్దిపేట అంటే ప్రత్యేక స్థానం ఉందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిధ్యం వహించిన ఈ ప్రాంతం దేశానికే ఆదర్శంగా నిలవడం అందరికీ గర్వకారణం అన్నారు. ఇదే పాఠశాలలో చదివి పార్లమెంట్ వరకు వెళ్లిన తాను ఏం చేసినా పాఠశాల రుణం తీర్చుకోలేనని, పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు మాజీ ఎంపీ సోలిపేట రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీలు ఫారూఖ్ హుస్సేన్, కూర రఘోత్తంరెడ్డి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, సిద్దిపేట జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వేలేటి రోజా రాధాకృష్ణ శర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో అర్ధశతాబ్దం క్రితం చదువుకొని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు కలసుకొని ఆప్యాయంగా పలకరించుకున్నారు. చిన్న నాటి జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. గురువులను కలసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. కార్యక్రమంలో పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

గర్భగుడిలో పూజలు చేస్తున్న స్పీకర్, శాసన మండలి చైర్మన్

కాళేశ్వరాలయంలో పోచారం, 'గుత్తా' దంపతుల పూజలు

పూర్ణకుంభ స్వాగతం పలికిన అర్చకులు

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వర స్వామిని రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి దంపతులు శనివారం దర్శించుకున్నారు. ప్రత్యేక హెలికాప్టర్‌లో వచ్చిన వారు కన్నెపల్లిలోని లక్ష్మీపంపుహౌస్‌లో దిగి అక్కడి నుంచి రోడ్డు మార్గంలో కాళేశ్వరాలయానికి చేరుకోగా వేదపండితులు, అర్చకులు, అధికారులు వారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. గర్భగుడితో పాటు శుభానందదేవి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం వారిని ఆలయ చైర్మన్ బొమ్మెర వెంకటేశం, ఈఓ మారుతి శాలువాలతో సన్మానించి స్వామి చిత్ర పటాన్ని బహూకరించారు. కలెక్టర్ మహ్మద్ అబ్దుల్ అజీమ్, ఆర్టీవో గణేష్, తహసీల్దార్ మల్లయ్య తదితరులు వారివెంట ఉన్నారు.

14న సీఎం కాళేశ్వరం పర్యటన?

కాళేశ్వరం: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఈనెల 14న జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని లక్ష్మీబ్యారేజీ, లక్ష్మీపంపుహౌస్‌లను పరిశీలించేందుకు సీఎం రానున్నట్లు తెలిసింది. కన్నెపల్లి లక్ష్మీపంపుహౌస్‌లో మోటార్లను గత నవంబర్ 21న నిలిపివేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి లక్ష్మీ బ్యారేజీలో గేట్లు మూసివేశారు. దీంతో ప్రాణహిత ద్వారా వచ్చే ప్రవాహం లక్ష్మీబ్యారేజీకి చేరి రోజురోజుకూ నీటి నిల్వ పెరిగి ప్రస్తుతం బ్యారేజీ వద్ద 13 టీఎంసీలకు చేరింది. బ్యాక్ వాటర్ 35 కిలోమీటర్ల మేర నిలిచింది. లక్ష్మీపంపుహౌస్‌లో ఇప్పటి వరకు ఆరు మోటార్లలోపే నడిపించారు. ఈసారి సీఎం క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి రానుండడంతో ఒకేసారి 11 మోటార్లను నడిపి విజయవంతం చేయాలని ఇరిగేషన్, మేఘా ఇంజనీరింగ్ బృందం ప్రయత్నం చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. సీఎం పర్యటనను ఇటు పోలీసులు, అటు ఇరిగేషన్ అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు. ఈ విషయమై కాళేశ్వరం ప్రాజెక్టు ఎస్ఈ రమణారెడ్డిని సంప్రదించగా తనకు తెలియదని, సీఎం వస్తే షెడ్యూల్ వస్తుందని సమాధానం ఇచ్చారు.

యువతిపై గ్యాంగ్‌రేప్

- ఆరుగురిపై కేసు నమోదు
- మహబూబాబాద్ జిల్లాలో ఘటన

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లా బలరాంతండా గ్రామ పంచాయతీ పరిధిలో ఓ యువతిపై ఆరుగురు దుండగులు అత్యాచారానికి పాల్పడిన సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. రూరల్ సీఐ జూపల్లి వెంకటరత్నం కథనం ప్రకా రం... ఖమ్మం జిల్లా ఇల్లెందు మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతికి మహబూబాబాద్ మండలం బలరాంతండాకు చెందిన ఒక వ్యక్తితో పరిచయం ఉంది. ఈ క్రమంలో అతను ఆమెకు తరచూ ఫోన్ చేస్తుండేవాడు. శుక్రవారం ఆ యువతిని తండాకు రమ్మని ఫోన్ చేయగా వెళ్లింది. రాత్రి సమయంలో యువతి తండాకు చేరుకోగా ఫోన్ చేసిన వ్యక్తితో పాటు అక్కడే ఉన్న మరో ఐదుగురు ఆ యువతిని గ్రామ శివారులోని మామిడి తోటలోకి తీసుకెళ్లి సామూహికంగా అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలు కేకలు వేయడంతో అటువైపుగా వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు గమనించి అక్కడికి చేరుకోగా ఆరుగురు పరారయ్యారు. యువతి జరిగిన విషయం వారికి వివరించింది. డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో రూరల్ పోలీసులు యువతితో పాటు ఆరుగురిని స్టేషన్‌కు తీసుకువెళ్లారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ సీఐ తెలిపారు. కాగా, పోలీసుల అదుపులో ఉన్న వారు మైనర్లు అని సమాచారం.

భార్య శవం వద్ద కూర్చున్న భర్త జంగయ్య

ఆమె విగతజీవి.. అతను బడుగుజీవి

- ఆస్పత్రికి తీసుకెళ్తుండగా అనారోగ్యంతో మృతిచెందిన భార్య
- ఎక్కడికి వెళ్లాలో తెలియక తెల్లవార్లూ బస్టాండ్‌లోనే గడిపిన భర్త

కొందుర్గు : అనారోగ్యంతో మృతిచెందిన భార్య మృతదేహంతో రాత్రంతా బస్టాండ్‌లోనే కాలం వెళ్లదీశాడు ఓ వ్యక్తి. చివరికి దాతల సాయంతో భార్య అంత్యక్రియలు నిర్వహించిన ఘటన రంగారెడ్డి జిల్లా కొందుర్గులో జరిగింది. వికారాబాద్ జిల్లా పరిగి మండలం శివారెడ్డిపల్లికి చెందిన జంగయ్య, సత్యమ్మ దంపతులకు కుమారుడు మహేందర్‌తోపాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కూతుళ్లకు పెళ్లి చేయగా, కుమారుడు శంషాబాద్‌లో ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. భార్యాభర్తలు ఏడాది కిందట హైదరాబాద్‌కు వలస వెళ్లి కూలీపనులతో జీవిస్తున్నారు. ఇటీవల సత్యమ్మ అనారోగ్యానికి గురవ్వడంతో ఆమెను తీసుకొని జంగయ్య 20 రోజుల కిందట జిల్లేడ్‌చౌదరిగూడ మండలం వీరసముద్రంలో ఉన్న చిన్న కుమార్తె అనురాధ వద్దకు వెళ్లాడు. శుక్రవారం భార్య పరిస్థితి విషమించడంతో జంగయ్య ఆమెను ఓ ఆటోలో తీసుకొని షాద్‌నగర్‌కు వెళ్లాడు. అయితే దారిలోనే ఆమె కన్నుమూసింది. దీంతో ఆటోడ్రైవర్ వారిని అక్కడే దించేసి వెళ్లిపోయాడు. జంగయ్య రోడ్డు పక్కనే భార్య శవం వద్ద కూర్చొని విలపిస్తుండటాన్ని గమనించిన మరో ఆటో డ్రైవర్..జంగయ్యను సత్యమ్మ మృతదేహంతో సహా కొందుర్గు బస్టాండ్‌కు చేర్చి ఆదుకున్నాడు. ఈ విషయం కొడుకుకు ఫోన్‌లో చెప్పేందుకు యత్నించినా అతను అందుబాటులోకి రాలేదు. జేబులో డబ్బులు లేక కుమార్తెకూ సమాచారం ఇవ్వలేక పోయాడు. జంగయ్యను తెల్లవారుజామున గమనించిన కొందరు స్థానికులు.. పరిస్థితిని పోలీసుల దృష్టికి తెచ్చారు. వారు వచ్చి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. స్థానికులు కొందరు రూ.9వేల వరకు ఆర్థిక సహాయం చేయడంతో బాధితుడు కొందుర్గులోనే సత్యమ్మకు అంత్యక్రియలు జరిపాడు.

చెరువులో మునిగి ఇద్దరు బాలురు మృతి

బచ్చన్నపేట: జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం పోచన్నపేట గ్రామంలో ఇద్దరు బాలురు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బేడ బుడిగ జంగాల కాలనీకి చెందిన నూనె ఎల్లమ్మ-మదార్ దంపతుల కుమారుడు జక్కరయ్య(7), అదే కాలనీకి చెందిన కడకంచి లక్ష్మి-సారయ్య దంపతుల కుమారుడు పాలయ్య(7) స్థానిక ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నారు. శనివారం పిల్లలిద్దరూ పాఠశాలకు వెళ్లకుండా కాలనీ పక్కనే ఉన్న చెరువు వద్దకు ఆడుకోవడానికి వెళ్లారు. అందులో మిషన్‌భగీరథ పనుల్లో భాగంగా లోతైన గోతులు తీశారు. పిల్లలు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు ఆ గోతుల్లోని నీటిలో మునిగిపోయారు. వారు కేకలు పెట్టడంతో స్థానికులు వెళ్లి బయటకు తీసేసరికే ఇద్దరూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అవార్డు అందుకుంటున్న సంకల్ప్ జట్టు సభ్యులు

ఎన్టీపీసీ రామగుండంకు జాతీయ అవార్డు

ప్రొఫెషనల్ సర్కిల్స్‌లో సంకల్ప్ జట్టుకు ద్వితీయస్థానం

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ 17వ జాతీయస్థాయి ప్రొఫెషనల్ సర్కిల్ సదస్సు-2020లో ఎన్టీపీసీ రామగుండం సంస్థకు చెందిన సంకల్ప్ జట్టు ద్వితీయ అవార్డు అందుకుంది. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీపీసీ ఖర్గోన్‌లో రెండు రోజుల పాటు జరిగిన ప్రొఫెషనల్ సర్కిల్ సదస్సులో 16 జట్లు పాల్గొన్నాయి. ప్రథమస్థానంలో ఉపయ్(ఎన్టీపీసీ ఖర్గోన్), రెండోస్థానంలో సంకల్ప్(ఎన్టీపీసీ రామగుండం), తృతీయస్థానంలో కోల్ రేడియన్స్(ఎన్టీపీసీ సింహాద్రి)జట్లు నిలిచాయి. ఎన్టీపీసీ రామగుండం జట్టు దీంతో పాటు బెస్ట్ సదరన్ రీజియన్ అవార్డు సొంతంచేసుకుంది. ఎన్టీపీసీ డైరెక్టర్(హెచ్ఆర్) సప్తర్షిరాయ్ చేతుల మీదుగా జట్టు సభ్యులు రవికాంత్, ప్రసన్న, సతీష్‌చంద్ర, వంశీ, బిజినెస్ ఎక్స్‌లెన్స్ విభాగం కో-ఆర్డినేటర్ పి.నరేందర్ అవార్డు అందుకున్నారు. బొగ్గు గనుల పునరావాస గ్రామాల్లో చేపట్టిన సామాజిక, చైతన్య క్రార్యక్రమాలకు ఈ అవార్డు లభించింది.

అనాథలకు చట్టబద్ధమైన గుర్తింపు ఇవ్వాలి

- విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలి
- ఫోర్స్ అంతర్జాతీయ సదస్సు డిమాండ్

సదస్సును ప్రారంభిస్తున్న చాడ వెంకట్‌రెడ్డి. చిత్రంలో రాంచందర్‌రావు తదితరులు

సాక్షి, హైదరాబాద్: తల్లిదండ్రులు, సొంత మనుషులు లేని వారిని అనాథలుగా చేయకుండా ప్రభుత్వం, సమాజం అక్కున చేర్చుకొని వారికి అన్ని విధాలుగా గుర్తింపును, గౌరవప్రదమైన జీవితాన్ని అందజేయాలని ఫోర్స్ ఫర్ ఆర్ఫన్ రైట్స్ అండ్ కమ్యూనిటీ ఎంపవర్‌మెంట్ (ఫోర్స్) డిమాండ్ చేసింది. అనాథలుగా జీవనం కొనసాగిస్తున్న వారికి ఆధార్, ఓటరు గుర్తింపు కార్డులతో పాటు, కులం, చిరునామా తదితర ధృవపత్రాలను అందజేయాలని కోరింది. రాజ్యాంగబద్ధమైన హక్కులను, అవకాశాలను అనుభవించే స్వేచ్ఛ ఉండాలని పేర్కొంది. ఫోర్స్ ఆధ్వర్యంలో శనివారం నాగోల్‌లో 'అనాథ బిడ్డల హక్కుల సాధన'పై ఏర్పాటు చేసిన రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు ప్రారంభోత్సవంలో పలువురు వక్తలు మాట్లాడారు. అనాథలుగా బతుకుతున్న వారికి పౌరుడిగా గుర్తింపు, గౌరవం, విద్య, ఉద్యోగావకాశాల్లో రిజర్వేషన్లు కల్పించాలని ఉద్ఘాటించారు. భారత పౌరులుగా ఎలాంటి గుర్తింపు లేకుండా సుమారు 4 కోట్ల మంది దేశంలో అనాథలుగా బతుకుతున్నారని ఫోర్స్ అధ్యక్షుడు గాదె ఇన్నయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బిడ్డల భవితవ్యం, హక్కుల రక్షణ కోసం ప్రధాని మోదీ చొరవ తీసుకోవాలని కోరారు. రిజర్వేషన్ల ద్వారానే అనాథలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఇస్తున్నట్లుగానే అనాథలకు కూడా రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

రాజ్యాంగాన్ని సవరించాలి..

దుర్భరమైన పేదరికంలో, ఒక దళితుడిగా పుట్టి పెరిగిన తనకు అనాథల బాధలు తెలుసని టీఆర్ఎస్ ఎమ్మెల్యే రాజయ్య చెప్పారు. అనాథల రక్షణ, సంక్షేమం కోసం ప్రభుత్వ విధానాల్లో మార్పులు రావాలని, రాజ్యాంగంలోనూ తగిన సవరణలు చేయాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. అనాథలు హుందాగా, గౌరవప్రదమైన జీవితాన్ని కొనసాగించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నిర్మాణాత్మక కృషి జరగాల్సి ఉందని బీజేపీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు అన్నారు. ఈ సదస్సులో సీపీఐ కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మందాడి సత్యనారాయణరెడ్డి, బాలవికాస సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శౌరిరెడ్డి, యూఎన్ఓ ప్రతినిధి జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

కదిలించిన సావిత్రి కథ..

ముంబై ఐఐటీలో చదువుకుంటున్న సావిత్రి అంధురాలు. ఆమె తన జీవితం గురించి తెలియజేసిన విషయాలు ప్రతి ఒక్కరినీ కదిలించాయి. ఆమె పుట్టిన కొద్ది రోజులకు తల్లిదండ్రులు చనిపోవడం, పదో తరగతిలో చేరే నాటికి నానమ్మ, తాత కూడా చనిపోవడంతో ఒంటరిగా, స్వచ్ఛంద సంస్థల సహకారంతో చదువుకుంది. చదువు పూర్తయిన తరువాత భవిష్యత్తు ఏంటో తెలియడం లేదని, పౌరురాలిగా గుర్తింపు లేకపోవడమే దీనికి కారణమని వాపోయింది.

రాజ్యాంగం మార్పునకు బీజేపీ కుట్ర

- సీఏఏ, ఎన్ఆర్‌సీ, ఎన్‌పీఆర్‌లకు వ్యతిరేకంగా తెలంగాణ న్యాయవాదుల జేఏసీ ధర్నా
- సంఘీభావం తెలిపిన కేంద్ర మాజీ హోంశాఖ మంత్రి పి.చిదంబరం

హైదరాబాద్: డాక్టర్‌బీ.ఆర్.అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని బీజేపీ ప్రభుత్వం సమూలంగా మార్చివేసి మనువాద రాజ్యాంగాన్ని ఏర్పాటుచేసేందుకే సీఏఏ, ఎన్ఆర్‌సీ, ఎన్‌పీఆర్‌లను పథకం ప్రకారం ముందుకు తెస్తున్నారని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కమిటీ చీఫ్ కన్వీనర్ వలి ఊర్ రెహమాన్ ఆరోపించారు. తెలంగాణ న్యాయవాదుల జేఏసీ ఆధ్వర్యంలో సీఏఏ, ఎన్ఆర్‌సీ, ఎన్‌పీఆర్‌లకు వ్యతిరేకంగా ఇందిరాపార్కు వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి కేంద్ర మాజీ హోంశాఖ మంత్రి పి.చిదంబరం, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ధర్నాలో పాల్గొన్న వారితో రాజ్యాంగంపై ప్రమాణం చేయించి సంఘీభావం ప్రకటించారు. ధర్నాలో పాల్గొన్న చీఫ్ అడ్వయిజర్ ముజఫర్ ఉలాఖాన్, కో-కన్వీనర్ షాబాజ్ అష్జల్ ఖాన్, సఫీ ఉల్లా ఖాద్రీ, ఐఎల్‌యూ ప్రధాన కార్యదర్శి పార్థసారథి హాజరై మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వలి ఊర్ రెహమాన్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సీఏఏ, ఎన్ఆర్‌సీ, ఎన్‌పీఆర్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వంపై ఉన్న ప్రజావ్యతిరేకతను దృష్టి మళ్ళించడానికి చేసే కుట్రలో భాగమే ఈ చట్టాలన్నారు. ఈ చట్టాలు ముస్లింలకు మాత్రమే వ్యతిరేకం కాదని, ప్రతి భారతీయుడికి వ్యతిరేక చట్టాలన్నారు. ఇప్పటికే కేరళ, పంజాబ్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలు సీఏఏకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేశారని, అలాగే తెలంగాణ రాష్ట్రంలో కూడా చేయాలని కోరారు. మత ప్రతిపాదికన పౌరసత్వం ఇవ్వడానికి వీల్లేదన్నారు. అంబేడ్కర్ ఆలోచన విధానాన్ని అందరు పుణికిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ చట్టాలు పూర్తిగా రద్దయ్యే వరకు ఉద్యమిద్దాం అన్నారు. కార్యక్రమంలో భారీ సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.

న్యాయవాదుల ధర్నాలో పాల్గొన్న చిదంబరం, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సాక్షి పెళ్ళిచూపులు

ఆదివారం 9-2-2020

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను

బెస్త, గంగపుత్ర/M.Tech /C. Govt. Asst. మేనేజర్/SBI బ్యాంక్/50,000/- PM / 5'11'' ఎత్తు/ 27 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ఫోన్: 9618008271 [HA-27579]

పద్మశాలి/B.Tech / Govt. ఎలక్ట్రికల్ ఇంజనీర్ / ఇరిగేషన్ Dept / 58,000/- PM / 5'11'' ఎత్తు/ 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ఫోన్:8297439565 [HA-27579]

క్రిస్టియన్ మాల/M.Sc/ Govt. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్/ రెవెన్యూ Dept. /60,000/- PM / 6' ఎత్తు/ 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ఫోన్: 9966760501 [HA-27579]

రెడ్డి Gr /27/5'10''/ MS USA/ SWE /130K / 5 Cr * 28/5'11''/ MS /USA/ 125K / 15 Cr * P.P. Reddy, Ph: 9391198332 (W) [HA-1953]

రెడ్డి Gr /26/5'9''/ B.Tech / SWE / Hyd / 12 L PA * 29/5'9''/ B.Tech / SWE / 16 L PA / 15 Cr * P.P. Reddy, Ph: 9391198332 (W) [HA-1953]

రెడ్డి Gr /30/5'8''/MD (Gen) * 30/5'10'' / MD (Radiology) * P.P. Reddy, Ph: 9391198332 (W) [HA-1953]

విశ్వబ్రాహ్మణ/36 Y/ 5'6''/MBA / Pvt. జాబ్/ 30K PM / గల వరుడికి Any OC & BC అందమైన వధువు కావలెను. (డైవర్సీ) డైరెక్ట్. Ph: 7981066406 [H-733802]

క్రిస్టియన్ మాదిగ/ B.Tech /Govt. సైంటిస్ట్ (ఇస్రో)/ 90,000/-PM/5'6'' ఎత్తు/ 28 సం॥ల వరుడికి తగిన వధువు కావలెను. ఫోన్ : 7997523140 [HA-10748]

క్రిస్టియన్ మాల/ B.Tech /MBA/ Govt. బ్యాంక్ మేనేజర్ (కెనరా బ్యాంక్) / 70,000/- PM /5'6'' ఎత్తు/ 31 సం॥ల వరుడికి వధువు కావలెను. ఫోన్ : 7997523140 [HA-10748]

క్రిస్టియన్ మాదిగ/ B.Tech /MBA/ C. Govt. Asst. Exq. ఇంజినీర్ (ONGC) 12 Lakhs PA / 5'10'' ఎత్తు/28 సం॥ల వరుడికి వధువు కావలెను. ఫోన్ : 8886957298 [HA-10748]

యాదవ/ B.Tech (IT) /C. Govt. గ్రూప్ -I ఆఫీసర్/70,000/- PM /5'8'' ఎత్తు/ 28 సం॥ల వరుడికి తగిన వధువు కావలెను. ఫోన్ : 9515755529 [HA-10748]

క్రిస్టియన్ మాదిగ/ B.Tech(EEE) / Govt. AE (ట్రాన్స్‌కో) 50,000/- PM/ 5'8'' ఎత్తు/28 సం॥ల వరుడికి తగిన వధువు కావలెను. ఫోన్ : 9912280929 [HA-10748]

కులపట్టింపు లేదు: రెడ్డి/45 Yr/ 5'9''/ ఫెయిర్/ Govt ఎంప్లాయి/ 70K (PM) గల వరునికి తగిన వధువు కావలెను. ఫోన్: 9550863587 [H-739298]

కులపట్టింపు లేదు: రెడ్డి కమ్మ/49 Yr/ 5'9''/ ఫెయిర్/2ndమ్యారేజ్/MBA/ బ్యాంక్ మేనేజర్/ 80K (PM), (నోవిల్జన్స్) గల వరునికి తగిన వధువు కావలెను. ఫోన్: 7995169361 [H-739298]

కులపట్టింపు లేదు: కాపు రెడ్డి/29 Yr/ 5'7''/ PG/Govt జాబ్/ 55K (PM), ఫ్యామిలీ సెటిల్డ్ సొంత ఇల్లు గల వరునికి తగిన వధువు కావలెను. ఫోన్: 9515977526 [H-739298]

కులపట్టింపు లేదు: కమ్మ రెడ్డి/30 Yr/ 5'9''/ ఫెయిర్/Govt జాబ్/రైల్వే ఎంప్లాయి/60K (PM), సొంత ఇల్లు కలిగిన వరునికి తగిన వధువు కావలెను. ఫోన్: 8978205596 [H-739298]

మంచి స్థోమత గల అందమైన అతనికి ఏ బాధ్యత లేని 25 సం॥ల నుండి 35 సం॥ల లోపు అందమైన అమ్మాయి కావలెను. కుల పట్టింపు లేదు. డైరెక్ట్‌గా సంప్రదించండి : 90104 66787. [NA-15545]

USA-UK-IIT/IIM-BITS Eduacated FC Manకి 35 కి పైనున్న Tall, Rich, Healthy Woman కావలెను. Ph: 6360474663 [WB-50599]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Address: 106, A K Enclave, Phase II, 8-2-350, Road No. 3, Banjara Hills (Near Furniture Mall), Hyderabad. Ph: 9849321309 / 9347807015 Email: kcreddy43@gmail.com

వధువు కావలెను

Reddy/ B.Tech/MS/USA/V. Smart / 26/6'/ 45 L /M Family Income /500 Cr Property / Hyd. * Cont K.C. Reddy, Hyd. Ph: 9849321309/9347807015

Reddy/ B.Tech/MS/H1/USA/V. Smart / 28/5'9''/ 350 K/Rich * 28/5'11''/ 240K / 30 Cr * Cont K.C. Reddy Mar Bureu, Hyd. Ph: 9849321309/9347807015

Reddy/ B.Tech/ 35/5'11''/Rich / 31 L/ Yr/ Income / 60 Cr- Prop- Needs any Grad-Beautiful* Cont K.C. Reddy, Hyd. Ph: 9849321309/9347807015

Reddy/ B.Tech/ Very Big Business / 28/5'10''/ V. Smart / 300 Cr * 26/6'/500 Cr * 29/5'11''/ 400 Cr * 26/5'10''/ 300 Cr* Cont: K.C. Reddy, Hyd. Ph: 9849321309

Reddy/ IIT/IIM/ B.Tech / MBA/29/6'/30 L/Yr . 15 Cr * 36/5'6''/30 Cr * 25/5'9''/ 30 L/ Yr / 40 Cr * 32/5'7''/ 42 L / Yr / 15 Cr* 27/6'/178 K * Cont: K.C. Reddy, Hyd. Ph: 9347807015

Reddy/ B.Tech/ MS/ H1/USA * 27/6'/500 Cr * 27/5'11''/ 200 K / 30 Cr * 30/5'8''/230K * 29/ 5'7''/ 50 Cr * 28/5'11''/180 Cr * 26/6'/140K/ 30 Cr * Cont: K.C. Reddy, Hyd. Ph: 9347807015

Reddy/ MBBS / PG * 30/5'9''/ 30 Cr * 26/ 5'10''/ 20 Cr * 27/5'11''/150 Cr * 30/6'/75 Cr * 30/6'/50 Cr * 29/5'7''/10 Cr * 31/5'11''/10 Cr * Cont: K.C. Reddy, Hyd. Ph: 9849321309/9347807015

Reddy/ MBBS / Res-Doc-USA * 29/6'/50 Cr * 32/6' * 31/5'7''/ * 28/5'7'' * 28/5'10'' * 29/5'10'' * 33/5'9'' * 44/6' * 37/5'6'' * Cont: K.C. Reddy, Hyd. Ph: 9849321309

Reddy/ B.Tech / MS/ Business *27/5'8'' / 100 Cr * 27/6'/80 Cr *31/5'8'' / 100 Cr * 29/5'9''/180 Cr * 30/6'/200 Cr * 32/5'10''/ 180 Cr * Cont: K.C. Reddy, Hyd. Ph: 9849321309

Reddy/ USA/ Green Card/ 31/ 6'/ B.Tech/ CBIT/ MS, USA/ 150 K/ Rich * Cont K.C. Reddy Mar-Bureau, Road No.3, B.Hills, Hyd. Ph: 9347807015. D-071

వరుడు కావలెను

Reddy/B.Tech /Most Beautiful/ Rich/ 26/ 5'8'' * 23/5'8''/20 Cr * 25/5'8''/ 10 Cr * 30/5'6 1/2'' / 10 Cr * 27/5'4''/ 20 Cr * Cont: K.C.Reddy, Hyd. Ph: 9849321309

Reddy/B.Tech /MS/H1/ Most Beautiful & rich * 26/5'5'' *28/5'6'' * 27/5'7'' * 28/5'3'' * 25/5'8'' * 25/5'3'' * 27/5'6'' * 28/5'6'' * 32/5'5'' * Cont: K.C.Reddy, Hyd. Ph: 9849321309

Reddy/M.S/ Hyd/ 28/5'4''/ 300 Cr / Father - Industrialist / Hyd * MBA/30/ 5'3''/ 200 Cr / Hyd* Cont: K.C.Reddy, Hyd. Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/ 29/5'3''/200 Cr * 28/5'3''/ 200 Cr * 24/5'5''/300 Cr * 24/5'5''/ 1000 Cr * 26/ 5'5''/100 Cr * 28/5'8''/ 100 Cr * 31/5'2 1/2''/ 100 Cr* Cont: K.C.Reddy, Hyd. Ph: 9849321309

Reddy/B.Tech / 26/5'6''/ 50 Cr * 29/5'4'' / 50 Cr * 26/5'7''/75 Cr * 34/5'6''/ 50 Cr * 28/5'2''/ 50 Cr * 32/5'4''/ 100 Cr * 27/5'3 1/2''/ 40 cr * 26/5'4''/ 50 Cr * Cont: K.C.Reddy, Hyd. Ph:9347807015

Reddy/B.Tech / 22/5'8''/ 20 Cr * 25/5'5''/ 20 Cr * 26/5'3''/ 30 Cr * 29/5'3''/20 Cr * 28/5'5''/ 20 Cr * 27/5'5''/ 50 Cr * 27/5'4''/ 20 Cr * Cont: K.C.Reddy, Hyd. Ph: 9849321309/9347807015

Reddy/ B.Tech/MS/H1 /USA * 28/5'3''/ 110 K / 30 Cr * 26/5'4''/ 25 Cr * 26/5'4''/ 20 Cr * 26/5'7''/ 20 Cr * 25/5'2''/ 40 Cr * 34/5'6''/ 50 Cr * 26/5'6''/ 30 Cr * Cont: K.C. Reddy, Hyd. Ph: 9849321309

Reddy/ MBBS / PG/ 24/5'4''/ 30 Cr * 25 / 5'4''/ 20 Cr * 25/5'6''/ 30 Cr * 26/5'3''/ 40 Cr * 23/5'5''/ 30 Cr * USA --> 27/5'7''/ 50 Cr *27/5'4''/ 50 Cr * Cont: K.C. Reddy, Hyd. Ph: 9347807015.

Reddy/ Divercee/ MDS/ 32/ 5'4''/ * MBBS/ US MLE/ 27/ 5'8''/ 70 Cr * MD/ 32/ 5'6''1/2/ 9 Cr * 31/ 5'5''/ PG-doc/ 10 Cr * B.Tech/ 33/ 5'6''/ 60 Cr * Cont: K.C. Reddy, Hyd. Ph: 9849321309.

Reddy/ B.Tech/ SWE/ Hyd/ 26/ 5'8''/ Rich * 26/ 5'4''/ 3 Cr * 25/ 5'3''/ 2 1/2 Cr * 32/ 5'5''/ 10 L/yr * 24/ 5'6'' * 27/ 5'3''/ 26 L/yr/ 20Cr *25/ 5'6'' * Cont: K.C. Reddy, Hyd. Ph: 9849321309/ 9347807015.

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి Citizen, USA, 29, 6', 400 K, Rich, Handsome, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MS, DNB, 29, 5'11'', Doctor, Handsome, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 29, 5'11'', SWE, 120 K, USA, H1, 15 Crores, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Bengaluru, BE, 26, 5'8'', Sr Engineer, 16 L P/A, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MS, 29, 5'11'', Doctor, Handsome, Hyd, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5'9'', 110 K, 2 Crores, USA Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Canada BE, MS, 28, 6'3'', 65 K, Handsome, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి USA, 32, 5'10'', B Pharm,MS, USA, H1, 120 K, Fair, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818. LETTER

వరుడు కావలెను

రెడ్డి Mumbai, BE (NIT), 26, 5'7'', Fair & Slim, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, 25, 5'6'', Doctor, Hyd, Fair & Slim, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి 29, 5'4'', Rich Family, Hyderabad, Fair & Slim, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5'2'', SWE, 150 K, H1, USA, Fair, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 27, 5'4'', SWE, H1, USA, 4 Crores, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Bengaluru, BE, MBA, 28, 5'4'', Designer, Fair & Slim, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి 10 Crores, BE,MBA, 24, 5'3'', Fair & Slim, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MSc (UK), 23, 5'6'', Fair & Slim, 30 Crores, Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818. LETTER

నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో (Since 2000)

No.1 రెడ్డిస్ మ్యారేజ్ బ్యూరో, హెడ్ ఆఫీసు, G-6, అమృతపిల్ల, యశోద హాస్పిటల్ ఎదురుగా, రాజ్‌భవన్ రోడ్, సోమాజిగూడ, హైదరాబాద్ – ఫోన్: 9848221166, బ్రాంచి ఆఫీసులు: 501, PVT మార్కెట్, కొత్తపేట, దిల్‌సుఖ్‌నగర్, ఫోన్: 8885559579 * ఫారెస్టు ఆఫీసు ప్రక్కన, సుబేదారి, హన్మకొండ, ఫోన్: 9505551788 * కోర్టు సర్కిల్, కరీంనగర్ ఫోన్: 78933 33726. గమనిక: మా యొక్క కస్టమర్లకు విజ్ఞప్తి. ప్రతి 15 రోజులకు ఒకసారి మీ దగ్గరలోని మా ఆఫీసును స్వయముగా సంప్రదించగలరు. కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకునేవారు స్వయముగా మీ దగ్గరలోని మా ఆఫీసుకు వచ్చి చేసుకోగలరు. E-mail: naveenreddy0033@yahoo.com, Whatsup No. 9848221166

వధువు కావలెను

రెడ్డి 1992/5'10''/MBBS / Business / 200 కోట్ల ఆస్తి గల వరునకు Engineer/ Doctor Well Settled వధువు కావలెను. సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో, Hyd. Ph: 8885559579, 9848221166

రెడ్డి 1991/5'8''/ B.Tech, MS / Australia/54K * సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో, Hyd. Ph: 8885559579, 9848221166

రెడ్డి 1989/6'1''/B.Tech / Construction Business / Hyd/ 5 L PM 35 కోట్ల ఆస్తి * సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో, Hyd. Ph: 8885559579, 9848221166

రెడ్డి 1990/5'8''/ MS/Newzealand Citizen/ 170 K / SWE / USA * సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో, Hyd. Ph: 8885559579, 9848221166

రెడ్డి 1990/5'8''/B.Tech,MS/Business / Hyd / 3 L PM/ Rich * సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో, Hyd. Ph: 8885559579, 9848221166

రెడ్డి 1990/5'10''/B.Tech, MS /US / 90K / H1B / I 140 * సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో, Hyd. Ph: 8885559579, 9848221166

రెడ్డి 1988/5'6''/ B.Tech, MS/ Australia / 65K * సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో, Hyd. Ph: 8885559579, 9848221166

రెడ్డి 1987/5'8''/B.Tech, MS / US/ 130K / H1 B / I 140 / Rich * సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో, Hyd. Ph: 8885559579, 9848221166

రెడ్డి 1987/5'11''/MBBS,MS/General Surgery / 12 L PA / Hyd /15 కోట్ల ఆస్తి * సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో, Hyd. Ph: 8885559579, 9848221166

రెడ్డి Divorcee / 1981/5'6''/ B.Tech, MS/ MBA/ USA / 120 K * సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో, Hyd. Ph: 8885559579, 9848221166

వరుడు కావలెను

రెడ్డి 1994/5'7''/ B.Tech,MS/US/ 78K / Fair & Rich * సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో, Hyd. Ph: 8885559579, 9848221166

రెడ్డి 1995/5'6''/B.Tech /MBA / Family Business / 20 కోట్ల ఆస్తి * సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో, Hyd. Ph: 8885559579, 9848221166

రెడ్డి 1995/5'3'' /MBA / 200 కోట్ల ఆస్తి / Fair * సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో, Hyd. Ph: 8885559579, 9848221166

రెడ్డి 1994/5'3''/ B.Tech, M.Tech / (Dual Degree IIT) / MS/ US / Rich * సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో, Hyd. Ph: 8885559579, 9848221166

రెడ్డి 1994/5'7''/MBBS /Very Fair / Rich * సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో, Hyd. Ph: 8885559579, 9848221166

రెడ్డి 1994/5'4''/ B.Tech, M.Tech / 1st Year / Fair * సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో, Hyd. Ph: 8885559579, 9848221166

రెడ్డి 1993/5'6''/ BDS / USA / STEPS 1 & 2 Passed * సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో, Hyd. Ph: 8885559579, 9848221166

రెడ్డి 1996/5'6''/ MA / BEd/ Own School /Hyd /40 కోట్ల ఆస్తి * సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో, Hyd. Ph: 8885559579, 9848221166

రెడ్డి 1993/5'4''/B.Tech / MS/ US/ 60K/ H1B / Fair * సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో, Hyd. Ph: 8885559579, 9848221166

రెడ్డి 1997/5'5''/ B.Tech, MS/UK/ Business /25 కోట్ల ఆస్తి/ Very Fair * సంప్ర॥ నవీన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో, Hyd. Ph: 8885559579, 9848221166 LETTER

శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్స్

కేవలం రెడ్డి వధూవరుల వివాహ సంబంధాలకై సంప్రదించండి. దేశిరెడ్డి శోభారెడ్డి, MBA., FLAT No: 201, 2nd FLOOR, SHESHADRI HEIGHTS APARTMENT, Opp: SLMS Hospital, Nagole 'X' Road, Hyderabad. Cell: 7396891999, 9398618816.

వధువు కావలెను

రెడ్డి/ USA / 29/5'8''/ డాక్టర్/ న్యుమరాలజీ/ ఫెయిర్ గల వరునికి తగిన వధువు కావలెను. శక్తిశ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్ Ph: 7396891999

రెడ్డి/USA /SWE/H1, I 140/ 30/ 5' 11''/ Fair గల వరునికి తగిన వధువు కావలెను. శక్తిశ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్ Ph: 7396891999

రెడ్డి/USA /SWE/H1 /28/5'9''/Fair / 5 Cr ప్రాపర్టీ గల వరునికి తగిన వధువు కావలెను. శక్తిశ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్ Ph: 7396891999

రెడ్డి/USA/ SWE/H1/29/5'7''/ Fair / 20 Cr ప్రాపర్టీ గల వరునికి తగిన వధువు కావలెను. శక్తిశ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్ Ph: 7396891999

రెడ్డి/USA/ SWE/గ్రీన్‌కార్డ్/ 33/5'8''/ 7 Cr ప్రాపర్టీ గల వరునికి తగిన వధువు కావలెను. శక్తిశ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్ Ph: 7396891999

రెడ్డి/B.Tech/ బిజినెస్‌మెన్/ 31/6'/ 50 Cr ప్రాపర్టీ గల వరునికి తగిన వధువు కావలెను. శక్తిశ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్ Ph: 7396891999

రెడ్డి/B.Tech/MBA / 27/5'8''/Job Holder / 5 Cr ప్రాపర్టీ గల వరునికి తగిన వధువు కావలెను. శక్తిశ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్ Ph: 7396891999

రెడ్డి/MS/Job Holder /39/5'8''/ 50 Cr ప్రాపర్టీ గల వరునికి తగిన వధువు కావలెను. శక్తిశ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్ Ph: 7396891999

రెడ్డి/B.Tech/SWE/28/5'9''/ Fair / 12 L PA / 25 Cr ప్రాపర్టీ గల వరునికి తగిన వధువు కావలెను. శక్తిశ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్ Ph: 7396891999

రెడ్డి/B.Tech/Govt. Job / 30/ 6'/ 10 Cr ప్రాపర్టీ గల వరునికి తగిన వధువు కావలెను. శక్తిశ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్ Ph: 7396891999

వరుడు కావలెను

రెడ్డి/ USA/ SWE /H1/ 25/ 5'2''/ Fair గల వధువుకి తగిన వరుడు కావలెను. శక్తిశ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్ Ph: 9398618816

రెడ్డి/USA/SWE/H1/28/5'8''/ Fair గల వధువుకి తగిన వరుడు కావలెను. శక్తిశ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్ Ph: 9398618816

రెడ్డి/డాక్టర్/USA / MBBS,MD/ 32/5'4'' గల వధువుకి తగిన వరుడు కావలెను. శక్తిశ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్ Ph: 9398618816

రెడ్డి/డాక్టర్/MBBS/23/5'3''/ Fair / 2 Cr ప్రాపర్టీ గల వధువుకి తగిన వరుడు కావలెను. శక్తిశ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్ Ph: 9398618816

రెడ్డి/డాక్టర్/MBBS/26/5'6''/ Fair / 10 Cr ప్రాపర్టీ గల వధువుకి తగిన వరుడు కావలెను. శక్తిశ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్ Ph: 9398618816

రెడ్డి/B.Tech/25/5'3''/Fair / 2 Cr ప్రాపర్టీ గల వధువుకి తగిన వరుడు కావలెను. శక్తిశ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్ Ph: 9398618816

రెడ్డి/B.Tech/MBA/ Business / 25/ 5'8''/ Fair / 20 Cr ప్రాపర్టీ గల వధువుకి తగిన వరుడు కావలెను. శక్తిశ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్ Ph: 9398618816

రెడ్డి/MA/ Job Holder / 23/ 5'1''/Fair / 2 Cr ప్రాపర్టీ గల వధువుకి తగిన వరుడు కావలెను. శక్తిశ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్ Ph: 9398618816

రెడ్డి/B.Tech/Job Holder / 34/ 5'5''/ Fair / వెల్ సెటిల్డ్ గల వధువుకి తగిన వరుడు కావలెను. శక్తిశ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్ Ph: 9398618816

రెడ్డి/MCA/31/5'5''/1 Cr ప్రాపర్టీ గల వధువుకి తగిన వరుడు కావలెను. శక్తిశ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్‌లైన్ Ph: 9398618816 [H-733951]

FREE REGISTRATION (online/ Whatsapp / Phone Call) 50,000 సంబంధాలు కలిగిన ఏకైక సంస్థ. 97016 59125 www.jeelakarrabellam.com [G-438]

ఒంటరి/ తోడు/ లేటు పెళ్ళి సంబంధములు కొరకు సంప్రదించండి. శ్రీ శ్రీనివాసా మేరేజ్ లింక్స్, ఆరసవల్లి రోడ్, శ్రీకాకుళం. C: 9177163987, 7731824889, What: 8247599336 [S-711203]

అన్ని కులాలకు ఖచ్చితంగా సంబంధాలు చూడబడును. ఆడవారికి రిజిస్ట్రేషన్ ఫ్రీ. Ph: 9392263247, www.pellipeetalu.in [H-739875]

SC మాల హిందువులకు మాత్రమే. B.Tech/ M.Tech /IAS/IPS/ MBBS/MD/MCA/Abroad & Govt Job Holders సంప్ర॥ శ్రీలక్ష్మి మ్యారేజ్ బ్యూరో సాయిరాం. Ph: 8008988513, 9000919182. [H-739835]

రజక వివాహ వేదిక (1994)/Abroad, ఇంజినీర్స్, డాక్టర్స్, Govt.Jobs, Business, B.Ed సంబంధాలకై సంప్ర: 8106303155, 9391265304. [H-733802]

★

గౌడ్/మ్యారేజ్ బ్యూరో/Hyd (Only for Gouds) ఇంజినీర్స్, డాక్టర్స్, సాఫ్ట్‌వేర్, NRI, బిజినెస్, Govt/Pvt వారికి 15 రోజుల్లో పెళ్ళి సంబంధాలు కుదర్చబడును. Ph: 8340917965 [H-733134]

ఓన్లీ మున్నూరు కాపులకు మాత్రమే. ఇంజినీర్స్, డాక్టర్స్, సాఫ్ట్‌వేర్, NRI, బిజినెస్, Govt/ Pvt వారికి 15 రోజుల్లో పెళ్ళి సంబంధాలు కుదర్చబడును. Ph: 8340917965 [H-733134]

సెకెండ్ మ్యారేజ్‌లకు మాత్రమే. ఇంజినీర్స్, డాక్టర్స్, సాఫ్ట్‌వేర్, NRI, బిజినెస్, Govt/ Pvt వారికి 15 రోజుల్లో పెళ్ళి సంబంధాలు కుదర్చబడును. Ph: 8340917965 [H-733134]

రెడ్డి మ్యారేజ్ బ్యూరో Hyd (Only for Reddy's) ఇంజినీర్స్, డాక్టర్స్, SWE, NRI, బిజినెస్, Govt/ Pvt వారికి 15 రోజుల్లో పెళ్ళి సంబంధాలు కుదర్చబడును. Ph: 8340917965 [H-733134]

1st March 2020 బ్రహ్మణ వధూ–వరుల వివాహ పరిచయ వేదిక జ్యోతి గార్డెన్స్ ECIL, HYD లో జరుగును Time: 1 PM to 6 PM. Ph: 9704656103, 9533608887. [HA-1166]

పద్మశాలి మ్యారేజ్ బ్యూరో Hyd (Only Padmashali) ఇంజినీర్స్, డాక్టర్స్, సాఫ్ట్‌వేర్, NRI, బిజినెస్, Govt/ Pvt వారికి 15 రోజుల్లో పెళ్ళి సంబంధాలు కుదర్చబడును. Ph: 8340917965 [H-733134]

యాదవ్ కులముల వారికి మాత్రమే. ఇంజినీర్స్, డాక్టర్స్, సాఫ్ట్‌వేర్, NRI, బిజినెస్, Govt/ Pvt వారికి 15 రోజుల్లో పెళ్ళి సంబంధాలు కుదర్చబడును. Ph: 8340917965 [H-733134]

CNB/ Single /Widow/ Diverce / ఏ బాదరబందీ లేని 45 సం॥ ఒంటరి వరునకు తగిన వధువు కావలెను. Hyd మాత్రమే. ఫోన్ : 6281169575 [H-733076]

విశ్వబ్రాహ్మణ/2వ పెళ్ళి/45 Yrs/ 5'7''/ డిగ్రీ / ప్రైవేట్ జాబ్/ 40,000/- PM / స్వంత ఇల్లు కలిగిన వరుడికి తగిన వధువు కావలెను. డైరెక్ట్. Ph: 8555918430 [H-739885]

వీర సేవ జంగం/38/5'5'' / కులం & కట్న ప్రసక్తి లేదు. కారు డ్రైవర్. జీ. 20,000/- PM కలిగిన వరుడికి వధువు కావలెను. 2వ పెళ్ళి. నో బ్రోకర్స్. డైరెక్ట్. సంప్ర. Ph: 7207456568 [H-739628]

CNB Reddy 45 Yrs. 5.8'', P.G. Govt. Officer, Second, 4 Cr. Property seeks fair beautiful well placed girl 35 to 40. Direct-9440841550 [M-1056579]

వరుడు కావలెను

రజక/60 లక్షల ఆస్తి/B.Tech / C.Govt. Asst. ఇంజినీర్/జెన్‌కో/50,000/- PM / 5'5'' ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9618008271 [HA-27579]

విశ్వబ్రాహ్మణ్/B.Tech / C.Govt. స్టెనోగ్రాఫర్ /ఇన్‌కమ్‌ట్యాక్స్ Dept. /45,000/- PM / 5'4'' ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 8008939651 [HA-27579]

SC హిందు మాల/ఏకైక కుమార్తె/ B.Tech / C.Govt. Asst. ఎగ్జి॥ ఇంజినీర్/ ITDA/ 50,000/- PM / 5'5'' ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ఫోన్: 9966760501 [HA-27579]

రెడ్డి Br /26/5'4''/ B.Tech / MS/ H1/ USA * 25/5'5''/MS - H1 / USA * P.P. Reddy, Ph: 9059430595 (W) [HA-1953]

రెడ్డి Br /25/5'4''/ B.Tech / 15 Cr * 25/5'5''/B.Tech / SWE * P.P. Reddy, Ph: 9059430595 (W) [HA-1953]

రెడ్డి Br /MBBS/MD (Gynic) 27/5'4'' * 27/5'2''/ MD (Gen) * P.P. Reddy, Ph: 9059430595 (W) [HA-1953]

కమ్మ/డైవర్సీ/30 Y/ 5'4''/Own బేబీ కేర్ సెంటర్ / కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు కుల పట్టింపులేని వరుడు కావలెను. Ph: 9963825259 [H-733802]

కుల పట్టింపులేదు/కాపు కమ్మ/39 Y/ 5'5''/ ఫెయిర్/ లేట్ మ్యూవ్/ B.Tech / Govt. రైల్వే ఎంప్లాయి/ 1 Lac (PM)/ తండ్రి లేట్, సొంత ఇల్లు కల్గిన వధువుకు తగిన వరుడు కావలెను. (ఇల్లరికం OK) Ph: 7673923785 [H-733802]

చౌదరి/55 Y/విడో/పెన్షనర్/ కమర్షియల్ కాంప్లెక్స్/1 L/PM/ఆంధ్రాలో రైస్‌మిల్/ పొలాలు, తోటలు కల్గిన వధువుకు కుల, ధన, చదువు ప్రసక్తిలేని వరుడు కావలెను. Ph: 9581708805 [H-733802]

కాపు / డైవర్సీ/ 27/B.Com * పద్మశాలి / 28/5'2''/ BSc / వధువులకు వరులు కావ

జికా...

పుట్టిన ప్రాంతం: ఉగాండా
ఎలా సంక్రమిస్తుంది: దోమలు
మరణాల రేటు: 9%

డెంగీ తరహాలోనే జికా వైరస్ కూడా ఏడెస్ దోమ ద్వారా వస్తుంది. జ్వరం, ఒళ్లంతా దద్దుర్లు, కంటికి కలక, కీళ్ల నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. 1947లో ఉగాండాలో తొలిసారిగా ఈ వైరస్ కోతుల్లో కనపడింది. 1952 సంవత్సరం నాటికి ఈ వ్యాధి మనుషులకీ సంక్రమించింది. ఉగాండా, యునైటెడ్ రిపబ్లిక్ ఆఫ్ టాంజానియాలో ఈ వ్యాధి ప్రబలింది. 1960-80 మధ్య కాలంలో ఈ వ్యాధి అమెరికా, ఆసియా, పసిఫిక్ దేశాలకు వ్యాపించింది. 2013లో ఈ వ్యాధి ఒక్కసారిగా ఫ్రాన్స్‌లో విజృంభించింది. 30 వేల మందికి ఈ వ్యాధి సంక్రమించింది. అప్పుడే ప్రపంచ దేశాలు ఉలిక్కిపడ్డాయి. అయితే ఈ వైరస్ త్వరగానే అదుపులోకి వస్తుంది. రోగ నిరోధక శక్తి బాగా కలిగి ఉండేవారికి ఈ వ్యాధి సోకే అవకాశాలు తక్కువ. 2015లో బ్రెజిల్‌ని కూడా జికా వణికించింది. గర్భిణులకు ఈ వ్యాధి సోకి గర్భస్థ శిశువులకీ సంక్రమించడం ఆందోళన కలిగించే అంశం. జికా వ్యాధితో పుట్టిన శిశువుల్లో మెదడు సక్రమంగా ఎదగదు. 2016లో జికాని అదుపు చేయడానికి డబ్ల్యూహెచ్‌ఓ అంతర్జాతీయ ఆరోగ్య అత్యవసర పరిస్థితి ప్రకటించింది. దోమకాటుతో పాటు, లైంగిక సంపర్కం, రక్తం ద్వారా ఈ వైరస్ ఒకరి నుంచి మరొకరికి సోకుతుంది.



వైరస్ ప్రూఫ్ కారు..!

ఎన్నో రకాల వ్యాధికారక వైరస్‌లు చైనాలోనే బయటపడ్డాయి. సార్స్ నుంచి ఇప్పుడు కరోనా దాకా రకరకాల వైరస్‌లపై చైనా పోరాటం చేస్తూనే ఉంది. కరోనా వైరస్ దాటికి బెంబేలెత్తిన చైనా కేవలం పదంటే పది రోజుల్లోనే ఆస్పత్రిని నిర్మించింది. ఇప్పుడు వైరస్‌ని నిరోధించే కార్ల తయారీ పనిలో పడింది. జిలీ గ్రూప్ వైరస్‌లను నిరోధించే, గాలిని ప్యూరిఫై చేసే ఫిల్టర్లు ఏర్పాటు చేసేలా కార్లను అభివృద్ధి పరుస్తోంది. ఈ కార్లను ఆరోగ్యకరమైన, తెలివైన కార్లుగా ఆ కంపెనీ అభివర్ణిస్తోంది. యూరప్, అమెరికా, చైనాలో ఉన్న జిలీ ఆటోస్ గ్లోబల్ రీసెర్చ్ అండ్ డెవలప్ డిజైన్ నెట్‌వర్క్ వాతావరణంలో వస్తున్న మార్పులకి అనుగుణంగా కార్ల డిజైన్లను తయారు చేస్తుంది. బ్యాక్టీరియా నిరోధక, వైరల్ నిరోధక సాంకేతిక వ్యవస్థను ఈ కార్లలో పొందుపరుస్తూ కొత్త కార్లను తీసుకురానుంది.

'ఇవాళ రేపు ప్రజలు ఇళ్లలో గడిపే సమయం తర్వాత అత్యధికంగా ప్రయాణాల్లోనూ, అందులోనూ కార్లలోనే గడుపుతున్నారు. వాటిపైనే చైనా ప్రజలు ఎక్కువ ఖర్చు పెడుతున్నారు. అందుకే కారు ప్రయాణాల్లో వారికి ఎలాంటి వైరస్‌లు సోకకుండా కొత్త తరహా కార్లను తయారు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం'
– 'జిలీ' అధ్యక్షుడు అన్ కాంఫై

సీఏఏకు వ్యతిరేకంగా

జీహెచ్ఎంసీ తీర్మానం

మేయర్ ఆధ్వర్యంలో దేశంలోనే తొలిసారి తీర్మానం చేసిన బల్దియా

సాక్షి, హైదరాబాద్: సీఏఏకు వ్యతిరేకంగా జీహెచ్ఎంసీ సర్వసభ్య సమావేశం తీర్మానం చేసింది. మేయర్ బొంతు రామ్మోహన్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన జీహెచ్ఎంసీ సమావేశంలో డిప్యూటీ మేయర్ ఫసీయుద్దీన్ సీఏఏకు వ్యతిరేకంగా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అంతకు ముందు ఉదయం బడ్జెట్, మధ్యాహ్నం సాధారణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ..తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సీఏఏపై ఇప్పటికే తన నిర్ణయాన్ని తెలిపారని, దానికి వ్యతిరేకంగా అసెంబ్లీ లో తీర్మానం చేస్తామని కూడా ప్రకటించారని చెప్పారు. సీఎం స్ఫూర్తితో ప్రతిపాదించిన ఈ తీర్మానానికి సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలపాల్సిందిగా కోరగా, సభ్యులందరూ బల్లలు చరుస్తూ తమ ఆమోదం తెలిపారు. ఫసీయుద్దీన్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు టీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంటులో సీఏఏను వ్యతిరేకించారని పేర్కొన్నారు. ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కూడా సీఏఏపై తన వాణిని స్పష్టంగా విన్పించారని చెప్పారు. ఒక వర్గానికి వ్యతిరేకంగా పక్షపాతంతో తీసుకొచ్చిన సీఏఏను అందరూ వ్యతిరేకించాల్సిందేనన్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా, లౌకికతత్వాన్ని విచ్ఛిన్నం చేసేలా ఉన్న చట్టమని వ్యాఖ్యానించారు. జీహెచ్ఎంసీలో ప్రవేశపెట్టిన తీర్మానానికి ఎంఐఎంకు చెందిన మాజీ మేయర్ మాజిద్ హుస్సేన్, ఎమ్మెల్సీ జాఫ్రీ, టీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీ ప్రభాకర్, కార్పొరేటర్లు జగదీశ్వర్ గౌడ్, సింగిరెడ్డి స్వర్ణలత మద్దతు ప్రకటించారు.

సభలో గలాటా..

బడ్జెట్‌పై సమావేశం జరుగుతుండగానే సీఏఏ, ఎన్ఆర్‌సీ, ఎన్‌పీఆర్‌లను వ్యతిరేకిస్తూ తీర్మానం చేయాలని మాజిద్ హుస్సేన్ డిమాండ్ చేశారు. అవి ఇప్పుడెందుకంటూ సభలో ఉన్న బీజేపీ సభ్యుడు శంకర్‌యాదవ్ వ్యతిరేకించారు. దీంతో ఆయనకు, ఎంఐఎం సభ్యులకు మధ్య సభలో కాసేపు వాగ్వాదం జరిగింది. మేయర్ పోడియం దగ్గరకు వెళ్లి కాస్త గలాటా సృష్టించారు. బడ్జెట్ సమావేశంలో బడ్జెట్ విషయాలే ప్రస్తావించాలన్న మేయర్.. సాధారణ సమావేశంలో మిగతా విషయాల గురించి చర్చిద్దామన్నారు. మధ్యాహ్నం జరిగిన సాధారణ సమావేశానికి శంకర్‌యాదవ్ గైర్హాజరయ్యారు. డిప్యూటీ మేయర్ సీఏఏను వ్యతిరేకిస్తూ తీర్మానం ప్రవేశపెట్టగా టీఆర్ఎస్, ఎంఐఎం సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. దేశంలో సీఏఏను వ్యతిరేకిస్తూ తొలి తీర్మానం చేసిన కార్పొరేషన్ జీహెచ్ఎంసీ అని మేయర్ అన్నారు.

శనివారం సిద్దిపేటలోని కోమటి చెరువు వద్ద స్వయంగా బ్యాటరీ వాహనాన్ని నడుపుతున్న విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

సుధీర్‌రెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న సీఎం కేసీఆర్

మూసీ రివర్ ఫ్రంట్ చైర్మన్‌గా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎల్‌బీనగర్ శాసన సభ్యుడు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి నియమితులయ్యారు. శనివారం ఈ నియామక ఉత్తర్వులపై సీఎం కేసీఆర్ సంతకం చేసి, ఆయనకు అందజేశారు. కేబినెట్ హోదా కలిగిన ఈ పదవిలో సుధీర్‌రెడ్డి మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్‌బీనగర్ శాసన సభ్యుడిగా కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన సుధీర్‌రెడ్డి గతేడాది టీఆర్ఎస్‌లో చేరారు. గతంలో హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హుడా) చైర్మన్‌గా సుధీర్ పని చేశారు.

ఈ-గవర్నెన్స్‌లో రాష్ట్రానికి బంగారు పతకం

సాక్షి, హైదరాబాద్: ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో నూతన సాంకేతికతను (ఎమర్జింగ్ టెక్నాలజీ) అనుసరించడంలో రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న ప్రతిభకు బంగారు పతకం లభించింది. రాష్ట్రంలోని చిట్‌ఫండ్ కంపెనీల కార్యకలాపాల్లో 'టీ-చిట్స్'పేరిట నూతన ఐటీ సాంకేతికత 'బ్లాక్ చెయిన్'వినియోగానికి గుర్తింపుగా ఈ పతకం లభించింది. కేంద్ర అణు ఇంధన, అంతరిక్ష మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ చేతుల మీదుగా రాష్ట్ర ఐటీ, కమ్యూనికేషన్ల శాఖ ఓఎస్‌డీ రమాదేవి లంకా పతకాన్ని స్వీకరించారు. ముంబైలో శనివారం ముగిసిన 23వ జాతీయ ఈ-గవర్నెన్స్ 2019-20 సమావేశాల్లో ఈ పతకాన్ని అందజేశారు. 1997 నుంచి కేంద్ర ఐటీ, పాలనా సంస్కరణ విభాగాలు సంయుక్తంగా 'జాతీయ ఈ-గవర్నెన్స్ సదస్సు'ను నిర్వహిస్తున్నాయి.

16న టీఎస్‌పీఎస్సీ కంప్యూటర్ నైపుణ్య పరీక్ష

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలకు ప్రాథమికంగా ఎంపికై నాలుగో విడతలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 16న 'ఆఫీస్ ఆటోమేషన్, కంప్యూటర్ సంబంధ సాఫ్ట్‌వేర్' నైపుణ్య పరీక్ష ఉంటుందని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఓ ప్రకటనలో తెలిపారు. బేవరేజెస్ కార్పొరేషన్‌లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలకు ఎంపికై నాలుగు, ఐదో విడతల్లో సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకున్న అభ్యర్థులకూ ఇది వర్తిస్తుందన్నారు. లా అండ్ ఫైనాన్స్ శాఖలోని అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (కోడ్ నంబరు 12, 13) ఉద్యోగాలకు గ్రూప్-2 ద్వారా ఎంపికైన వారూ ఈ పరీక్షకు హాజరు కావాలన్నారు. నైపుణ్య పరీక్ష హాల్ టికెట్లను ఈ నెల 12 సాయంత్రం 5 గంటల నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి తెలిపారు. వీరికి అకౌంట్స్ నైపుణ్య పరీక్షను ఈనెల 17వ తేదీన నిర్వహిస్తామని చెప్పారు.

వీఆర్ఏలకు గార్డు విధులు!

- గ్రామ రెవెన్యూ సహాయకులకు 'రక్షణ' విధులు
- నిర్మల్ జిల్లా యంత్రాంగం వినూత్న ప్రయోగం
- అబ్దుల్లాపూర్‌మెట్ ఘటన నేపథ్యంలో ఉద్యోగుల భద్రత బాధ్యత అప్పగింత
- ఆర్డర్లీ పనులు.. డ్రెస్‌కోడ్‌పై ఉద్యోగ సంఘాల అభ్యంతరం

సాక్షి, హైదరాబాద్: సంచలనం సృష్టించిన రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ విజయారెడ్డి సజీవదహనం ఉదంతం రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేసిన నేపథ్యంలో నిర్మల్ జిల్లా యంత్రాంగం వినూత్న ప్రయోగం చేపట్టింది. గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏ)కు కొత్త రూపు ఇచ్చింది. వారికి 'రక్షణ'విధులు అప్పగించింది. రెవెన్యూ ఉద్యోగుల భద్రత, సందర్శకుల రాకపోకలపై కన్నేసి ఉంచేందుకు సెక్యూరిటీ గార్డులుగా నియమించింది. తహసీల్దార్ ఆఫీసులకు వచ్చే వారిలో కొందరు తమ సమస్యలు పరిష్కారం కావట్లేదనే ఆక్రోశంతో అధికారులపై దాడులకు పాల్పడుతున్న సంఘటనలు ఇటీవలికాలంలో చోటుచేసుకుంటున్నాయి. గతేడాది నవంబర్ 4న తహసీల్దార్ విజయారెడ్డిని పట్టపగలు ఆమె కార్యాలయంలోనే ఓ రైతు పెట్రోల్ పోసి తగులబెట్టిన ఘటన ఈ కోవలోనిదే. విజయారెడ్డి సజీవదహనం ఉదంతంతో అవాక్కయిన రెవెన్యూ యంత్రాంగం... వారం పాటు విధులు బహిష్కరించింది. రక్షణ కల్పిస్తే తప్ప విధులు నిర్వహించలేమని స్పష్టం చేసింది. రెవెన్యూ కార్యకలాపాలు స్తంభించడంతో రంగంలోకి దిగిన సర్కారు రెవెన్యూ ఉద్యోగుల విధుల నిర్వహణకు పోలీసు రక్షణ కల్పించింది. కానీ క్రమేణా కానిస్టేబుళ్లను వెనక్కి తీసుకుంది. ఈ పరిస్థితుల దృష్ట్యానే నిర్మల్ జిల్లా అధికారులు వీఆర్ఏలకు సెక్యూరిటీ గార్డు విధులు అప్పగించాలని నిర్ణయించారు. అయితే డ్రెస్‌కోడ్‌తో కొత్త అవతారమెత్తిన వీఆర్ఏల వ్యవహారం ప్రస్తుతం రెవెన్యూ శాఖలో హాట్‌టాపిక్‌గా మారింది. ఇప్పటికే మండల కార్యాలయాలు, అధికారుల వద్ద ఆర్డర్లీ సేవలందిస్తున్న వీఆర్ఏలను తాజాగా సెక్యూరిటీ గార్డులుగా నియమించడంపై రాష్ట్ర స్థాయిలో ఉద్యోగ సంఘాలు మండిపడుతున్నాయి.

డ్రెస్‌కోడ్‌పై గరంగరం!

వాస్తవానికి వీఆర్ఏల ప్రధాన విధి గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్వో)కి సహాయకులుగా వ్యవహరించడం. అలాగే అధికారుల గ్రామ సందర్శనలో సహాయకారిగా వ్యవహరించడంతోపాటు లేఖలను ఉన్నతాధికారులకు చేరవేయడం జాబ్‌చార్ట్‌లో భాగం. కానీ ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు భారీ స్థాయిలో ఖాళీగా ఉండటంతో దాదాపు అన్ని మండల కార్యాలయాల్లో వీఆర్ఏల సేవలనే వినియోగించుకుంటున్నారు. ఈ క్రమంలోనే విడతలవారీగా ఆయా గ్రామాల వీఆర్ఏలను మండల ఆఫీసుల్లో విధులకు వినియోగిస్తున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సజీవదహనం, ఆ తర్వాత కొన్ని మండలాల్లోనూ పెట్రోల్ సీసాలు, భౌతికదాడులకు పాల్పడతామంటూ కొందరు ఫిర్యాదుదారులు హెచ్చరికలకు దిగడంతో నిర్మల్ జిల్లా యంత్రాంగం వీఆర్ఏలను సెక్యూరిటీ గార్డులుగా మార్చేసింది. అయితే విధుల నిర్వహణపై పెద్దగా అసంతృప్తి వ్యక్తం చేయకపోయినా డ్రెస్‌కోడ్‌పై మాత్రం ఉద్యోగ సంఘాలు తీవ్ర స్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఉన్నతవిద్య అభ్యసించి వీఆర్ఏలుగా పనిచేస్తున్న తమకు డ్రెస్‌కోడ్‌ను వర్తింపజేయడం అవమానపరచడమేనని మండిపడుతున్నాయి. నిర్మల్ జిల్లా వ్యవహారాన్ని సీరియస్‌గా పరిగణిస్తున్నామని, తక్షణమే డ్రెస్ కోడ్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ వీఆర్ఏల సంఘం గౌరవ అధ్యక్షుడు వింజమూరి ఈశ్వర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం భూపరిపాలన శాఖ డైరెక్టర్ రజత్ కుమార్ సైనీకి వినతిపత్రం అందజేశారు.

నిర్మల్ జిల్లాలోని 19 మండలాల్లో రెవెన్యూ అధికారుల రక్షణ కోసం సెక్యూరిటీ వ్యవస్థ ఏర్పాటుకు ప్రతి మండలం నుంచి ముగ్గురు వీఆర్ఏలను ఎంపిక చేశారు. ప్రతి మండలం నుంచి ఇద్దరు పురుషులు, ఒక మహిళా వీఆర్ఏకు స్థానం కల్పించారు. 19 మండలాల నుంచి సెక్యూరిటీ గార్డులుగా విధుల కోసం 57 మందిని ఎంపిక చేసి వారికి పోలీసుశాఖ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. అధికారులను కలిసేందుకు వచ్చే వారిని చెక్ చేసిన తర్వాతే లోపలికి పంపడం, వారు తెచ్చుకున్న చేతిసంచులు, పత్రాలను పరిశీలించి, ఎక్కడి నుంచి వచ్చారు.. ఏ పనిపై వచ్చారనే విషయాన్ని ఆరా తీయడం, అనుమానస్పదంగా ఉంటే వారిని అడ్డుకోవడం.. తదితర అంశాలపై పోలీసులు వారికి అవగాహన కల్పించారు.

ప్రతి మండలం నుంచి ముగ్గురు...

తాండూరు తహసీల్దార్ కార్యాలయాల్లో సెక్యూరిటీ గార్డు విధుల్లో వీఆర్ఏ

మరో తొమ్మిది కరోనా అనుమానిత కేసులు

- ఇప్పటి వరకు 70 మందికి కరోనా పరీక్షలు..
- 62 మందికి నెగటివ్.. 8 మందికి ఇంకా రావాల్సిన నివేదికలు



హైదరాబాద్: కరోనా అనుమానిత కేసుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. తాజాగా శనివారం 9 అనుమానిత కేసులు నమోదయ్యాయి. దీంతో ఇప్పటి వరకు 70 మంది నుంచి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించగా, 62 కేసుల్లో నెగటివ్ వచ్చింది. మరో 8 మందికి సంబంధించిన రిపోర్టులు ఇంకా రావాల్సి ఉంది. కాగా, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ రమేశ్‌రెడ్డి శనివారం గాంధీ ఆస్పత్రిని సందర్శించారు. అనుమానిత రోగుల రద్దీని దృష్టిలో పెట్టుకుని గాంధీలో 10 పడకల సామర్థ్యంతో అదనంగా మరో ఐసోలేషన్ వార్డును ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఎంఈ చెప్పారు. తెలంగాణలో ఇప్పటి వరకు ఒక్క పాజిటివ్ కేసు కూడా నమోదు కాలేదని, కరోనా వైరస్‌పై సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను నమ్మొద్దని సూచించారు.

5 స్వైన్‌ఫ్లూ కేసులు..

స్వైన్‌ఫ్లూ మహమ్మారి చాపకింద నీరులా విస్తరిస్తోంది. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో శనివారం కొత్తగా 5 స్వైన్‌ఫ్లూ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన ఓ వృద్ధురాలు (64), నల్లగొండ జిల్లా త్రిపురారం గ్రామానికి చెందిన వృద్ధుడు (60), హైదరాబాద్ చాంద్రాయణగుట్టకు చెందిన వృద్ధురాలు (68), మహబూబ్‌నగర్ జిల్లా హేండ్వాడకు చెందిన ఓ వ్యక్తి (35), హైదరాబాద్ ఫతేనగర్‌కు చెందిన నెలన్నర వయసు గల పాపకు స్వైన్‌ఫ్లూ పాజిటివ్ వచ్చింది. మరో ముగ్గురు స్వైన్‌ఫ్లూ అనుమానితులకు గాంధీ ఆస్పత్రి డిజాస్టర్, పీఏసీయూలో అడ్మిట్ చేసి వైద్యసేవలు అందిస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు గాంధీలో 10 స్వైన్‌ఫ్లూ కేసులు నమోదు కాగా.. వీరిలో ఐదుగురిని సురక్షితంగా డిశ్చార్జి చేసినట్లు ఆస్పత్రి వర్గాలు ప్రకటించాయి.

శనివారం పరిశోధన వివరాలు వెల్లడిస్తున్న శాస్త్రవేత్తలు అమితాబ ఛటోపాధ్యాయ, ఆదిత్య కుమార్

కుంగుబాటు మందులపై

కొలెస్ట్రాల్ ప్రభావం

సీసీఎంబీ శాస్త్రవేత్తల పరిశోధనలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: దేశ జనాభాలో కనీసం 5 శాతం మంది దిగులు, కుంగుబాటు వంటి సమస్యలతో బాధపడుతున్నట్లు జాతీయ మానసిక ఆరోగ్య సర్వే (2015-16) గణాంకాలు చెబుతున్నాయి. ఈ మానసిక సమస్యలను పరిష్కరించేందుకు మందులు అందుబాటులో ఉన్నప్పటికీ అవి మరింత సమర్థంగా పనిచేసేందుకు హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) శాస్త్రవేత్తలు ఓ మార్గాన్ని కనుగొన్నారు. డాక్టర్ అమితాబ ఛటోపాధ్యాయ నేతృత్వంలో జరిగిన పరిశోధనల కారణంగా కుంగుబాటు వంటి సమస్యలకు మెరుగైన చికిత్స లభిస్తుందని అంచనా వేస్తున్నారు. జీ ప్రొటీన్ కపుల్డ్ రిసెప్టర్స్ (జీపీసీఆర్) మన కణాల పైపొరలకు అతుక్కుపోయి, కణాలు చేసే పనుల్లో కీలకపాత్ర పోషిస్తుంటాయి. ఈ సూక్ష్మ నానో యంత్రాలు కణాలపై ఉండే ప్రత్యేక ప్రాంతాల ద్వారా లోపలికి, బయటకు తిరుగుతుంటాయి. ఈ ప్రక్రియను ఎండోసైటోసిస్ అని పిలుస్తుంటారు. చాలా వ్యాధుల చికిత్సకు వాడే మందులు ఈ నానో యంత్రాల సాయంతో పనిచేస్తుంటాయి. కుంగుబాటు చికిత్సకు ఉపయోగించే సెరటోనిన్-1ఏ రిసెప్టర్ కూడా సూక్ష్మమైన నానో యంత్రమే. అయితే ఈ సెరటోనిన్ గుంతల్లాంటి నిర్మాణాల ద్వారా లోనికి వెళుతున్నట్లు, అదే ప్రాంతాల నుంచి బయటకు వస్తున్నట్లు ఛటోపాధ్యాయ గతంలో జరిపిన పరిశోధనల ద్వారా తెలిసింది. కణాల్లోని కొలెస్ట్రాల్ మోతాదులను నియంత్రించినప్పుడు సెరటోనిన్ ఏం చేస్తుందో తెలుసుకునేందుకు ఛటోపాధ్యాయ కొన్ని పరిశోధనలు చేశారు. కొలెస్ట్రాల్‌ను తగ్గించే స్టాటిన్లను ఉపయోగించినప్పుడు సెరటోనిన్ మామూలు మార్గానికి భిన్నమైన ప్రాంతం నుంచి లోనికి వెళుతోందని, కొలెస్ట్రాల్ చేర్చగానే మళ్లీ పాత పద్ధతిని ఉపయోగిస్తోందని తాము గుర్తించామని ఆయన తెలిపారు. స్టాటిన్లను ఉపయోగించినప్పుడు సెరటోనిన్ రిసెప్టర్లు కణం లోపలే నాశనమవుతున్నట్లు తెలిసింది. దీనిని బట్టి కొలెస్ట్రాల్ అనేది జీపీసీఆర్‌లను ఎలా నియంత్రిస్తుందో తెలుస్తోందని ఈ పరిశోధనల్లో పాల్గొన్న మరో శాస్త్రవేత్త జి.ఆదిత్య కుమార్ తెలిపారు. స్టాటిన్లతో కలిపి వాడినప్పుడు కుంగుబాటు చికిత్సలో వాడే మందులు ఎక్కువ ప్రభావశీలంగా పనిచేసేందుకు కారణాలు తెలుస్తాయని వివరించారు.

'సాక్షి' కార్టూనిస్టు శంకర్‌కు పురస్కారం

హైదరాబాద్: 'సాక్షి'దినపత్రిక కార్టూనిస్టు శంకర్ జీవన సాఫల్య పురస్కారాన్ని అందుకున్నారు. సోమాజిగూడలోని ది పార్క్ హోటల్‌లో శనివారం జరిగిన కార్టూన్ ఫెస్టివల్‌లో ఆయన ఈ అవార్డును అందుకున్నారు. కార్టూన్ వాచ్ ఆధ్వర్యంలో 2019, 2020 సంవత్సరాలకు గానూ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎన్ఎండీసీ సీఎండీ ఎన్.బైజేంద్ర కుమార్ అవార్డులను ప్రదానం చేశారు. 2020 సంవత్సరానికి సాక్షి కార్టూనిస్టు శంకర్, నవ తెలంగాణ కార్టూనిస్టు నర్సిం, నమస్తే తెలంగాణ కార్టూనిస్టు మృత్యుంజయ్‌లకు జీవన సాఫల్య పురస్కారాలను అందజేసి ఘనంగా సత్కరించారు. 2019 సంవత్సరానికి గానూ దివంగత సీనియర్ కార్టూనిస్టు మోహన్, సీనియర్ కార్టూనిస్టులు జయదేవ్ బాబు, ఎం.ఎస్.రామకృష్ణ జీవన సాఫల్య పురస్కారానికి ఎంపికయ్యారు. దివంగత సీనియర్ కార్టూనిస్టు మోహన్ తరపున జర్నలిస్టు ప్రకాష్ ఈ అవార్డును అందుకున్నారు. తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ.. చిన్న గీత, వ్యాఖ్యానంతో కూడిన కార్టూన్ ఆలోచింపజేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా కార్టూన్ వాచ్ స్పెషల్ ఎడిషన్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'సహకార' నామినేషన్లు

- 905 పీఏసీఎస్‌ల పరిధిలో 36,969 నామినేషన్ల దాఖలు
- చివరి రోజు కావడంతో భారీగా వచ్చిన నామినేషన్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఎన్నికల నామినేషన్ల దాఖలు ప్రక్రియ శనివారంతో ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 905 పీఏసీఎస్‌ల పరిధిలోని డైరెక్టర్ల పదవులకు చివరి రోజు భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ నెల 6న నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కాగా, 3 రోజుల వ్యవధిలో మొత్తం 36,969 నామినేషన్లు దాఖలయ్యాయి. చివరి రోజు శనివారం అత్యధికంగా 22,684 నామినేషన్లు వచ్చినట్లు రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ ప్రకటించింది. మొదటి రోజు 2,316, రెండో రోజు 11,959 నామినేషన్లు దాఖలయ్యాయి. వెయ్యికి పైగా డైరెక్టర్ స్థానాలకు ఒక్కో నామినేషన్ చొప్పున మాత్రమే దాఖలు కావడంతో ఈ స్థానాల్లో ఎన్నిక ఏకగ్రీవం కానుంది. ఆదివారం నామినేషన్ల పరిశీలన, సోమవారం నామినేషన్ల ఉపసంహరణ ఉండటంతో, ఈ నెల 10 సాయంత్రం ఏకగ్రీవ డైరెక్టర్ స్థానాలపై స్పష్టత రానుంది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో తమ గెలుపునకు సహకరించిన నేతలు, కార్యకర్తలను పీఏసీఎస్‌లలో పోటీకి దించారు. పార్టీల గుర్తుతో ఎన్నికలు జరగకున్నా.. టీఆర్ఎస్, కాంగ్రెస్ మద్దతుదారులు ఎక్కువ మంది బరిలోకి దిగారు.

అత్యధికంగా నిజామాబాద్‌లో..

అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలో 89 ప్యాక్స్‌ల పరిధిలో 2,988 మంది నామినేషన్లు వేశారు. ఖమ్మం జిల్లాలో 76 ప్యాక్స్‌లకు 2,546 నామినేషన్లు, నల్లగొండ జిల్లాలో 42 ప్యాక్స్‌లకు 2,272 నామినేషన్లు, సూర్యాపేట జిల్లాలో 47 ప్యాక్స్‌లకు 2,169 నామినేషన్లు వచ్చాయి. అత్యల్పంగా జోగుళాంబ-గద్వాల జిల్లాలో 11 ప్యాక్స్‌లకు 452 నామినేషన్లు దాఖలైనట్లు సహకార శాఖ ఎన్నికల అథారిటీ వెల్లడించింది. 10న అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు చేయనున్నట్లు ఎన్నికల అథారిటీ అధికారులు వెల్లడించారు.

SI & కానిస్టేబుల్స్ న్యూ బ్యాచ్: 11-02-2020 ఉ. 10 గంటలకు
శ్యామ్ H.O: కాకినాడ - 98482 56254 B.O: హైదరాబాద్ - 88926 21234

SI & కానిస్టేబుల్స్
T/M NEW BATCH : 10-02-2020@2PM
E/M NEW BATCH : 10-02-2020@9AM
యూనిక్

S.I. కానిస్టేబుల్
FREE DEMO NEW BATCH 12-02-2020
HIP హైదరాబాద్ ఇన్‌స్టిట్యూట్ 9848262600, 9849771902

NAGARJUNA'S STUDY CIRCLE
ASHOK NAGAR, HYDERABAD.
TSPSC Group - 2 STATE 1st Rank
APPSC TSPSC Gr-2 బ్యాచ్ ECONOMY SPL. BATCH
Demo @ 10.00 am 9-2-2020
040-27604111 / 9989104111

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com